

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 173

మంగళవారం 13-9-2022



అల్‌కరాజ్ అదరహో


యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచి నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న అల్‌కరాజ్ - 12లో



వేదాంత సెమీకండక్టర్ ప్లాంట్

ఫాక్స్‌కాన్‌తో కలిసి గుజరాత్‌లో ఏర్పాటు చేయాలని వేదాంత నిర్ణయం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆ పిటిషన్‌పై ఇక విచారణ

వారణాసిలోని జ్ఞానవాపి మసీదు కేసులో హిందువుల పిటిషన్‌పై విచారణ కొనసాగించాలని వారణాసి కోర్టు నిర్ణయించింది.

వివరాలు 6లో



ఎన్‌ఐఏ సోదాలు

దేశంలోకి డ్రగ్స్ తేవడం, ఆ సొమ్మును ఉగ్రవాదానికి వాడుతున్నారన్న కేసులో.. ఎన్‌ఐఏ పలు రాష్ట్రాల్లో సోదాలు చేసింది.

వివరాలు 6లో



ఆప్ కార్యాలయంలోకి పోలీసులు

అహ్మదాబాద్‌లోని తమ కార్యాలయంలో పోలీసులు అక్రమంగా సోదాలు జరిపారని ఆప్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో



సికింద్రాబాద్‌లో అగ్ని ప్రమాదం

సికింద్రాబాద్‌లోని ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో చెలరేగిన మంటలు.. పై అంతస్తులోని లాడ్జిలోకి వ్యాపించడంతో ఏడుగురు మరణించారు.

వివరాలు 14లో

న్యూస్‌రీల్

'స్మార్ట్ విలేజ్' సుధాకర్‌కు రిమాండ్



స్మార్ట్ విలేజ్ అనే సంస్థ ద్వారా 7,000 మంది నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.300 కోట్లు వసూలు చేసిన ఇందుపూడి సుధాకర్‌ను సీఐడీ పోలీసులు అరెస్టు చేయగా.. కోర్టు రిమాండ్ విధించింది. ఈ విషయం తెలుసుకున్న బాధితులు తమకు న్యాయం చేయాలంటూ సీఐడీ కార్యాలయానికి చేరుకున్నారు.

వివరాలు 5లో ▸

'వికేంద్రీకరణ'తోనే రాష్ట్రానికి భవిష్యత్



రాష్ట్ర విభజనతో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం జగన్ మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. మూడు రాజధానుల ద్వారా రాష్ట్రానికి మంచి జరగడం చంద్రబాబుకు ఇష్టం లేదని మంత్రి విడదల రజిని విమర్శించారు. రాష్ట్రం కోసం కాకుండా.. తన సామాజికవర్గం కోసం చంద్రబాబు చేయిస్తున్న అమరావతి యాత్రను ఉత్తరాంధ్రవాసులు అడ్డుకొని తీరుతారని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు.

వివరాలు 3లో ▸

నాడు–నేడు స్కూళ్లలో.. నిరంతర పరిశీలన

ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం

- పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలపై పరిశీలన
- అవసరమైన చోట్ల వెంటనే మరమ్మతులు.. నెలకోసారి తనిఖీ
- మెయింటెనెన్స్ ఫండ్‌తో సమర్థంగా స్కూళ్ల నిర్వహణ
- సమస్యలుంటే తెలియచేసే టోల్‌ఫ్రీ నంబర్ 14417తో బోర్డులు
- స్కూళ్ల నిర్వహణలో సచివాలయ ఉద్యోగుల భాగస్వామ్యం
- ప్రతి వారం సందర్శించనున్న సంక్షేమ, విద్యా అసిస్టెంట్, మహిళా పోలీసులు.. నెలకు ఒకసారి స్కూళ్లకు ఏఎన్‌ఎంల రాక
- టీచర్లు, 8వ తరగతి విద్యార్థుల కోసం 5,18,740 ట్యాబ్‌లు
- తొలిదశ స్కూళ్లలో మార్చి నాటికి తరగతి గదుల డిజిటలైజేషన్
- రూ.512 కోట్లతో స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ టీవీల ఏర్పాటు
- మరింత నాణ్యంగా విద్యాకానుక బ్యాగులు



ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ఇస్తున్న పుస్తకాల బ్యాగ్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మన బడి నాడు–నేడు ద్వారా పనులు పూర్తైన పాఠశాలల్లో నిరంతరం ఆడిట్ నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. స్కూళ్లలో కల్పించిన సౌకర్యాలు బాగున్నాయా? లేదా? అన్నది పరిశీలన చేయాలని, అవసరమైన చోట వెంటనే పనులు, మరమ్మతులు చేపట్టాలని నిర్దేశించారు. నెలకు ఒకసారి తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. స్కూళ్ల మెయింటెనెన్స్ ఫండ్‌ను వినియోగించుకుని నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా తెలియ చేసేందుకు వీలుగా ఏర్పాటైన టోల్‌ఫ్రీ నంబర్‌ను అందరికీ తెలిసేలా ప్రదర్శిస్తూ పాఠశాలల్లో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి 14417 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. పాఠశాల విద్య, నాడు–నేడు, విద్యాకానుక, బైజూస్ కంటెంట్‌తో

మిగతా 2వ పేజీలో ▶

కృష్ణంరాజు పార్థివదేహం వద్ద విషణ్ణ వదనాలతో ప్రభాస్, కుటుంబ సభ్యులు





కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో కృష్ణంరాజు అంత్యక్రియలు

పోలీసుల గౌరవ వందనం..

చితికి నిప్పంటించిన తమ్ముడి కుమారుడు ప్రబోధ్

అంతిమయాత్ర దారిపొడవునా అభిమానుల అశ్రునివాళి

ఘన నివాళులర్పించిన సినీ, రాజకీయ ప్రముఖులు

హైదరాబాద్: ప్రముఖ నటుడు, కేంద్ర మాజీ మంత్రి ఉప్పలపాటి కృష్ణంరాజు (83) అంత్యక్రియలు సోమవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడిలోని వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి. పోలీసులు గౌరవ వందనంలో భాగంగా గన్ సెల్యూట్ చేసిన అనంతరం కృష్ణంరాజు సోదరుని కుమారుడు ప్రబోధ్ ఆయన చితికి నిప్పంటించారు. అంతకు ముందు జూబ్లీహిల్స్‌లోని నివాసం నుంచి మధ్యాహ్నం అంతిమయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా దారిపొడవునా నిల్చున్న అభిమానులు ఆయనకు కడసారి నివాళులర్పించారు.

నివాళులు అర్పించిన ప్రముఖులు..

అంతిమయాత్ర ప్రారంభానికి ముందు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు

మిగతా 2వ పేజీలో ▶

పేదలకు కొండంత భరోసా

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకంపై వాడవాడలా వేడుకలు

- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు
- 'పదో' తరగతి ఉత్తీర్ణత అర్హతతో గొప్ప మేలు
- ఇది అతిపెద్ద సామాజిక మార్పునకు నాంది అంటున్న మేధావులు
- పేదలకు ఉపయోగపడే పథకాలు అమలు చేస్తున్న సీఎంకు అభినందనలు

2




నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

గోదావరి మళ్లీ ఉగ్రరూపం

- మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లో విస్తారంగా వర్షాలు
- ఉపనదులు ఉరకలేస్తుండటంతో గోదావరిలో పెరిగిన వరద
- మేడిగడ్డ బ్యారేజ్ నుంచి 10.07 లక్షల క్యూసెక్కులు దిగువకు
- తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి 10.22 లక్షల క్యూసెక్కులు
- భద్రాచలం వద్ద 45.6 అడుగులకు చేరిన నీటిమట్టం..
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ.. పోలవరం వద్ద అప్రమత్తమైన అధికారులు
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 7.05 లక్షల క్యూసెక్కులు కదలిలోకి

14లో

ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం







నేటి నుంచి 'ఈఏపీ సెట్'


వెబ్ ఆప్షన్లు



■ ఏపీ ఈఏపీ సెట్(ఎంపీసీ) కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేయొచ్చు. 22న సీట్లు కేటాయిస్తారు.

2లో

దేశానికే ఏపీ రోల్‌మోడల్



■ 'ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు సేవలందించడంలో ఏపీ ప్రభుత్వం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచింది. ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు ఆలోచనే అద్భుతం. జాతీయ స్థాయిలో ఏపీ మోడల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముంది. దీనిపై కేంద్రానికి నివేదిక ఇస్తాం' అని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ ప్రెసిడెంట్ మహాపాత్ర ప్రశంసించారు.

5లో

రౌడీషీట్లు తెరవచ్చు

పోలీసు స్టాండింగ్ ఆర్డర్స్‌పై సింగిల్ జడ్జి తీర్పు అమలు నిలుపుదల

3లో





క్లుప్తంగా

చైల్డ్ హెల్ప్‌లైన్‌గా డయల్ 112



సాక్షి, అమరావతి: పిల్లల సంక్షేమం, రక్షణ కోసం నిర్వహిస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను ఇకపై డయల్ 112కు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. చిన్నారుల సంక్షేమం కోసం ఇటీవల ప్రకటించిన 'మిషన్ వాత్సల్య పథకం'లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి మనోజ్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇది నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.

షాదీ తోఫాను ఉపయోగించుకోవాలి

ఏపీ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ షాదీ తోఫాను ముస్లిం మైనారిటీలు ఉపయోగించుకోవాలని ఏపీ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ తెలిపారు. అర్హులైన వారందరూ సమీపంలో ఉన్న సచివాలయానికి వెళ్లి వలంటీర్ సాయంతో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కుప్పంలో సీఎం పర్యటించే స్థలాల పరిశీలన



సీఎం జగన్ పర్యటించే స్థలాలను పరిశీలిస్తున్న నాయకులు

కుప్పం: వైఎస్సార్ చేయూత పథకం నిధులను జమ చేయడానికి ఈ నెల 22న సీఎం వైఎస్ జగన్ కుప్పంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు.. నారాయణ స్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్.. సీఎం వైఎస్ జగన్ పర్యటించనున్న ప్రదేశాలను సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా హెలిప్యాడ్ కోసం పీఈఎస్ మెడికల్ కళాశాల, కుప్పం చెరువు కట్ట, పెద్దబంగారునత్త గ్రామం వద్ద స్థలాలను చూశారు. అలాగే బహిరంగ సభ కోసం ఎన్‌టీఆర్ స్టేడియం, అనిమిగానిపల్లె గ్రామ సమీపంలోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు.. ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఈఏపీ సెట్' వెబ్ ఆప్షన్లు

22న సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీ సెట్ (ఎంపీసీ విభాగం) కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్ ఆప్షన్ల నమోదు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరడానికి విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్లను నమోదు చేయొచ్చు. ఈ మేరకు కన్వీనర్ సి.నాగరాణి షెడ్యూల్ విడుదల చేశారు. ఈఏపీ సెట్‌లో 1వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు ఈ నెల 17 వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేయొచ్చు. ఆప్షన్ల నమోదులో మార్పులు చేర్పులకు ఈ నెల 18న అవకాశం ఉంది. 22న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందినవారు సెల్ఫ్ రిపోర్టింగ్‌తోపాటు ఆయా కాలేజీల్లో ఈ నెల 23 నుంచి 27లోపు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 26 నుంచి కాలేజీల్లో తరగతులు ప్రారంభమవుతాయి. కాగా తమ ఆప్షన్లను మార్చుకోవాలనుకునే విద్యార్థులు ఆప్షన్ల నమోదులో లోపాల సవరణ లేదా ఓటీపీ, మొబైల్ నంబర్ సమస్యలు ఏర్పడితే సమీపంలోని హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సందర్శించాలని కమిషనర్ సూచించారు.

ఏపీ సహా 6 రాష్ట్రాల్లో పీబీసీఆర్

ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ (పీబీసీఆర్) ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించింది. కమిటీ పలు నివేదికలను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు సోమవారం అందజేసింది. దేశవ్యాప్తంగా క్యాన్సర్ రకాల గురించి వాస్తవ సమాచారం పొందడానికి గ్రామీణ ప్రాంతాల జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ ఉండాల్సిన అవసరం ఉందని కమిటీ నివేదికలో పేర్కొంది. పీబీసీఆర్, ఆస్పత్రుల ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు పదిశాతం మాత్రమే పనిచేస్తున్నాయని అసంతృప్తిని వ్యక్తం చేసింది. రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్స్, రీసెర్చ్‌కు సిఫార్సు చేసింది. ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఈ రిజిస్ట్రీలు ఏర్పాటు చేయాలని సూచించింది.

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం భేష్

- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి భారతీ ప్రవీణ్‌పవార్ కితాబు
- 64 పరీక్షలు, 350 రకాల మందులు ఉచితంగా ఇస్తున్నారని వ్యాఖ్య
- వైద్య విద్యలో మెరుగైన కృషి జరుగుతోందని వెల్లడి



మచిలీపట్నంలో జరిగిన స్పందనలో అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భారతి ప్రవీణ్ పవార్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు మంచి వైద్యసేవలు అందుతున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్‌పవార్ కితాబిచ్చారు. ఎక్కువ మంది విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యను అందించడానికి కూడా కృషి జరుగుతోందని చెప్పారు. మూడ్రోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆమె సోమవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తన రాష్ట్ర పర్యటనలో భాగంగా.. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందించే వైద్యసేవలను తనిఖీ చేసినట్లు ఆమె చెప్పారు. 64 రకాల పరీక్షలను, 350 రకాల మందులను ఉచితంగా ఇస్తున్నారన్నారు. మచిలీపట్నంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను కూడా పరిశీలించినట్లు భారతీ ప్రవీణ్‌పవార్ చెప్పారు. ఆ కాలేజీకి 150 సీట్లను కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. నిర్ణీత గడువులోగా మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తిచేయాలని సూచించానన్నారు. ఇక 'స్పందన' కార్యక్రమంలోనూ తాను పాల్గొన్నట్లు కేంద్రమంత్రి చెప్పారు. కొంతమంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఐదు కేజీల కంటే తక్కువ బియ్యం పంపిణీ జరుగుతున్న విషయం తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. మచిలీపట్నంలో 8,912 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయిందని.. అయితే, ఆ ప్రాంతానికి ప్రభుత్వం రోడ్లు, మంచినీరు, కరెంట్ వసతి కల్పించాల్సి ఉందని, డిసెంబరు నాటికి ఆయా పనులు పూర్తిచేస్తామని అధికారులు చెప్పారన్నారు. అలాగే, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్రం దేశవ్యాప్తంగా పేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ సమయంలో.. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలుచేస్తున్న విషయాన్ని మీడియా గుర్తుచేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా పొరుగు రాష్ట్రాల్లో వైద్యం చేయించుకునే అవకాశం ఉండదు కదా అని కేంద్రమంత్రి బదులివ్వగా.. చెన్నై, హైదరాబాద్, బెంగళూరులో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని విలేకరులు వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో మిగిలిన రాష్ట్రాల్లోనూ వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుంది కదా అని కేంద్రమంత్రి వివరించారు.

'ఫ్యామిలీ డాక్టర్' గురించి తెలీదు

ఇక రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురించి తనకు పూర్తిగా అవగాహనలేదని.. వైద్య సేవలకు సంబంధించి కేంద్రం రాష్ట్రాలతో కలిసి చాలా కార్యక్రమాలు అమలుచేస్తోందని, అవి సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్న దానిపై తాను ప్రధానంగా దృష్టి పెట్టినట్లు భారతీ ప్రవీణ్‌పవార్ చెప్పారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి నిధులతో అమలయ్యే పథకాలలో కేంద్రానికి కూడా రాష్ట్రాలు తగిన గుర్తింపునివ్వాలని, ప్రధాని మోదీ ఫొటోను ఉంచాలని ఆమె ఆకాంక్షించారు.

'స్పందన'పై కేంద్రం ఆసక్తి!

- కృష్ణా జిల్లా మచిలీపట్నంలో స్పందనకు హాజరైన కేంద్ర సహాయ మంత్రి
- తన పర్యటనలో లేకున్నా ఆకస్మికంగా హాజరు
- అద్భుత కార్యక్రమం అంటూ కితాబు

సాక్షి, మచిలీపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమంపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్ సోమవారం ఆకస్మిక పర్యటనే ఇందుకు నిదర్శనం. కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్ రెండు రోజులుగా కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం మచిలీపట్నం సమీపంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలను పరిశీలించాల్సి ఉంది. అయితే సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం ఉందని తెలుసుకున్న కేంద్ర సహాయ మంత్రి.. మెడికల్ కళాశాల పర్యటనను కొంత సమయం వాయిదా వేసి.. నేరుగా స్పందన కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు కలెక్టర్‌కు ఫిర్యాదులు ఇచ్చేందుకు వేచి ఉండటాన్ని గమనించి.. తనకు కేటాయించిన సీట్లో కూర్చున్నారు.

ఆసక్తిగా పరిశీలిస్తూ.. నోట్ చేసుకుంటూ..

అర్జీదారులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలివ్వడం, సమస్యను వివరించడాన్ని గమనించారు. ఫిర్యాదు చేసిన వారి గురించి కలెక్టర్ రంజిత్‌బాషా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్, ఎంపీడీవోలతో మాట్లాడటం, సమస్య పరిష్కారం కాకపోవటానికి గల కారణాలపై ఆరా తీయటం వంటి విషయాలను ఆమె ప్రత్యక్షంగా చూస్తూ అధికారుల పనితీరును గమనించారు. రేషన్ కార్డులు, హౌసింగ్ కోసం వచ్చిన అర్జీదారుల సమస్య పరిష్కారం కోసం అక్కడే ఉన్న సంబంధిత అధికారులను కలెక్టర్ పిలిచి వివరణ అడగడాన్ని ఆసక్తిగా గమనించారు. అనంతరం ఆ వివరాలన్నీ తన పుస్తకంలో నోట్ చేసుకున్నారు. అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం భేషుగ్గా ఉందంటూ ప్రశంసించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని చక్కగా పరిష్కరిస్తున్నారంటూ అభినందించారు. ఇదో చక్కటి కార్యక్రమం అంటూ కితాబిచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆరా తీశారు. అనంతరం మచిలీపట్నం సమీపంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలను ఆమె పరిశీలించి పలు సూచనలిచ్చారు.

పేదలకు కొండంత భరోసా





సీఎం చిత్రపటానికి కర్నూలులో క్షీరాభిషేకం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాలాభిషేకం



రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి, నెట్‌వర్క్ : పేద వర్గాలకు చెందిన యువతుల వివాహాలను గౌరవంగా జరిపించేందుకు, ఆ కుటుంబాలకు అండగా నిలిచేందుకు వీలుగా వచ్చే అక్టోబర్ ఒకటో తేదీ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అలాగే, బాలికల్లో అక్షరాస్యత శాతం పెంపుదలే లక్ష్యంగా కనీసం పదవ తరగతి పాసయ్యే వరకు చదివించాలన్న నిబంధన విధించడంవల్ల ఆయా వర్గాల కుటుంబాలకు గొప్ప మేలు జరుగుతుందని విద్యా, సామాజిక రంగం నిపుణులు చెబుతున్నారు. ఇది అతిపెద్ద సామాజిక మార్పునకు నాంది పలికినట్లు అవుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. పలు జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సంబరాలు నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో సీతమ్మధారలోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భీమిలిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జ్ మైలపల్లి షణ్ముఖరావు, అధ్యక్షుడు అల్లిపల్లి నరసింగరావు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కూడా విశాఖ డెయిరీలోని తన కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొత్త గాజువాక జంక్షన్‌లోని వైఎస్ విగ్రహం వద్ద 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, మైనార్టీ సెల్ నేత ఎస్ఎండీ గౌస్ ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా సంబరాలు నిర్వహించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో..

ఇక పాడేరు పాతబస్టాండులోని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఎదుట వైఎస్సార్ కళ్యాణమస్తుకు మద్దతుగా విజయోత్సవాన్ని నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే, జీకే వీధి మండల కేంద్రంలో ఎంపీపీ బోయిన కుమారితో పాటు ఇతర నేతలు, చింతపల్లిలో మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ జల్లి హలియారాణి, సర్పంచ్ దురియా పుష్పలత, ఇతర నేతలు, కొయ్యూరులో ఎంపీపీ రమేష్ ఆధ్వర్యంలోను, జి.మాడుగులలో మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షులు ఎస్‌కే నాగూర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలంతా సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే, అరకులోయలోని ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ క్యాంపు కార్యాలయంలోనూ ఇదే తరహాలో సంబరాలు నిర్వహించారు. మిగిలిన మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలోని రాజవొమ్మంగి మండలం దోనెలపాలెం గ్రామంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఇతర నేతలంతా ఘనంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా వేడుకలు నిర్వహించారు.

సీఎం నిర్ణయంపై హర్షం

ఇక వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట, పార్వతీపురం ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. పథకాల అమలును స్వాగతిస్తూ సాలూరు మండలంలోని మామిడిపల్లి, చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణ, సీతానగరం మండలంలోని జానుముల్లువలస, కొత్తవలస పంచాయతీ ప్రజలు సీఎం జగన్ చిత్రపటాలకు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు సోమవారం క్షీరాభిషేకాలు చేశారు. పేదలకు ఉపయోగపడే పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రిని మనసారా అభినందించారు.

చెంచులకు 'ఉపాధి హామీ' ఇవ్వండి

- కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- అల్ప సంఖ్యాకులైన చెంచులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

సాక్షి, అమరావతి: నల్లమల అటవీ ప్రాంతంలో చెంచుల బతుకు దెరువు కోసం ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. మారిన నిబంధనలతో కేంద్ర ప్రభుత్వం గతేడాది చెంచులకు ఈ పథకాన్ని నిలిపివేసింది. దీంతో అత్యల్ప సంఖ్యాకులైన చెంచులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉపాధి హామీ కోసం కేంద్రానికి లేఖ రాసింది. ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులకు ప్రత్యేక పథకంగా ఉపాధి హామీని 2009 నుంచి వర్తింపజేసి 180 రోజుల పనిదినాలు కల్పించారు. దీనికి తోడు ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అనే నిబంధన కాకుండా సడలించి.. ముగ్గురికి జాబ్‌కార్డ్ ఇచ్చారు. ఆ ముగ్గురికి మొత్తంగా 540 పనిదినాలు ఇచ్చేవారు. పోషకాహారలోపంతో బలహీనంగా ఉండే చెంచులకు ప్రత్యేక మినహాయింపు కూడా ఇచ్చారు. 70 % పని చేస్తే వంద శాతం పనిచేసినట్టు చూపి చెల్లింపులు జరిపేవారు. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 125 గ్రామాల్లోని చెంచు కుటుంబాల బతుక్కి భరోసా దక్కేది. వారికి కేటాయించే పని దినాలను లెక్కగట్టి ఉపాధి కూలి మొత్తంలో పని చేయక ముందే సగం డబ్బులను అడ్వాన్సుగా ఇచ్చేవారు. మిగిలిన సగం పని పూర్తి చేసిన తర్వాత ఇచ్చేవారు. మొత్తం పనిదినాల్లో మొత్తం కూలిని సగం నగదుగాను, మిగిలిన సగాన్ని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా కందిపప్పు, బియ్యం, చింతపండు, బెల్లం, చక్కెర వంటి 20 రకాల సరుకులు ఇచ్చేవారు. దీన్నే ఫుడ్ బాస్కెట్ అని పిలిచేవారు. కాగా, ఫుడ్ బాస్కెట్ పద్ధతి 2012తో ఆగిపోవడంతో మొత్తం నగదును ఇవ్వడం ప్రారంభించారు. వారికి నిర్ణయించిన రోజువారీ వేతనం డబ్బులను ఎప్పటికప్పుడు చెల్లింపులను మరింత సులభతరం చేస్తూ చెంచు మహిళలతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రూపులో ముగ్గురు లీడర్లకు ఉపాధి హామీ పనుల నగదు చెల్లింపులు బాధ్యతలు అప్పగించేవారు. ఇలా అన్ని రకాలుగా ఊతమిచ్చిన ఉపాధి హామీ కేంద్రం నిబంధనలతో గతేడాదిలో ఆగిపోవడంతో చెంచులు ఆవేదన చెందుతున్నారు.

చెంచులకు ఉపాధి కోసం కేంద్రాన్ని కోరాం



దేశంలో అత్యంత అల్ప సంఖ్యాకులుగా ఉన్న చెంచుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అనేక చర్యలు చేపట్టాం. వారికి ఎంతో మేలు చేసే ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిలిపివేయడం ఇబ్బందికరంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లోని 171 చెంచు గూడెంలలో ప్రజలకు ఉపాధిలేక అవస్థలు పడుతున్నారు. పరిస్థితిని సానుకూలంగా ఆలోచించి చెంచులను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని ఉపాధి హామీ కల్పించాలని కేంద్రాన్ని కోరాం. ఇటీవల దేశంలోని అన్ని రాష్ట్రాల గిరిజన శాఖలతో నిర్వహించిన సమావేశంలోను కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి అర్జున్‌ముండాకు చెంచుల పరిస్థితిని వివరిస్తూ ఉపాధి కొనసాగింపు కోసం నివేదిక ఇచ్చాం.

– పీడిక రాజన్నదొర, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి

నాడు–నేడు స్కూళ్లలో నిరంతర పరిశీలన

▶ మొదటి పేజీ తరువాయి



స్కూళ్లలో నాడు–నేడు పనులు, ట్యాబ్‌ల పంపిణీపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్

ట్యాబ్‌ల పంపిణీ, తరగతి గదుల డిజిటలైజేషన్‌పై సీఎం జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విద్యాకానుక కింద పిల్లలకు ఇచ్చే బ్యాగుల నాణ్యతను ఈ సందర్భంగా సీఎం స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందచేసే బ్యాగులు మరింత నాణ్యంగా, మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాడు – నేడు కింద పనులు పూర్తైన స్కూళ్లలో ఆడిట్‌కు సంబంధించిన వివరాలను అధికారులు అందచేశారు. స్కూళ్లలో సౌకర్యాలకు సంబంధించి గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీఎం సమీక్షలో ముఖ్యాంశాలు ఇవీ..

తల్లిదండ్రుల కమిటీలు క్రియాశీలకం

స్కూళ్ల నిర్వహణలో తల్లిదండ్రుల కమిటీలను నిరంతరం క్రియాశీలకం చేయాలని సీఎం జగన్ సూచించారు. స్కూళ్ల అభివృద్ధి, నిర్వహణలపై తరచూ వారితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎంఈవోలకు అకడమిక్, స్కూళ్ల నిర్వహణ బాధ్యతలు

మండల విద్యాశాఖ అధికారుల్లో (ఎంఈవో) ఒకరికి అకడమిక్ వ్యవహారాలు, మరొకరికి స్కూళ్ల నిర్వహణ అంశాల బాధ్యతలను అప్పగించాలని సీఎం జగన్ ఆదేశించారు. స్కూళ్ల నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు కూడా భాగస్వాములు కానున్నారు. వెల్ఫేర్–ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు ప్రతివారం స్కూళ్లను సందర్శించనున్నారు. నెలకు ఒకసారి ఏఎన్ఎంలు సందర్శించనున్నారు. స్కూళ్ల నిర్వహణలో తమ దృష్టికి వచ్చిన అంశాలను ఫొటోలతో సహా సచివాలయ సిబ్బంది అప్‌లోడ్ చేయనున్నారు. అధికారులు వీటిపై వెంటనే తగిన చర్యలు తీసుకుంటారు. ఎవరెవరు ఏం చేయాలో నిర్దిష్టంగా ఎస్‌వోపీలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

విలేజ్ క్లినిక్ పరిధిలోకి పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత నిర్ధారణ

గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత నిర్ధారణను విలేజ్ క్లినిక్ పరిధిలోకి తేవాలని సూచించినట్లు ముఖ్యమంత్రి జగన్ గుర్తు చేశారు. వీటిపై ఎప్పటికప్పుడు విలేజ్ క్లినిక్స్ పంపే నివేదికలను అనుసరించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా అంటువ్యాధులు, రోగాలను చాలావరకు నివారించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

5,18,740 ట్యాబ్‌ల కొనుగోలు

టీచర్లకు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కోసం తీసుకుంటున్న చర్యలపై సీఎం జగన్ సమీక్షించారు. వీరి కోసం 5,18,740 ట్యాబ్‌లను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ట్యాబ్‌ల్లో 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ చేసి ఇవ్వనున్నారు. ఏటా స్కూళ్లు తెరిచే నాటికి పిల్లల చేతికి విద్యాకానుక కచ్చితంగా అందాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. యూనిఫామ్స్ కుట్టు కూలీ డబ్బులను విద్యాకానుక ప్రారంభం రోజునే తల్లుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు.

మార్చికి తొలి దశ తరగతి గదుల డిజిటలైజేషన్

తరగతి గదుల డిజిటలైజేషన్‌లో భాగంగా స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ టీవీలను సమకూర్చటంపై సీఎం జగన్ సమీక్షించారు. 72,481 స్మార్ట్ టీవీ యూనిట్లు అవసరమని అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. దశలవారీగా తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందుకు దాదాపు రూ.512 కోట్లకుపైగా వ్యయం కానుందని అంచనా. మనబడి నాడు – నేడు తొలిదశ పనులు పూర్తైన స్కూళ్లలో వచ్చే ఏడాది మార్చి నాటికి తరగతి గదుల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సీఎం నిర్దేశించారు. అందుకు నవంబర్‌లో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

అన్ని చోట్లా ఇంటర్నెట్

అన్ని స్కూళ్లలో ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. డిజిటల్ లైబ్రరీలతో సహా గ్రామ సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్‌లో కూడా ఇంటర్నెట్ అందుబాటులోకి తేవాలని సూచించారు. సమీక్షలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ సమీర్ శర్మ, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్, ఇంటర్ విద్య కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, పాఠశాల విద్యాశాఖ సలహాదారు ఏ.మురళి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణలో ఏపీ టాప్


- నివేదిక విడుదల చేసిన కేంద్రం
- రాష్ట్రంలో ఏప్రిల్–ఆగస్టు మధ్య 3.65 లక్షల మందికి శిక్షణ

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి అవగాహన, అమలుపై గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం దక్కించుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఎస్ఐఆర్‌డీ (స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్) ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో పనిచేసే 3,65,084 మంది ఉద్యోగులకు ప్రభుత్వం శిక్షణ అందజేసింది. కేంద్రం అన్ని రాష్ట్రాల్లో ఈ తరహా శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టగా, దేశంలో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాత అసోం 77 వేల మందికి శిక్షణ అందజేసి రెండో స్థానంలో నిలిచింది. దేశంలో మరే రాష్ట్రం కూడా కనీసం లక్ష మంది ఉద్యోగులకు కూడా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించలేదు. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక ఉన్నాయి. ఈ మేరకు.. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఉద్యోగుల శిక్షణ కార్యక్రమాలపై వివిధ రాష్ట్రాల పనితీరుపై నివేదికను కేంద్రం ఇటీవల విడుదల చేసింది. దీనిపై ఏపీ ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ జె. మురళీ మాట్లాడుతూ.. ''రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి సీఎం జగన్ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఎలా ఉపయోగపడతాయన్న దానిపై క్షేత్ర స్థాయి ఉద్యోగులందరికి అవగాహన ఉండాలని సీఎం ఆదేశాలిచ్చారు. పిల్లలకు అనుకూల వాతావరణంలో విద్యా బోధన అనే అంశంపై 1.30 లక్షల మంది టీచర్లకు శిక్షణ ఇచ్చాం. నాడు–నేడులో పీహెచ్‌సీల అభివృద్ధితో పాటు గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై ఏఎన్ఎంలు శిక్షణ పొందారు. ఐదు ఏళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. దేశంలో చాలా రాష్ట్రాలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించక మునుపే ఆంధ్రప్రదేశ్‌లో ఈ శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశాం'' అని తెలిపారు.

కన్నీటి వీడ్కోలు

▶ మొదటి పేజీ తరువాయి

కృష్ణంరాజు పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, తెలంగాణ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మాగంటి గోపీనాథ్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నేతలు మధుయాష్కీ గౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సినీ ప్రముఖులు మోహన్‌బాబు, జయప్రద, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, రామ్, మంచు మనోజ్, వినోద్‌కుమార్, సాయికుమార్, శివాజీరాజా తదితరులు కృష్ణంరాజుకు ఘనంగా నివాళులర్పించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కృష్ణంరాజుకు నివాళులు అర్పించి పార్టీ జెండాను ఆయన భౌతికకాయంపై ఉంచారు.



కృష్ణంరాజు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు విశ్వరూప్, వేణు, నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

రౌడీషీట్లు తెరవచ్చు

హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: ఏపీ పోలీస్ మాన్యువల్, పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ (పీఎస్‌వో) ప్రకారం రౌడీ షీట్లు తెరవడం, కొనసాగించడం, రౌడీలుగా ప్రకటించడం, వ్యక్తులపై నిఘాకు వీల్లేదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును హైకోర్టు ధర్మాసనం నిలుపుదల చేసింది. ప్రాథమికంగా సింగిల్ జడ్జి ఉత్తర్వులు చెల్లవని ధర్మాసనం ప్రకటించింది. సింగిల్ జడ్జి తీర్పునకు అనుగుణంగా ఆయా వ్యక్తులపై మూసివేసిన రౌడీషీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు లాంటి వాటిని తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు తిరిగి తెరవడానికి వీల్లేదని పోలీసులకు తేల్చి చెప్పింది. అయితే ఆ వ్యక్తులపై తాజాగా ఏవైనా ఆధారాలుంటే వాటి ప్రకారం రౌడీషీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు తెరవొచ్చని స్పష్టం చేసింది. అనుమానితుడిపై, నిందితుడిపై నిఘా వేయాలనుకుంటే పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారమే ఆ పని చేయాలని ఆదేశించింది. ఎవరైనా వ్యక్తి / నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలవాలంటే చట్ట ప్రకారం, పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ముందస్తు నోటీసు ఇవ్వాలని తేల్చి చెప్పింది. వేలిముద్రల సేకరణ చట్ట నిబంధనలకు అనుగుణంగానే చేయాలని పేర్కొంది. అరెస్ట్ ఉత్తర్వులను అమలు చేసేందుకు, ఏదైనా కేసులో అనుమానితుడు, నిందితుడు అవసరమైనప్పుడు మినహా రాత్రి వేళల్లో వారి ఇళ్లకు వెళ్లరాదని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్, జస్టిస్ బండారు శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

సింగిల్ జడ్జి తీర్పుపై ప్రభుత్వం అప్పీల్...

పోలీసులు రౌడీషీట్లు తెరవడాన్ని, కేసులు కొట్టివేసినా వాటిని కొనసాగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాదాపు 57 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ సోమయాజులు ఇటీవల తీర్పు వెలువరిస్తూ అసలు పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌కు చట్టబద్ధతే లేదని తేల్చి చెప్పారు. చట్టం అనుమతి లేకుండా పీఎస్‌వో ప్రకారం వ్యక్తులపై రౌడీషీట్లు తెరవడం, కొనసాగించడం, వ్యక్తుల సమాచారాన్ని సేకరించడం లాంటి వాటిని చేయడానికి వీల్లేదన్నారు. పీఎస్ఓ ప్రకారం ఏళ్ల తరబడి చేస్తూ వస్తున్న ఫోటోల సేకరణ, స్టేషన్లలో ప్రదర్శించడం, ఇళ్లను సందర్శించడం, స్టేషన్‌కు పిలిపించడం, స్టేషన్‌లో గంటల పాటు వేచి ఉండేలా చేయడం తదితరాలన్నీ వ్యక్తుల గోపత్య హక్కుకు విఘాతం కలిగించేవేనన్నారు. పోలీసులు ఇప్పటి నుంచి పోలీసు స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ఇలాంటి పనులు చేయడానికి, వ్యక్తులపై అనుచిత నిఘా పెట్టడానికి వీల్లేదని ఆదేశిస్తూ ఈ ఏడాది జూలై 15న సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున హోంశాఖ ముఖ్య కార్యదర్శి ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలుపుదల చేయాలని కోరుతూ ఓ అనుబంధ పిటిషన్ వేశారు. తాజాగా హైకోర్టు ధర్మాసనం దీనిపై తీర్పు వెలువరించింది.

60 ఏళ్లుగా రౌడీషీట్లు తెరుస్తూనే ఉన్నారు..

'మద్రాసు నుంచి విడిపోయిన తరువాత 1954 వరకు అప్పటి మద్రాసు ఇన్‌స్పెక్టర్ జనరల్ జారీ చేసిన పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌ను ఆంధ్ర రాష్ట్రం యథాతథంగా అన్వయించుకుంది. ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రా ప్రాంత) జిల్లా పోలీసు చట్టం 1859ని పూర్తి స్థాయిలో అమలు చేయడం మొదలైంది. ఇందులో పోలీసుల విధులు, బాధ్యతలు, నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, నేరస్తులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం లాంటి వాటి గురించి స్పష్టంగా పేర్కొన్నారు. నేరాలను నియంత్రించేందుకు గత 60 ఏళ్లుగా రౌడీషీట్లు తెరవడమన్న ఆచారం కొనసాగుతూనే ఉంది. గతంలో సుంకర సత్యనారాయణ కేసులో పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ కార్యనిర్వాహక మార్గదర్శకాలేనని హైకోర్టు పేర్కొంది. అయినా ఈ కారణంతో రౌడీషీట్లు తెరవడాన్ని మాత్రం కొట్టేయలేదు. రౌడీషీట్లు తెరవడం, మూసివేయడాన్ని క్రమబద్ధీకరించే విషయంలో పలు ఆదేశాలు ఇచ్చింది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని రౌడీషీట్ల విషయంలో సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

ప్రభుత్వ న్యాయవాది వాదనను తోసిపుచ్చలేం..

'కేఎస్ పుట్టస్వామి కేసులో గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సింగిల్ జడ్జి పరిగణలోకి తీసుకుంటూ రౌడీషీట్లు తెరవడం, నిందితులపై నిఘా ఉంచడం లాంటివి వ్యక్తి గోప్యతా హక్కుకు విఘాతం కలిగించేవని తేల్చారు. అయితే ప్రభుత్వ న్యాయవాది (హోం) మాత్రం పుట్టస్వామి కేసుకు ఈ కేసుతో ఎంతమాత్రం సంబంధం లేదని అంటున్నారు. ఆధార్ కార్డు జారీ సమయంలో వ్యక్తుల వివరాలను అడగడం గోప్యత హక్కుకు విఘాతమని సుప్రీంకోర్టు చెప్పిందని ప్రభుత్వ న్యాయవాది ఈ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఆ వాదన ప్రకారం ఈ కేసు నేరాన్ని నియంత్రించేందుకు అనుమానితులు, నిందితులపై తెరిచిన రౌడీషీట్లకు సంబంధించింది మాత్రమే. ప్రభుత్వ న్యాయవాది వాదనను ఈ దశలో ఏ రకంగానూ మేం తోసిపుచ్చలేం. ఒక వ్యక్తిపై రౌడీషీట్ తెరవడం అతడికి రాజ్యాంగం ప్రసాదించిన గోప్యత హక్కుకు భంగం కలిగించినట్లా? అన్నది ఇక్కడ ప్రశ్న. దీనిపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం తమ ముందున్న ప్రాథమిక ఆధారాలను బట్టి సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది.

2023 సెప్టెంబర్‌కు వెలుగొండ పూర్తి

నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు



వెలుగొండ ప్రాజెక్టు డ్యామ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టును 2023 సెప్టెంబర్‌నాటికి పూర్తి చేసి మూడు జిల్లాల ప్రజలకు నీరందిస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సోమవారం కొత్తూరు వద్ద జరుగుతున్న వెలుగొండ ప్రాజెక్టు సొరంగం పనులను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న 7,200 కుటుంబాలకు పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించిన వెలుగొండ ప్రాజెక్టును ఆయన కుమారుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారని చెప్పారు. పనులు చేపట్టిన సంస్థలకు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులకు చెప్పారు. ఇది ప్రకాశం నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లోని 15 లక్షల మంది ప్రజలకు తాగు నీరు, 4,50,000 ఎకరాలకు సాగు నీరు అందించే ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అని అన్నారు. ఈ ప్రాజెక్టు విలువ రూ. 8 వేల కోట్లు అయితే ఇప్పటివరకు రూ. 6 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ప్రతి ఒక్కరి న్యాయమైన కోరికను నెరవేరుస్తామని తెలిపారు. ప్రాజెక్టు పనులపై ప్రతి నెలా సమీక్షిస్తామన్నారు. సుమారు 1,500 మంది నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉందని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. 11.5 ఎకరాలకు సంబంధించి టీ5 పోర్షన్‌కు రూ.85 కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంజూరు చేసి పరిపాలన అనుమతులు ఇచ్చారన్నారు.

3 రాజధానులే మా విధానం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- తంగుడుబిల్లిలో జగనన్న కాలనీకి భూమిపూజ



రైతులకు ఎల్‌పీసీలు అందజేస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ (భీమిలి): రాష్ట్రంలో మూడు రాజధానులే తమ ముఖ్యమంత్రి ఉద్దేశం, తమ ప్రభుత్వ విధానం అని విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆమె సోమవారం విశాఖ జిల్లా ఆనందపురం మండలం తంగుడుబిల్లిలో 519 ఎకరాల్లో 263 కోట్లతో నిర్మించనున్న 16,690 ఇళ్ల జగనన్న హౌసింగ్ కాలనీకి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖలో పరిపాలన, కర్నూలులో న్యాయ, అమరావతిలో శాసన రాజధానుల ఏర్పాటుతో మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడుకి రాష్ట్రం బాగుపడడం, మంచి జరగడం ఇష్టం ఉండదని, అందుకే అమరావతి పేరుతో పాదయాత్ర ప్లాన్ చేశారని విమర్శించారు. ఈ వయసులో చంద్రబాబు పాదయాత్ర చేయలేడని, లోకేశ్ చేసినా ఉపయోగంలేదని భావించి అమరావతి పేరుతో అక్కడి వారిని రెచ్చగొట్టి పాదయాత్రకు ప్లాన్ చేశారని చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా జనం జగనన్న వెంటే ఉన్నారన్నారు. అమరావతి పేరుతో జరుగుతున్న పాదయాత్ర వల్ల ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తినా చంద్రబాబే బాధ్యత వహించాలని చెప్పారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అటు సూర్యుడు ఇటు వచ్చినా విశాఖకు పరిపాలన రాజధాని వచ్చి తీరుతుందని పేర్కొన్నారు. చంద్రబాబులాంటి వారు ఎన్ని కుట్రలు పన్నినా అడ్డుకోలేరన్నారు. పాదయాత్ర కాదు మోకాళ్ల యాత్ర చేసినా ఆగదని చెప్పారు. ప్రజలకు మేలు చేయడానికి కావాల్సింది పెద్ద వయసు కాదని, పెద్ద మనసని పేర్కొన్నారు. ఆ పెద్ద మనసు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని ఆయన చెప్పారు.

గిరిజనుల మేలు కోరే ఏకైక సీఎం వైఎస్ జగన్

మేరాజోత్ హనుమంత్ నాయక్



సాక్షి, అమరావతి: గిరిజనుల మేలు కోరే ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. ఆయన సోమవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ పేద గిరిజన యువతుల వివాహాలకు రూ.లక్ష ఇచ్చేందుకు వైఎస్సార్ కళ్యాణమస్తు పథకాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసి సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి మూడేళ్లలోనే 98.5 శాతం హామీలను నెరవేర్చి సీఎం జగన్ రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50శాతం నామినేటెడ్ పదవులను ఇచ్చారని చెప్పారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను టీడీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గిరిజనులు అభివృద్ధి పథంలో నడుస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీని 2024 ఎన్నికల్లోనూ గెలిపించేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు.

అమరావతి టు అరసవల్లి పాదయాత్ర ప్రారంభం

- ముందుగా వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు
- రథం నడిపే విషయంలో జేఏసీలోని ఇరువర్గాల మధ్య తోపులాట
- మధ్యాహ్న భోజనం తర్వాత ఇళ్లకు వెళ్లిపోయిన టీడీపీ శ్రేణులు



వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పాదయాత్రను ప్రారంభిస్తున్న జేఏసీ నాయకులు

తాడికొండ/మంగళగిరి: అమరావతి దీక్షలు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి అమరావతి టు అరసవల్లి పాదయాత్ర గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం నుంచి ప్రారంభమైంది. ఉదయం 5 గంటలకు గ్రామంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 6:20 గంటలకు పాదయాత్రను ప్రారంభించారు. ఆలయం నుంచి వెంకటపాలెం, కృష్ణాయపాలెం మీదుగా మంగళగిరి వరకు పాదయాత్ర సాగింది. ప్రారంభంలో పాదయాత్ర రథం నడిపే విషయంలో జేఏసీలోని ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. రథం తమ వర్గం ఆధీనంలో కొనసాగాలని ఎవరికివారు ప్రయత్నిస్తూ బహిరంగంగా విమర్శలకు దిగారు. జేఏసీలోని నిర్దేశిత వ్యక్తులు, బయటి ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, ఇతర పార్టీలకు చెందిన నాయకులు తొలి రోజు పాదయాత్రలో ఎక్కువగా కనిపించారు. దాదాపు 200 మందితో ప్రారంభమైన పాదయాత్ర వెంకటపాలెంలో గ్రామస్తులు కొంతమంది తోడు రావడంతో ఎక్కువ సంఖ్యలో కనిపించినప్పటికీ.. మంగళగిరికి చేరుకునే సరికి జన సంఖ్య తగ్గిపోయింది. మధ్యాహ్నం భోజనం తర్వాత రాజధాని ప్రాంత టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు వెళ్లిపోయారు. తెలంగాణాకు చెందిన మాజీ ఎంపీ రేణుకాచౌదరి, బీజేపీ నాయకులు కామినేని శ్రీనివాస్, పాతూరి నాగభూషణం, టీడీపీ మాజీ మంత్రులు దేవినేని ఉమా, నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ వర్గ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్‌రావు, ఆరె శివారెడ్డి, గద్దె తిరుపతిరావు, జనసేన నాయకులు యర్రగోపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి మీద చర్యలు తీసుకోవాలి

పోలీసులకు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి, మాజీ మంత్రి కొడాలి నానిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి గుంటూరు జిల్లా పొన్నూరు రూరల్, పట్టణ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. చేబ్రోలు మండల టీడీపీ అధ్యక్షుడు నన్నపనేని కోటేశ్వరరావు, మరి కొందరిపై ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ అమరావతి – అరసవల్లి పాదయాత్రకు మద్దతుగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అనుచరులు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , వైఎస్ భారతి, మాజీ మంత్రి కొడాలి నానిలను అసభ్య పదజాలంతో దూషిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకే అనుచిత వ్యాఖ్యలు చేశారని, వీరిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నన్నపనేని అంకినీడుచౌదరి, దుక్కుముళ్ల రవి, గేరా సుబ్బయ్య, వడ్రాణం ప్రసాద్‌రావు, కే.బ్రహ్మయ్య, చైతన్య, బొంతిబోయిన నాగేశ్వరరావు, మురళీకృష్ణ, షేక్ సుల్తాన్, కరీమ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ డైరెక్టర్‌గా ఆలమ్



ఉక్కునగరం: కేంద్ర బొగ్గు శాఖ ఆధీనంలోని ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ డైరెక్టర్(ఫైనాన్స్)గా విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం(ఫైనాన్స్) అన్వార్ ఆలమ్ నియమితులయ్యారు. కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలపడంతో ఉత్తర్వులు విడుదలయ్యాయి.

సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఉపసంహరించండి

ప్రభుత్వ సలహాదారు 'సజ్జల'కు ఉద్యోగ సంఘాలు వినతి

సాక్షి, అమరావతి: ఈ నెల ఒకటో తేదీన 'మిలియన్ మార్చ్'కు పిలుపునిచ్చిన క్రమంలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సోమవారం ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి వెంటనే స్పందించి డీజీపీ కార్యాలయ అధికారులతో మాట్లాడి కేసుల నమోదును ఆపాలని చెప్పడంతోపాటు ప్రస్తుత కేసుల విషయంలో దూకుడు వద్దని, ఉపసంహరణకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించాలని సూచించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఏపీసీపీఎస్ఈఏ గౌరవ అధ్యక్షుడు రామాంజనేయులు, గౌరవ సలహాదారు బాజీ పఠాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

జీవీఎంసీ కమిషనర్‌గా రాజాబాబు

సాక్షి, అమరావతి: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పి.రాజాబాబును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం విశాఖ కమిషనర్‌గా ఉన్న డాక్టర్ జి.లక్ష్మీశను ఎంఐజీ స్పెషల్ ఆఫీసర్‌గా, ఏపీయూఎఫ్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఇప్పటివరకు ఆ స్థానంలో రాజాబాబు విధులు నిర్వహిస్తున్నారు. ఇదే విధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాజాబాబు విశాఖ కమిషనర్‌గా బదిలీ అయినందున, ఆయన స్థానంలో అంతర్గత ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్‌గా డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. 2024 సెప్టెంబర్ 11 వరకు ఆయన చైర్మన్‌గా కొనసాగనున్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ నమూనా పరిశీలన

ఢిల్లీ వెళ్తున్న పలువురు మంత్రులు, అధికారులు

సాక్షి, అమరావతి: విజయవాడలో ఏర్పాటు చేయనున్న 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నమూనాను పరిశీలించేందుకు మంత్రులు, అధికారుల బృందం మంగళవారం ఢిల్లీకి వెళ్లనుంది. ఈ విషయాన్ని అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు విజయవాడలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఢిల్లీలో బంకమట్టితో చేసిన విగ్రహ నమూనాను పరిశీలించడానికి వెళ్తున్నామన్నారు. ఈ బృందంలో తనతో పాటు మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, అధికారులు జయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ ప్రసాద్, కేపీసీ ప్రాజెక్ట్స్ ఎండీ అనిల్ ఉన్నారని చెప్పారు.

నాసిరకం మొక్కలపై అప్రమత్తంగా ఉండండి

సాక్షి, అమరావతి: ఇతర రాష్ట్రాల్లోని పామ్ ఆయిల్ తోటల్లో గెల నుంచి రాలిపోయిన గింజలు, విత్తనాల ద్వారా మొలకెత్తిన మొక్కలను తీసుకొచ్చి అధిక ధరకు విక్రయించడానికి ప్రయత్నిస్తున్న దళారుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ సోమవారం ప్రకటనలో సూచించారు. ఇటువంటి మొక్కలు నాటడం వల్ల ఆరు నుంచి ఏడేళ్ల తర్వాత కూడా గెలలు వచ్చే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఒక వేళ గెలలు వచ్చినా, వాటిల్లో నాణ్యత లేక ఆయిల్ శాతం ఉండదని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి అశాస్త్రీయమైన, జన్యుపరమైన లోపాలున్న మొక్కలు విక్రయిస్తున్నట్లుగా గమనిస్తే వెంటనే సమీపంలోని రైతు భరోసా కేంద్రం సిబ్బందికి లేదా ఉద్యాన శాఖాధికారులకు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పామ్ ఆయిల్ ఫ్యాక్టరీల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయిల్ పామ్ నర్సరీల నుంచి మాత్రమే మొక్కలను తగిన బిల్లు ద్వారా కొనుగోలు చేసుకోవాలని ఆయన సూచించారు.

'వికేంద్రీకరణ'తోనే రాష్ట్రానికి భవిష్యత్

- అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనతో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధి చెందాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని, అదే సరైనదని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఆయన సోమవారం శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అమరావతిని రాజధానిగా చేయడం వెనుక ఉన్న దురుద్దేశాలను, సత్యాలను శాసనసభలో జరిగిన చర్చలో వివరించినట్లు గుర్తుచేశారు. కొన్ని గ్రామాల సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరించాలని చంద్రబాబు ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. రైతాంగం పోరాటం చేస్తున్నట్టుగా రాష్ట్రమంతా పాదయాత్ర చేసి మిగతా ప్రజలను మభ్యపెట్టాలని చూడటం చంద్రబాబు అండ్ కో పన్నాగమని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెట్టి పొరపాటు చేశామని, అలాంటి పొరపాటు మరోసారి జరగకుండా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అమరావతిలో సమీకరించిన 33 వేల ఎకరాల చుట్టూ భూములన్నింటినీ చంద్రబాబు స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు, టీడీపీ నేతలతో కొనుగోలు చేయించారని, రాజధాని పేరుతో ఆ ఆస్తుల విలువలు పెంచాలనేది చంద్రబాబు వ్యూహమని దుయ్యబట్టారు. రాజధాని దొనకొండ అని, నూజివీడు అని రకరకాల ప్రచారాలు చేసిన చంద్రబాబు చివరికి అమరావతి అన్నారని గుర్తుచేశారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే తమ ప్రభుత్వం మూడు రాజధానులకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 'విశాఖపట్నానికి క్యాపిటల్ వద్దంటే ఉత్తరాంధ్ర ప్రజలు ఎందుకు ఊరుకోవాలి? మీరు యాత్రచేస్తే మేము నోరు మూసుకుని కూర్చోవాలా..' అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ కాలంలో కేంద్ర ప్రభుత్వం 23 సంస్థలు ఇస్తే.. ఒక్క సంస్థను కూడా చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో పెట్టలేదన్నారు. చంద్రబాబు రైతులను రెచ్చగొట్టి రాష్ట్రం మీదకు పంపిస్తున్నారన్నారు.

శ్రీకాకుళం వారు కూలీలుగానే ఉండిపోవాలా

విశాఖపట్నం రాజధానికి అనర్హమని భావిస్తే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి క్యాబినెట్ మీటింగ్ విశాఖలో ఎందుకు పెట్టారని ధర్మాన అన్నారు. శ్రీకాకుళం ప్రాంత వాసులు తరతరాలుగా రాజధానిలో కూలీలుగా, తాపీ మేస్త్రీలుగా ఉండిపోవాలా.. అని ప్రశ్నించారు.

పాదయాత్రను ఉత్తరాంధ్రవాసులు అడ్డుకుంటారు

- వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: అమరావతి పేరుతో ఒక సామాజిక వర్గ ఆర్థిక ప్రయోజనాలు కాపాడటానికి టీడీపీ నేత చంద్రబాబు కుత్సిత రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజలు తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. ఆయన సోమవారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. అమరావతి–అరసవల్లి పేరుతో చేపడుతున్న పాదయాత్ర బూటకమన్నారు. ఈ పేరుతో ఉత్తరాంధ్రలోకి వచ్చి, ఇక్కడివారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. పాదయాత్రను ఉత్తరాంధ్ర వాసులు అడ్డుకుని తీరుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నట్లు వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. విశాఖ రాజధాని అయితే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధికి నోచుకుంటుందని, అలాగే కర్నూలు, విజయవాడ కూడా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి విడిపోయి రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. మళ్లీ విభజన నినాదాలు వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, రాష్ట్రం ఆర్థికంగా వెనకబడుతుందని చెప్పారు.

పాదయాత్ర పేరుతో వంకర రాజకీయం

- చంద్రబాబు పాదయాత్ర చేయవచ్చు కదా?
- మంత్రి దాడిశెట్టి రాజా



కోటనందూరు: అమరావతి రైతుల పాదయాత్ర పేరుతో మాజీ సీఎం చంద్రబాబు వంకర రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బిళ్లనందూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేయడానికే రాజధానిగా అమరావతి ఉండాలంటూ రైతులతో చంద్రబాబు పాదయాత్ర చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల ముసుగులో పాదయాత్ర చేయించే బదులు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ యాత్ర చేయొచ్చు కదా..? అని ప్రశ్నించారు. తండ్రీ కొడుకులు పాదయాత్ర చేస్తే ప్రజలు చెప్పులతో కొట్టే పరిస్థితి ఉంది కాబట్టి దొడ్డిదారిలో ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. చంద్రబాబు పాదయాత్రగా విశాఖ వచ్చి అక్కడ పరిపాలన రాజధాని వద్దని చెప్పగలరా? అని ప్రశ్నించారు. అమరావతి రాజధాని అనేది ఒక పెద్ద స్కామ్ అని మంత్రి ఆరోపించారు. చంద్రబాబుకు ప్రజల్లో తిరిగే ధైర్యం లేదు కాబట్టే రైతులను రెచ్చగొట్టి పాదయాత్ర చేయిస్తున్నారన్నారు. చంద్రబాబు చేయించే యాత్ర అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం కాదని, అది కేవలం ఒక కులం అభివృద్ధి కోసం చేసే పాదయాత్ర మాత్రమేనని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానులు ఉంటే అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందుతాయన్నారు.

Join the Leader

VIGNAN Group of ENGINEERING and PHARMACY COLLEGES

Notification for Admission into B.Tech / B.Pharmacy / Pharm.D Under Category-B – NRI Seats 2022-23

Applications for admission into First year of the following B.Tech, B.Pharmacy and Pharm.D courses under Category-B NRI seats may be obtained from the college office or downloaded from the college website and submit on or before 14.09.2022 at the respective colleges.

COLLEGE NAME	EAP-CET Code	Course	Intake	Category-B NRI Seats
GUNTUR				
Vignan's Lara Institute of Technology & Science, Vadlamudi, Guntur Dist.				
Vadlamudi, Guntur Dist. Tel: 0863-2381200, 9441063389, 9866327785 www.vignanlara.org	VLIT	CIVIL	60	9
		CSE	180	27
		CSE(AI&ML)	60	9
		CSE (AI)	60	9
		CSE(DS)	60	9
		AI & ML	60	9
		ECE	180	27
		EEE	90	14
		IT	60	9
		MECH	90	14
Vignan's Nirula Institute of Technology & Science for Women, Guntur				
Palakaluru Road, Guntur. Tel: 0863-2242472, 9866222280 www.vignannirula.org	VNIW	CSE	180	27
		CSE(AI&ML)	60	9
		CSE(DS)	60	9
		ECE	120	18
		IT	120	18
		EEE	60	9
Vignan Pharmacy College, Vadlamudi, Guntur Dist.				
Vadlamudi, Guntur Dist. Tel: 0863-2347769, 9866399382. www.vignanpharmacycollege.in	VPCV	B.Pharm.	100	15
		Pharm.D	30	5
VISAKHAPATNAM				
Vignan's Institute of Information Technology (Autonomous), Visakhapatnam				
Beside VSEZ, Duvvada, Vadlapudi Post, Visakhapatnam - 530049 Tel: 9133300359, 9618356061, 0891-2517333 www.vignaniit.edu.in	VIVP	CIVIL	120	18
		EEE	120	18
		MECH	180	27
		ECE	180	27
		CSE	240	36
		CSE (AI)	60	9
		CSE(DS)	60	9
		CSE(CS)	60	9
		IT	60	9
		ECM	60	9
		AI & DS	120	18
Vignan's Institute of Engineering for Women, Visakhapatnam				
Kapu Jaggarajupeta, VSEZ post, Gajuvaka, Visakhapatnam - 530 049 Tel: 9553371222, 9133300353 & 9133300357 www.view.edu.in	VIEW	EEE	120	18
		MECH	30	5
		ECE	180	27
		CSE	180	27
		CSE(AI&ML)	60	9
		CSE (AI)	60	9
		CSE(DS)	60	9
		CSE(CS)	60	9
		IT	60	9
Vignan Institute of Pharmaceutical Technology, Visakhapatnam				
Beside VSEZ, Duvvada, Vadlapudi Post, Visakhapatnam. Tel: 9866399928, 0891-2511222, www.vignanpharma.com	VIPV	B.Pharm.	100	15
		Pharm.D	30	5

Eligibility: 1) Pass in the Intermediate or its equivalent examination with not less than 50% of marks in the prescribed group subjects or Cumulative Grade Point Average (CGPA) equivalent to 5 on a scale of 10. 2) Wards of NRI
Tuition fee: US $5,000 (US Dollars) per annum

Chairman



ఉత్తరాలు రాసుకోకపోతేనేం? ఉత్తరాలలోనూ, మాటల్లోనూ ఏముంది? ఏ స్నేహమైనా, క్రమంగా మౌనంలోకి ఇంకకపోతే, అది లోతు తక్కువగానే ఉండిపోతుంది – చెరువు మల్లే!

– చలం

సాక్షి

మంగళవారం, సెప్టెంబర్, 13

దారుణానికి అడ్డుకట్ట!

అప్పులిస్తున్నామంటూ అమానవీయంగా ప్రవర్తిస్తున్న చట్టవిరుద్ధమైన డిజిటల్ యాప్‌లకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడనుందా? ఆర్థిక మంత్రి సారథ్యంలో గత వారం జరిగిన సమావేశం ఆ మేరకు ఆశలు రేపుతోంది. దేశంలో సాధారణ బ్యాంకింగ్ మార్గాలకు వెలుపల చట్టవిరుద్ధంగా నడుస్తున్న డిజిటల్ రుణ వేదికలపై మరిన్ని చర్యలకు కేంద్రం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నడుం బిగించాయి. చట్టబద్ధంగా రుణాలిచ్చే సవ్యమైన యాప్‌లతో జాబితాను సిద్ధం చేసే బాధ్యతను ఆర్బీఐకి అప్పగించారు. ఇక ఆ 'శ్వేతజాబితా'లోని యాప్‌లే డౌన్ లోడ్ చేసుకొనేందుకు అందుబాటులో ఉండేలా కేంద్ర ఎలక్ట్రానిక్స్ – ఐటీ శాఖ జాగ్రత్తలు తీసుకోనుంది. అందుకోసం గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్‌స్టోర్ లాంటి వాటికీ, ఆర్బీఐకీ మధ్య సమన్వయం చేయనుంది. అలాగే, పేమెంట్ యాగ్రిగేటర్లు నిర్ణీత కాలవ్యవధి లోపల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. రిజిస్టర్ కాని వాటిని ఆ తర్వాత అనుమతించరాదనేది తాజా నిర్ణయం. వేల కుటుంబాలు కూలిపోవడానికి కారణమైన లోన్ యాప్‌లపై వేటుకు ఇవి తొలి అడుగులుగా భావించవచ్చు.

దేశంలోని వేగవంతమైన డిజిటలీకరణ, మారుమూలలకు సైతం వ్యాపించిన మొబైల్ సర్వీసులకు విపరిణామం ఈ లోన్ యాప్‌ల తంటా. అవసరంలో ఉన్న అల్పాదాయ, మధ్యతరగతి వారిని లక్ష్యంగా చేసుకొని అప్పులు, సూక్ష్మ రుణాలు ఇచ్చే అక్రమ యాప్‌ల దుర్మార్గాలు అన్నీ ఇన్నీ కావు. సామాన్యుల సాంకేతిక నిరక్షరాస్యత వాటికి వాటంగా మారింది. అత్యధిక వడ్డీ రేట్లు, పైకి కనిపించని రుసుములు, బాకీ వసూళ్ళ పేరిట బ్లాక్‌మెయిలింగ్‌లకు ఇవి పేరుమోశాయి. అడ్డూ అదుపూ లేని ఈ డిజిటల్ రుణ యాప్‌లలో అత్యధికం చైనావే. ఇవి తక్షణ రుణాలు ఇస్తామంటూ లక్షలాది వినియోగదార్లను వలలో వేసుకుంటున్నాయి. అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. కష్టమర్లు తీసుకున్న రుణాలపై వడ్డీలకు వడ్డీలు వేస్తూ, వాటి వసూలుకై రాక్షసరూపం దాలుస్తున్నాయి. ఈ డిజిటల్ యాప్‌ల రుణ వసూలు ఏజెంట్ల ముందు అలనాటి నక్షత్రకులు సైతం దిగదిడుపే. అప్పు తీసుకొనేందుకు సదరు యాప్‌లకు ఫోన్‌లోని నంబర్లు, ఫోటోలను అందుబాటులోకి తేవడం కొంపముంచుతోంది. వెంటాడి, వేధించే వారి మాటలు, చేష్టలు, అసభ్య మెసేజ్‌లు, మహిళల మార్ఫింగ్ ఫోటోలతో చివరకు పరువు పోయిందనే వేదనతో దేశవ్యాప్తంగా వందల మంది ప్రాణాలు తీసుకున్నారు.

డిజిటల్ రుణ యాప్‌లపై 2020 జనవరి నుంచి గత ఏడాది మార్చి వరకు రెండున్నర వేలకు పైగా ఫిర్యాదులు ఆర్బీఐకి అందాయి. దరిమిలా పరిశీలనలో రిజిస్టర్ కాని లోన్ యాప్‌లు దాదాపు 600కు పైగానే గూగుల్ ప్లే స్టోర్‌లో ఉన్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారంపై రేగిన రచ్చతో గూగుల్ సైతం చర్యలు చేపట్టక తప్పలేదు. ఈ ఏడాది ఆరంభం నుంచి తమ ప్లే స్టోర్‌లో 2 వేలకు పైగా వ్యక్తిగత రుణాల యాప్‌లను తొలగించినట్టు గత నెలలో ఆ సంస్థ ప్రకటించింది. అంటే, వ్యక్తిగత రుణ విభాగంలోని మొత్తం యాప్‌లలో దాదాపు సగానికి పైచిలుకు గూగుల్ తొలగించిందన్న మాట. దీన్నిబట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. యాప్ ఆధారిత తక్షణ రుణాల్లో అవకతవకలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టికీ వచ్చాయి. అందుకే ఇటీవల బెంగళూరులోని రేజర్‌పే, పేటీఎం, క్యాష్‌ఫ్రీ తదితర ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వేల కార్యాలయాలపై ఈడీ దాడులు జరిపింది.

లోన్‌యాప్‌లతో పైకి కనిపించని ప్రమాదాలెన్నో! వీటి కార్యకలాపాలతో అక్రమ నగదు తరలింపు, పన్నుల ఎగవేతకు వీలుంది. వ్యక్తిగత డేటా చౌర్యం, డొల్ల కంపెనీలు, కార్యకలాపాలు ఆపేసిన బ్యాకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీల) దుర్వినియోగం విచ్చలవిడిగా సాగే ముప్పుంది. ఇవన్నీ ఆందోళన కలిగించే అంశాలు. నిజానికి, నియంత్రణ లేని ఈ యాప్‌ల బారి నుంచి సామాన్య ప్రజలను కాపాడాలంటే, వాటిని నిషేధిస్తూ కేంద్రం ఓ చట్టం తేవాలని ఆర్బీఐ ఇటీవల సిఫార్సు చేసింది. చట్టపరమైన అనుమతులున్న, ఆర్బీఐ నియంత్రణలోని సంస్థలే అప్పులివ్వాలని నెల రోజుల క్రితం ఆగస్ట్ 10న నియంత్రణ చట్రాన్ని నిర్దేశించింది. అలాగే, డిజిటల్ రుణాలను నేరుగా రుణగ్రహీతల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయాలనీ, మూడోవ్యక్తి ద్వారా కానే కాదనీ స్పష్టం చేసింది.

రానున్న రోజుల్లో చట్టవిరుద్ధమైన రుణ తిమింగలాలను యాప్ స్టోర్లలో అనుమతించనంత మాత్రాన అంతా మారిపోతుందనుకోలేం. యాప్‌లను పక్కదోవన లోడ్ చేసేలా లొసుగులున్నాయి. యాప్ స్టోర్లతో పని లేకుండా నేరుగా లింక్ పంపి, దాన్ని నొక్కితే సరిపోయే వీలుంది. అందుకే, కస్టమర్లు, బ్యాంక్ ఉద్యోగులు, చట్టాన్ని పరిరక్షించే విభాగాల దాకా అందరికీ సైబర్ వ్యవహారాలపై చైతన్యం కలిగించడం ముఖ్యం. చట్టవిరుద్ధంగా చెలరేగిపోతున్న యాప్‌లకు ముకుతాడు వేసేలా సంబంధిత మంత్రిత్వ శాఖలు, సంస్థలు తగు చర్యలు చేపట్టాలి. ఆర్థిక మోసాలపై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక పరిష్కార కేంద్రం పెట్టడం లాంటివీ యోచించాలి.

ఫిన్‌టెక్ సంస్థలు సైతం తమ వ్యాపార నమూనాలను సమీక్షించుకొని, పారదర్శక విధానం వైపు సాగాలి. కట్టాల్సివచ్చే రుసుములు వగైరా ముందే స్పష్టం చేయాలి. దాని వల్ల తెలుసుకొని మరీ కస్టమర్లు నిర్ణయం తీసుకోగలుగుతారు. అదే సమయంలో పారదర్శకత వదిలేసి, 'శ్వేత జాబితా' పేరిట సంక్లిష్ట ప్రమాణాలను పెట్టి, న్యాయబద్ధమైన లోన్‌యాప్‌లను ఆర్బీఐ తొలగించకూడదు. సరైన పద్ధతులు అనుసరిస్తూనే, అనుమతించినా, నిరాకరించినా కారణాలూ పేర్కొనడం ముఖ్యం. అప్పుడే నిఖార్సయిన యాప్‌లకు చిక్కులు లేకుండా, దారుణ యాప్‌ల కథ కంచికి చేరుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.తదియ ప.12.33 వరకు, తదుపరి చవితి **నక్షత్రం:** రేవతి ఉ.9.24 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** తె.5.44 నుండి 7.22 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.44 నుండి 11.33 వరకు **అమృతఘడియలు:** ఉ.7.01 నుండి 8.36 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

మార్పును ఎదుర్కొనేలా మారాలి!

వాతావరణ మార్పు సమస్య, కనిపిస్తున్న వాస్తవం. ఇదో అతిపెద్ద ప్రపంచ సమస్య అనేదీ అంతే నిజం. కానీ ఏ ఒక్క దేశమో దీన్ని ఎదుర్కోలేదు. అలాగని ఏ దేశమూ దీన్ని విస్మరించలేదు కూడా! ఈ ఏడాది ఈజిప్టులో జరగనున్న కాప్–27, ఇండోనేసియాలో నిర్వహించనున్న జీ–20 సదస్సులో ఇది చర్చకు రానుంది. ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో కూరుకునివున్న తరుణంలో ఈ చర్చ ఎటుపోతుందో తెలీదు. అయితే భారత్ మాత్రం తన వాగ్దానం మేరకు 2070 నాటికి కర్బన ఉద్గారాలను సున్నాకు చేర్చాల్సి ఉంది. ఈ దీర్ఘకాలిక లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం శిలాజేతర ఇంధనాల ఉత్పత్తిని పెంచడం, పర్యావరణ అనుకూల హైడ్రోజన్ వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారవాణా వ్యవస్థను విస్తృతం చేయడం, మెరుగైన డిజైన్ల ద్వారా ఇళ్లల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం లాంటి స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.

మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో ఒకటి, వాతావరణ మార్పుల ప్రభావం. పైగా ఇది ఏ ఒక్క దేశానికో సంబంధించిన సమస్య కాదు. అందరి సహకారం లేకపోతే ఏమాత్రం పరిష్కరించలేని సమస్య కూడా. ప్రపంచస్థాయిలో మూకుమ్మడి ప్రయత్నంతోనే గట్టెక్కగల ఈ సమస్య... ఈ ఏడాది ఈజిప్టులో జరగనున్న 'కాప్–27' సమావేశాలతోపాటు, నవంబరులో ఇండోనేసియాలో నిర్వహించనున్న జీ–20 సదస్సు సమావేశాల్లోనూ చర్చకు రానుంది. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, అభివృద్ధి చెందిన దేశాలు... రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, యూరప్‌లో పెరిగిన గ్యాస్ ధరలు, ద్రవ్యోల్బణ నియంత్రణ చర్యలు ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయేమో అన్న ఆందోళనల మధ్య నలుగుతున్న తరుణంలో ఈ ముఖ్యమైన అంశం మళ్లీ చర్చకు రావడం! అమెరికా – చైనాల మధ్య రాజకీయాలు నిత్యం రగులుతూండటం కూడా ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఈ పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ మార్పుల సమస్య నుంచి గట్టెక్కేందుకు భారత్ అనుసరించాల్సిన వ్యూహమేమిటి? వైఖరేమిటి? ఇక్కడ రెండు ముఖ్యమైన అంశాలను గుర్తుపెట్టుకోవాలి. మొదటిది: జీ–20, కాప్–27 సదస్సుల్లో వాతావరణానికి సంబంధించి మన వ్యూహమేమిటో ఎలా వివరిస్తామన్నది. రెండోది: వాతావరణ మార్పుల నిర్వహణ కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు ధనిక దేశాలు నిధులివ్వాలన్న అంశంపై మన వైఖరి.

వాతావరణ మార్పుల ప్రభావాన్ని నియంత్రించేందుకు భారత్ లక్ష్యాలేమిటన్నది గత ఏడది గ్లాస్గోలో జరిగిన కాప్–26 సదస్సులో ప్రకటించాం. దీని ప్రకారం 2070 నాటికి కర్బన ఉద్గారాలను శూన్య స్థితికి చేర్చాలి. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలతో ఎక్కువయ్యే కర్బన ఉద్గారాలను 2005 నాటి స్థాయిలో 45 శాతం వరకూ తగ్గించాలి. విద్యుదుత్పత్తి మొత్తంలో 2030 నాటికి శిలాజేతర ఇంధనాల ద్వారా జరిగే ఉత్పత్తి (సౌర, పవన) సగం ఉండాలి.

2030 నాటికి సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా 450 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యం కీలకమైంది. ఈ లక్ష్యాన్ని అందుకునేలా సరఫరా సంబంధిత సమస్యలను అధిగమించేందుకు అనేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే సమయంలో విద్యుత్తుతో నడిచే వాహనాల వినియోగం పెంచాలి. రైల్వే లైన్ల విద్యుదీకరణ వేగంగా చేపట్టాలి. ఉక్కు, ఎరువులు, పెట్రో రసాయనాల తయారీలో పర్యావరణ అనుకూల హైడ్రోజన్ వాడకాన్ని పెంచాలి. అంతేకాకుండా... మెరుగైన డిజైన్లు, పదార్థాల వాడకంతో భవనాల ద్వారా అయ్యే విద్యుత్తు ఖర్చును (లైట్లు, ఏసీల వంటివి) కూడా తగ్గించాల్సి ఉంటుంది. వీటన్నింటికీ తోడుగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తృతం చేయడం ద్వారా మాత్రమే మనం కాప్–26లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చగలం.

విజయం సాధించాలంటే చాలా రంగాల్లో కృషి జరగాలి. కేంద్ర ప్రభుత్వంలోని అనేక మంత్రిత్వ శాఖలు పరస్పర అవగాహనతో



ముందుకు సాగాలి. ఈ విషయాల్లో కీలకమైన ప్రైవేట్ రంగం అవసరమూ చాలానే ఉంటుంది. 2070 వరకూ తీసుకోబోయే ప్రతి విధానాన్ని విడమర్చి చెప్పాల్సిన అవసరం లేకపోయినా, రాగల పదేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నామో చెప్పడం ద్వారా అంతర్జాతీయ వేదికలపై విశ్వాసం పొందవచ్చు. ఈ వివరాలు యూఎన్‌ఎఫ్‌సీసీకి మనమిచ్చే 'నేషనలీ డిటర్మైండ్ కాంట్రిబ్యూషన్స్' ప్రణాళికలో లేకున్నా ఫర్వాలేదు. కానీ ఈ పదేళ్ల లక్ష్యాలు దీర్ఘకాలిక లక్ష్యాల సాధన దిశలో సక్రమంగానే ప్రయాణిస్తున్నామా, లేదా? అన్నది తెలుసుకునేందుకు ఉపయోగపడతాయి. ఈ లెక్కన రాగల పదేళ్లలో మనం అందుకోవాల్సిన లక్ష్యాలను ఒక్కటొక్కటిగా చూస్తే:

1) 2070 నాటికి కర్బన ఉద్గారాలను శూన్యస్థితికి తీసుకురావడమంటే, బొగ్గు వినియోగాన్ని పూర్తిగా పరిహరించడమనే అర్థం. కాబట్టి విద్యుదుత్పత్తి సామర్థ్యం పెంచేందుకు శిలాజేతర ఇంధనాలను మాత్రమే వాడాలి. నిర్మాణంలో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలను పరిగణనలోకి తీసుకుని బొగ్గు పతాక వినియోగం ఎప్పటికన్న అంశంపై నిర్ణయం జరగాలి. దశలవారీగా సుమారు 50 గిగా వాట్ల మేర బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని నిలిపివేయాలి.

2) కర్బన ఉద్గారాలు ఏ రోజుకు పతాక స్థాయికి చేరవచ్చునో కూడా ఒక తేదీ నిర్ణయించుకోవచ్చు. 3) విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందిప్పుడు. సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుదుత్పత్తిని పెంచేందుకు ఇది పెద్ద అవరోధం. డిస్కమ్‌లను ఆదుకునేందుకు నాలుగోసారి ప్రయత్నం జరుగుతోంది. ఇందుకోసం మల్టీ డెవలప్‌మెంట్ బ్యాంకుల సాయం తీసుకోవచ్చు. దీనివల్ల నియమ నిబంధనల ఏర్పాటు విషయంలో ఆర్థిక సంస్థలకు కొంత స్వాతంత్ర్యం ఉంటుంది. ఇది రాష్ట్రాలకు కొంత నమ్మకం కల్పించి పంపిణీ వ్యవస్థలో కొంత భాగాన్ని ప్రైవేట్ పరం చేసేలా ప్రోత్సాహం లభిస్తుంది. 4) సంప్రదాయేతర వనరులు ముడి చమురు మాదిరిగా వాడుకుంటే తరిగిపోయే ఇంధనం కాదు. కాబట్టి మొత్తం విద్యుదుత్పత్తిలో వీటివాటా ఎంత పెరిగితే అంత మేలు. ఇందుకోసం గ్రిడ్ నిర్వహణ, విద్యుత్తు నియంత్రణల్లో ఎన్నో కొత్త ఆవిష్కరణలు జరగాలి. కేంద్రస్థాయి విద్యుత్తు నియంత్రణ సంస్థలు రాష్ట్రస్థాయి సంస్థలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. గ్రిడ్ ఫ్లెక్సిబిలిటీ లక్ష్యంగా నియమ నిబంధనల్లో మార్పులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

5) పర్యావరణ అనుకూల హైడ్రోజన్ ఉత్పత్తిని పెంచేందుకు శిలాజ ఇంధనాల స్థానంలో దీన్ని వాడే పరిశ్రమలకు తగిన రాయితీలు కల్పించి సహకారం అందించవచ్చు. 6) 2030 నాటికల్లా కర్బన ఉద్గారాలను శూన్యస్థాయికి చేరుస్తామని భారతీయ రైల్వే ఇప్పటికే ప్రకటించింది. అయితే ఇందుకోసం దేశంలో రైళ్లన్నీ విద్యుత్తుతోనే నడవాల్సి ఉంటుంది. అది కూడా సంప్రదాయేతర, కర్బన ఉద్గారాలుండని పద్ధతుల్లో ఉత్పత్తి చేసే విద్యుత్తును వాడాల్సి ఉంటుంది. అంటే దశలవారీగా ప్రస్తుత డీజిల్ ఇంజిన్లను తొలగించడం లేదా విద్యుత్తుతో పనిచేసేలా చేయడం అవసరం. 7) ద్విచక్ర వాహనాలు, కార్లు, త్రిచక్ర వాహనాల్లో విద్యుత్తుతో పనిచేసేవాటి భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు వేటికి అవే ప్రత్యేకంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అంతేకాకుండా దేశవ్యాప్తంగా బ్యాటరీ ఛార్జింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను ప్రకటించవచ్చు.

కార్బన్ న్యూట్రల్ ఆర్థిక వ్యవస్థకు మళ్లేందుకు కావాల్సిన నిధులను సమీకరించడం ఎలా అన్నది ఇప్పటికీ తెగని వివాదం. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ధనిక దేశాలు సాయం చేస్తాయని యూఎన్‌ఎఫ్‌సీసీ చర్చల్లో ఒక అవగాహనైతే కుదిరింది. 2015 నాటి ప్యారిస్ ఒప్పందంలో 2020 నాటికి ఏటా వంద బిలియన్ డాలర్లు ధనిక దేశాలు చెల్లించాలన్న తీర్మానమూ ఉంది. అయితే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి రావాల్సిన ఈ మొత్తం ఇప్పటివరకూ అందలేదు. 2025 నాటికైనా అందేలా చూడాలని గత ఏడాది కాప్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. కాప్–26లో నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకోవాలంటే ధన సహాయం అన్నది కీలకం. కానీ అభివృద్ధి చెందిన జీ–7 దేశాలు ఇప్పటివరకూ నిధుల ఊసెత్తడం లేదు. ఇండోనేసియాలో జరిగే జీ–20 సమావేశాల్లోనైనా దీనిపై ఒక గట్టి నిర్ణయం జరగడం అవసరం. వచ్చే ఏడాది జీ–20 నిర్వహణ బాధ్యతలు భారత్ చేతిలో ఉంటాయి. ఆ తరువాత బ్రెజిల్, దక్షిణాఫ్రికాల వంతు. అభివృద్ధి చెందుతున్న ఈ దేశాల నేతృత్వంలోనైనా ధనిక దేశాలు వాతావరణ మార్పుల సమస్యను అధిగమించేందుకు అవసరమైన నిధులు అందజేస్తాయని ఆశించాలి. నిధుల ఫలితం ఎలా ఉన్నా మన రోడ్‌మ్యాప్ మనం సిద్ధం చేసుకోవాలి.

– మాంటెక్ సింగ్ అహ్లూవాలియా, ఉత్కర్ష్ పటేల్
వ్యాసకర్తలు వరుసగా ప్లానింగ్ కమిషన్ మాజీ డిప్యూటీ చైర్మన్; 'సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ప్రోగ్రెస్' అసోసియేట్ ఫెలో
('ద మింట్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

నిజమేనా?



రష్యన్ సైన్యంలో తిరుగుబాటు రానుందని గుసగుసలు వినబడుతున్నాయి. చూస్తుంటే రష్యా ప్రభుత్వ అధినేతకు అంతా బాగా జరుగుతున్నట్టు లేదు.
– జాన్ స్వీనీ, విశ్లేషకుడు

పాన్ పుష్ప



పాన్ ఇండియా మూవీగా రికార్డ్స్ బ్రేక్ చేసి 'సైమా' అవార్డుల్లో సత్తా చాటి ఏకంగా 6 అవార్డులు గెలుచుకున్న 'పుష్ప' చిత్రం యూనిట్‌కు అభినందనలు. సినిమాలో అల్లు అర్జున్ నటన, సుకుమార్ దర్శకత్వం అద్భుతం. తెలుగు సినిమా 'తగ్గేదే లే' అని నిరూపించారు.
– వి. విజయసాయి రెడ్డి, రాజ్యసభ ఎంపీ

మాటలతో ఎదుర్కోలేరా?



ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా బహిరంగ హింసను ప్రబోధించే సూచన ఇదేమీ మొదటిసారి కాదు ('భారత్ జోడో యాత్ర'లో భాగంగా ఖాకీ నిక్కర్ తగలబడుతున్నట్టుగా చిత్రించడాన్ని ఉద్దేశించి). ఈ తరహా వరుస దూషణ, విషం చిమ్మే దృశ్యాలే దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ క్యాడర్ హత్యలకు కారణం అవుతున్నాయి.
– వికాస్ సారస్వత్, ఆంట్రప్రెన్యూర్

చదువు కోసమే...



నేను ఎప్పుడూ అనుకున్నదేమంటే, ఎంపీల్యాడ్స్ నిధులను రానున్న ఎన్నికల కోసం సిద్ధం కావడానికి వాడకూడదు; దానికి బదులుగా రానున్న తరం భవిష్యత్తు కోసం వాడాలి. గ్రామీణ పాఠశాలలను నిర్మించడానికీ, పాత బడులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నా ఎంపీల్యాడ్స్ నిధులన్నీ వెచ్చించాలని నిర్ణయించుకున్నాను.
– వరుణ్ గాంధీ, లోక్‌సభ ఎంపీ

టీకా వేసుకోనందుకు...



పన్నెండేళ్ల వయసు ఉండీ టీకాలు వేసుకోని ఇతర కెనడియన్ల లాగే నాకు కూడా జిమ్‌లో వ్యాయామం చేయడానికి అనుమతి లేదు. నైట్‌క్లబ్బులు, బార్లు, జనం ఎక్కువ పోగయ్యే చోట్లకు పోలేను. పెళ్లిళ్లకు హాజరు కాలేను. నన్ను కెనడాలో బంధించినట్టు అయింది. దేశం విడిచి వెళ్లలేను. ఇండియాలోని నా కుటుంబాన్ని కూడా చూడలేను.
– రవ్ అరోరా, కెనడా కాలమిస్ట్

కార్లులేని నగరం



హేట్సాఫ్! స్పెయిన్‌లోని పొంటేవేద్రా నగరంలో పంతొమ్మిదేళ్లుగా కార్లు లేవు. 2009 నుంచీ అక్కడ ఒక్క ట్రాఫిక్ మరణం కూడా నమోదు కాలేదు. 2013 నుంచీ 61 శాతం కాలుష్యం తగ్గుముఖం పట్టింది. సుమారు 70 శాతం నగర జనాభా కాలినడకనే పనులకు వెళ్తారు. అన్నట్టూ, కార్లను నిషేధించిన మేయర్ వరుసగా నాలుగుసార్లు ఎన్నికయ్యారు.
– ఎరిక్ సొల్‌హెయిమ్, నార్వే దౌత్యవేత్త

బ్రహ్మాండం!



మొత్తానికి 'బ్రహ్మాస్త్ర' చూశాను. నేననుకోవడం ఈ సినిమా హిందూయిజాన్ని విశ్వవ్యాప్తంగా అంగీకరించేలా చేసింది. హిందూయిజం, భారత సంస్కృతితో ఏ సంబంధమూ లేని ఒక పాశ్చాత్య దేశంలోని బాలుడు కూడా దీన్ని ఒక భారతీయుడిలాగే ఎంజాయ్ చేయగలడు. వాళ్ల సంస్కృతితో పరిచయం లేకపోయినా 'హ్యారీపాటర్'ను మనం ఎలా చూస్తామో అలా!
– అమీనా బేగమ్ అన్సారీ, పరిశోధకురాలు

సారాంశం
సరికొండ చలపతి

సదా.. మీ చెప్పు చేతుల్లోనే..

నాటకాలు బాగా ప్రదర్శిస్తున్న రోజుల్లో ఓ సరదా సంభాషణ ప్రాచుర్యంలో ఉండేది.

'ఏమోయ్.. నాటకం బాగా రక్తి కట్టిందటగా ఏ మాత్రం కలెక్షన్ వచ్చిందేమిటి?'.. కొంచెం వ్యంగ్యంగా అన్న ప్రశ్నకు.. **'మహా బాగా వచ్చాయి.. బాటా తొంభై, నాటు నలభై.. అన్నీ ఎడమ కాలివే..'** అని నిష్ఠూరపు సమాధానం.

ఇప్పుడు నాటకాలు పాలిటిక్స్‌లో బాగా రక్తి కడుతుండడంతో ఆ బాటా, నాటు జోళ్ల అవసరం, ప్రస్తావన ఇక్కడ బాగా పెరిగింది..

ఏదైనా పరస్పర విరుద్ధం అని చెప్పడానికి ఉప్పు, నిప్పు అంటారు. రాజకీయాల్లో విరుద్ధమైన రెండింటికీ 'చెప్పు' ఒక్కటే చాలు. స్వామిభక్తిని చాటడానికైనా. నిరసన తెలపడానికైనా.. 'చెప్పు' చేతపడితే చాలు. ఇలారండి ..భారత రాజకీయాలు ఎలా చెప్పుచేతుల్లో ఉన్నాయో చూద్దాం..

'షూ'ట్ ఎట్ షార్ట్‌కట్..

నిజానికి చెప్పుల కథ ఎప్పుడు మొదలైందో చెప్పడం కష్టంగానీ.. రామ భరతుల కాలంనాటి 'పాదుకా పట్టాభిషేకం' మనకు ఎరుకే. ఆ తర్వాత బాగా పాపులర్ అయ్యింది.. ఎమర్జెన్సీ రోజుల్లో నాటి యూపీ ముఖ్యమంత్రి ఎన్డీ తివారీ. అసలు ఏ అధికార పదవిలోనూ లేని సంజయ్ గాంధీ చెప్పులు తివారీ చేతందుకోవడం మొదలు తరచుగా నాయకులు పాదుకా స్పర్శలో 'అమితా'నందాన్ని పొందుతూనే ఉన్నారు.

నిన్నటి బండి సంజయ్ – అమిత్ షా చెప్పుల ఉదంతం చూశాం... ఎప్పుడో 2015 నాటి నారాయణసామి – రాహుల్ చెప్పుల కథను ప్రధాని మోదీ ప్రస్తావించడం.. ఇప్పుడది ట్రోల్ అవుతుండటం చూస్తున్నాం..

నాడు రాహుల్ కాళ్లకు ఎక్కడ బురద అంటుకుంటుందోనని.. కాంగ్రెస్ నేత నారాయణసామి చెప్పులు చేతబట్టుకుని మరీ కాపలా కాశారు. రాహుల్ బూట్లు అలా విప్పగానే చటుక్కున తన చెప్పులు ఆయన కాళ్ల వద్ద పెట్టి స్వామి భక్తిని 'చెప్పు'కున్నారు. 'రాహుల్ వంటి సీనియర్‌ను గౌరవించుకోవడం తప్పా..?' అని కూడా ఈ 68 ఏళ్ల వయసున్న పెద్దాయన అప్పట్లో చెప్పారు. 2010లో మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రి రమేశ్ బాగ్వే ముంబైకి వచ్చిన రాహుల్ గాంధీ చెప్పులను కాసేపు 'గౌరవం'గా చేత పట్టుకున్నారు.

ఇదే రాహుల్‌గాంధీ ఆమధ్య కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై 'చెప్పు'డు విమర్శలకు దిగారు. తాము అమిత్‌షా నివాసానికి వెళితే ఇంటి బయటే చెప్పులు విప్పించారని, లోపల అమిత్‌షా మాత్రం చెప్పులు వేసుకునే ఉన్నారని మణిపూర్ ప్రజాప్రతినిధులు తనతో చెప్పారంటూ.. అమిత్‌షా క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు కూడా.

కొన్నేళ్ల కింద బీజేపీ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం ఉమా భారతి.. ప్రభుత్వ అధికారులు ఉన్నది తమ చెప్పులు మోసేందుకే అన్నట్టుగా మాట్లాడారు. తర్వాత క్షమాపణలు చెప్పుకున్నారనుకోండి

'షూ'ట్ ఎట్ ఫైట్

ఇక యూపీలోని సంత్ కబీర్‌నగర్‌లో ఇద్దరు బీజేపీ నేతలు పబ్లిక్ ముందే చెప్పులాటకు దిగారు. శిలాఫలకంపై తన పేరు లేదన్న ఆగ్రహంతో ఊగిపోయిన బీజేపీ ఎంపీ శరద్ త్రిపాఠీ.. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ బఘేల్‌ను చెప్పుతో కొడితే.. రాకేశ్ తిరిగి లెంపకాయతో బదులిచ్చారు.

'షూ'ట్ ఎట్ సైట్

ఎప్పుడూ భక్తి తన్మయత్వమేనా.. అప్పుడప్పుడూ నిరసనల కోపం కూడా చెప్పులను చేతబట్టించింది.

- 2009లో దైనిక్ జాగరణ్ రిపోర్టర్ జర్నైల్ సింగ్ నాటి కేంద్ర మంత్రి చిదంబరంపై విసిరిన బూటు దేశంలో కలకలం రేపింది.
- 2016లో యూపీలోని సీతాపూర్ జిల్లాలో రోడ్‌షో చేస్తున్న రాహుల్ గాంధీ వైపు హరిఓం మిశ్రా అనే సామాజిక కార్యకర్త విసిరిన నిరసన బూటు దూసుకొచ్చింది. 2012లో డెహ్రాడూన్‌లో జరిగిన ఓ రాజకీయ సభలోనూ రాహుల్‌కు ఇలాంటి అనుభవమే ఎదురైంది.
- 2016లోనే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతుంటే.. వేద ప్రకాశ్ శర్మ అనే రాజకీయ కార్యకర్త చెప్పు విసిరి తన నిరసన చెప్పుకున్నాడు.
- విమానంలో బిజినెస్ క్లాస్ సీటు ఇవ్వలేదంటూ శివసేన ఎంపీ రవీంద్ర గైక్వాడ్ ఎయిరిండియా సిబ్బందిని చెప్పుతో కొట్టిన ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలూ వచ్చాయి.
- అప్పట్లో కర్ణాటక సీఎంగా ఉన్న యడ్యూరప్పపై చెప్పుదాడి జరగడంతో.. చెప్పుల లొల్లి చెప్పలేనంత తలనొప్పిగా మారిందని నాటి ఎలక్షన్ కమిషనర్ ఖురేషీ తల పట్టుకున్నారు. ఈ 'ట్రెండ్'ను ఆపడానికి ఏదో ఒకటి చేయాలనీ అన్నారు.

'షూ'ట్ ఎట్ హైట్

కొందరు రాజకీయ నేతలు చెప్పుల ఎత్తు పెంచుకుని.. కొత్త ఎత్తులకు వెళ్లారని పాశ్చాత్య మీడియా అప్పుడప్పుడూ కోడై కూస్తుంటుంది. లీడర్ల అసలు ఎత్తుకు, అధికారికంగా చెప్పే ఎత్తుకు సంబంధం ఉండదని అంటూ ఉంటుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎత్తు బూట్లు వేసుకుని ఎత్తయిన వ్యక్తిలా కనిపించే ప్రయత్నం చేస్తారని అది ఆయన విజయ రహస్యమనీ చాలాసార్లు వార్తలూ వచ్చాయి.

కొన్నేళ్ల కింద అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవడానికి వెళ్లిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎత్తు చెప్పులు వేసుకెళ్లారని గోల చేశారు కూడా. ఇక మన దీదీ మమతా బెనర్జీ హవాయి చెప్పుల 'సింప్లిసిటీ'కి ఎంత ఇమేజ్ ఉందో తెలిసిందే కదా!

నువ్వేం 'షూ'టర్?

అప్పట్లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న జార్జ్ బుష్‌పై ఓ నిరసనకారుడు బూటు విసిరాడు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో ఓ జోక్.. బూటు విసిరిన వ్యక్తికి జడ్జి మూడేళ్ల జైలుశిక్ష వేశారు. 'కేవలం బూటు విసిరితే మూడేళ్ల జైలా?' అని నిందితుడు వాపోతే.. **'కాదు.. విసిరినందుకు ఒక్క ఏడాదే.. అది తగలకుండా మిస్సయినందుకు మిగతా రెండేళ్ల జైలు'** అని జడ్జి ఆగ్రహం!

ఇది 'షూ'పర్..



పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికి మన అమ్మల చేతిలో ఉన్న బ్రహ్మాస్త్రం 'చెప్పు' లేనట.. ఆ భయం చూపి.. అల్లరిపిల్లలను దారిలో పెడుతున్నారని సరదా కామెంట్. ఇలా అమ్మలు వారి ఆయుధాన్ని విరివిగా వాడి పిల్లలను డిసిప్లిన్‌లో పెడితే... ముందు తరాల రాజకీయాల్లో చెప్పుల అవసరం బాగా తగ్గుతుందని ఓ నెటిజన్ ఉవాచ.

అనంతుడు

జ్యోతిర్మయం

విష్ణు సహస్రనామాలలో 'అనంతుడు' అన్న పేరు ఉంది. 'వీరో–అనంతో– ధనంజయః' అని. అనంతుడు అంటే అంతం లేని వాడు అని. అంటే హద్దులు లేని వాడు. రెండు పదార్థాలు పక్కపక్కనున్నాయంటే, వాటిలో ఒకటి ఎక్కడ ఆరంభమౌతుందో అది రెండో పదార్థానికి అంతం. గాలిలో బంతిని చూస్తాం. బంతి ఆకారపు హద్దు లోపల ఉన్నది బంతి. హద్దు బయట ఉన్నది బంతి కాని పదార్థం (గాలి). బంతి అనే వస్తువు అంతమైన చోట, బంతి కాని పదార్థం మొదలౌతుంది. కానీ నారాయణుడు సర్వవ్యాపి. విశ్వమంతా మొదలూ తుదీ లేకుండా, సర్వము తానెయై, రెండో పదార్థం లేకుండా వ్యాపించి ఉన్నాడు. కనక ఆయన వస్తుపరమైన హద్దులేవీ లేని అనంతుడు.

నిన్న లేకుండా, నేడు పుట్టి, రేపు పోయే వస్తువుకు కాలపరంగా ఆది, అంతం అనే హద్దులున్నట్టు! కానీ అనంతుడు అనాదినిధనుడు, జనన మరణాలు లేనివాడు. భూత భవిష్యత్ వర్తమాన కాలాలు మూడింటిలోనూ ఉంటాడు. కనక కాలపరమైన హద్దులకు కూడా అనంతుడు అతీతుడు. ఒక వస్తువు ఒక చోట ఉంటే దాని ఉనికి ఆ చోటికే పరిమితం. హిమాలయం భారతదేశానికి ఉత్తరంలో ఒక కొసన ఉంది. అంటే పశ్చిమాన, దక్షిణాన, తూర్పునా లేదు. తనున్న చోటికే పరిమితం. నారాయణుడో? ఇందుగలడందు లేడని సందేహము లేదు. అందరిలోనూ, అన్నిటిలోనూ, అన్ని చోట్లా సర్వాంతర్యామిగా ఉన్నవాడు. కనక ఆయన దేశపరంగా కూడా అనంతుడు.

అందుచేత, అనంతుడు అన్న నామానికి, 'సర్వ వ్యాపీ, నిత్యుడూ, సర్వాత్ముడూ అయిన వాడు కనక దేశపరంగా గానీ, కాలపరంగా కానీ, వస్తుపరంగా కానీ పరిమితులు లేని వాడు' అని ఆదిశంకరులు అర్థవంతమైన, సమగ్రమైన, సంక్షిప్తమైన భాష్యం చెప్పారు. 'ఎవ్వని గుణజాల మెన్న జిహ్వాలు లేక, నళిన గర్భాదులనంతుడందు'రని భాగవతం చమత్కరిస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఇంద్రకీలాద్రి ఉత్సవమూర్తులకు బంగారు కిరీటాలు

కానుకగా సమర్పించిన భక్తులు


ఆలయ ఈవో భ్రమరాంబకు బంగారు కిరీటాలను అందచేస్తున్న దాతలు


దాతలు సమర్పించిన బంగారపు కిరీటాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామివార్లకు ముంబైకి చెందిన భక్తులు సుమారు రూ.65 లక్షలతో 1.308 కేజీల స్వర్ణ కిరీటాలను కానుకగా సమర్పించారు. ముంబైకి చెందిన రీకాన్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి జి.హరికృష్ణారెడ్డి కుటుంబం ఉత్సవమూర్తులకు అలంకరించేందుకు గాను మూడు స్వర్ణ కిరీటాలను తయారు చేయించింది. వీటిని సోమవారం ఆలయ ఈవో భ్రమరాంబకు వారు అందజేశారు. అంతకుముందు దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించిన అధికారులు.. స్వర్ణ కిరీటాలను అమ్మవారి వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను ఈవో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ప్రధాన అర్చకుడు మల్లేశ్వరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యుని సేవలో కేంద్ర మంత్రి


కేంద్రమంత్రికి పట్టు వస్త్రాలు, లడ్డు ప్రసాదం అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవి: కృష్ణా జిల్లా మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సోమవారం కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి.. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అర్చకులు.. కేంద్రమంత్రికి, ఎమ్మెల్యేకు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

302 కిలోల గంజాయి స్వాధీనం

లారీ, 550 బియ్యం బస్తాలు, 2 సెల్‌ఫోన్లు సీజ్.. • ఇద్దరి అరెస్ట్


పట్టుబడ్డ గంజాయితో పోలీసులు

కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద సోమవారం పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు ఈ కేసు వివరాలను వెల్లడించారు. లారీలో గంజాయి రవాణా చేస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు 16వ నంబర్ జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న పీబీ 02 బీకే 9272 నంబరు లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో 25 కిలోల బియ్యం బస్తాలు 550 లోడ్ చేసి, వాటి కింద 12 బస్తాల్లో 302.060 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి రవాణా చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్లు పఠాన్ అయూబ్ ఖాన్, మహ్మద్ ఇజాజ్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. వీరిద్దరూ పంజాబ్‌కు చెందిన జిందాసింగ్ వినోద్ లారీలో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరు బిహార్‌లోని హాజీపూర్ వద్ద బియ్యం లోడు చేసుకుని రాజమహేంద్రవరం వచ్చారు. యజమాని సూచనల మేరకు లారీని రాజమహేంద్రవరం ఆటోనగర్‌లోని టాటా మోటార్స్ వద్ద ఇద్దరు వ్యక్తులకు అప్పగించారు. వారు లారీని తీసుకువెళ్లి అందులో గంజాయి బస్తాలు ఉంచి, తిరిగి లారీని డ్రైవర్లకు అప్పగించారు. లారీ యజమాని జిందాసింగ్ వినోద్, డ్రైవర్లు అయూబ్ ఖాన్, ఇజాజ్‌ఖాన్‌తోపాటు గంజాయి లోడు చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.లారీ, 12 గంజాయి బస్తాలు, 550 బియ్యం బస్తాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

Andhra Pradesh State Co-operative Marketing Federation Ltd.,
D.No.56-2-11, Phase 3rd, Markfed Lay at No. 49/84, APIIC Colony Road, Jawahar Auto Nagar, Vijayawada Vijayawada (Urban), Krishna (Andhra Pradesh)-520007, Ph: 8978040004. e-mail: sreedhar.a@apmarkup.com
EXPRESSION OF INTEREST
Applications are invited for Expression Of Interest (EOI) for empanelment of interested millers/processors for milling of different natural farming produce (paddy, tur, urad, moong, chana & turmeric) and supply to specified delivery points for MARKUP (A Consumer Division of AP Markfed). Applications will be accepted till 23/09/2022, 12.00 Hrs. EOI containing detailed description of the Tender is available on AP Markfed's Website https://apmarkfed.ap.gov.in under "Tenders" section and www.tender.apeprocurement.gov.in. Firms are advised to go through the detailed EOI, and ensure their eligibility and other details before submitting the tender.
Sd/- MANAGING DIRECTOR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం.15 టూ 18/2022-23 తేది:06-09-2022
పర్యవేక్షక ఇంజినీర్, పంచాయతీరాజ్, శ్రీకాకుళం పరిధిలో 4 పనుల నిమిత్తము రూ.600.85 లక్షల అంచనా వ్యయంతో ఆన్‌లైన్ టెండర్లు పిలువబడుచున్నవి. టెండర్లు 13-09-2022 తదుపరి ఇ-మార్కెట్‌ప్లేస్ https://tender.apeprocurement.gov.in/login.html నందు లభ్యమగును.
సం/- పర్యవేక్షక ఇంజినీర్, పంచాయతీరాజ్, శ్రీకాకుళం
DIPR RO No.5867/CL/Advt/1/1/2021-22, Dt:12.09.2022

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A Joint venture company of Government of A.P and Government of India)
e - Procurement Tender Notice
APSPCL invites tender for the works of "APSPCL - LAD - KUMSP (1000 MW) - Formation of Single Lane BT Road of length 4.10 KM from Solar Park internal Road between P9-P17 to Sunnampalli Village of Orvakal Mandal of Kurnool District. A.P." Approximate Value of Work Rs. 1.87 Cr. Schedule Available Date & Time: 12.09.2022 from 05.00 P.M. For details visit: www.apspcl.ap.gov.in (or) www.apeprocurement.gov.in

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ప్లాట్ నం. 9, సర్వే నం. 49, IT పార్క్, మంగళగిరి-522503, గుంటూరు జిల్లా, అమరావతి రీజియన్, ఆంధ్రప్రదేశ్. ఇమెయిల్: ee.aphmhidc@gmail.com
టెండరు నోటీస్ నం. 4/APMSIDC/Technical/2022-23, తేది: 09.09.2022
దిగువ తెలిపిన ప్రదేశాల వద్ద మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం NMC నిబంధనలను నెరవేర్చేందుకు దిగువ తెలిపిన ప్రస్తుత ఆసుపత్రులలో అదనపు సదుపాయాలు ఏర్పాటు చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి : 1) ఏలూరు (2వ పిలుపు), పని విలువ : రూ. 156.58 లక్షలు. 2) నంద్యాల (2వ పిలుపు), పని విలువ : రూ.331.06 లక్షలు. 3) రాజమహేంద్రవరం (1వ పిలుపు), పని విలువ : రూ.120.00 లక్షలు. ఇతర వివరాలను వెబ్‌సైట్ http://msidc.ap.nic.inలో చూడవచ్చును.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No.1263PP/CL/Advt/1/1/2021-22, Dt: 12.09.2022

The Andhra Pradesh Mineral Development Corporation Limited (APMDC)
Door No. 294/1D, 100 feet Road, Kanuru, Vijayawada - 521137, Andhra Pradesh.
Tel: +91-866-2429999 Fax: +91-866-2429977 Email: contracts-ho@apmdc.in
NOTICE INVITING TENDER
E-TENDERS FOR DEVELOPMENT OF COLOUR GRANITE (BLACK PEARL) DEPOSIT (78.421 HA) AT EDAVALLI (V), CHILAKALURIPET (M), PALNADU (D) ON RAISING CUM SALE CONTRACT BASIS
Tender No: APMDC/HO/P&C/CG(Edavalli)/2022-23 Dt: 13.09.2022
APMDC Ltd.invites E-tenders from reputed agencies for development of Colour Granite (Black Pearl) Deposit (78.421 Ha) at Edavalli (V), Chilakaluripet (M), Palnadu (D) on Raising Cum Sale Contract Basis. For more information on the eligibility criteria, tender fees, timelines, and other details, please visit the e-procurement portal of GoAP (www.tender.apeprocurement.gov.in) or APMDC website www.apmdc.ap.gov.in. The tender document is available for download from 13.09.2022 and last date for bid submission is 04.10.2022.
Place: Vijayawada Sd/- Vice Chairman and Managing Director
Date: 13th September, 2022 The A.P. Mineral Development Corporation Limited

దేశానికే ఏపీ రోల్‌మోడల్

ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు ఆలోచనే అద్భుతం

- జాతీయ స్థాయిలో ఏపీ మోడల్ సేవలను అందుబాటులోకి తేవాలి
- నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.మహోపాత్ర
- ఆర్బీకేల సాంకేతికత పట్ల విదేశాలు సైతం ఆసక్తి చూపుతున్నాయి
- జాతీయ స్థాయిలో అమలుకు అన్ని రాష్ట్రాలు ముందుకు రావాలి
- భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్


వర్క్ షాప్ లో మాట్లాడుతున్న మహోపాత్ర... చిత్రంలో హిమాన్షు పాఠక్, పూనం మాలకొండయ్య తదితరులు

సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు సేవలందించడంలో ఏపీ ప్రభుత్వం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ (నాస్) ప్రెసిడెంట్ టి.మహోపాత్ర ప్రశంసించారు. జాతీయ స్థాయిలో ఏపీ మోడల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా కృషి జరుగుతోందన్నారు. నాస్ ఆధ్వర్యంలో 'ఇన్నోవేటివ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మోడల్స్' అనే అంశంపై న్యూఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు ఆలోచనే ఓ అద్భుతమన్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు, గోదాములు, శీతలీకరణ గదులు, కలెక్షన్ సెంటర్లతోపాటు నియోజకవర్గ స్థాయిలో అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ మేరకు కేంద్రానికి నివేదిక సమర్పిస్తామన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ ఆర్బీకేల సాంకేతికత పట్ల విదేశాలు కూడా ఆసక్తి చూపుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో అమలుకు అన్ని రాష్ట్రాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏపీ తరహాలో సర్టిఫై చేసిన ఇన్‌పుట్స్ పంపిణీ, ప్రభుత్వ సేవలు, రైతు శిక్షణ కార్యక్రమాలు, పంట కొనుగోళ్లు గ్రామ స్థాయిలో చేపడితే అద్భుత ఫలితాలు వస్తాయని చెప్పారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఏకే సింగ్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వంతో ఐసీఏఆర్ కలిసి పనిచేస్తోందని తెలిపారు. ఆర్బీకేల బలోపేతానికి ఐసీఏఆర్ చేయూతనిస్తుందన్నారు.

సీఎం ఆలోచనల నుంచే ఆర్బీకేలు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిందే ఆర్బీకే వ్యవస్థ అని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య అన్నారు. వర్క్‌షాపులో ఆర్బీకే సేవలపై ఆమె పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో 10,778 ఆర్బీకేల ద్వారా రైతులకే కాకుండా ఆక్వా, మత్స్యసాగు చేసే రైతులు, పాడి రైతులకు కూడా సేవలందిస్తున్నామన్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ విధానాల ద్వారా వాస్తవ సాగుదారులకే ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు అందిస్తున్నామన్నారు. రైతుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను గ్రామ స్థాయిలోనే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. సర్టిఫై చేసిన ఇన్‌పుట్స్ పంపిణీ కోసం నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌తో పాటు వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ మనీష్ సి.షా, నాస్ కార్యదర్శి డాక్టర్ పీకే జోషి, నాబార్డు సీజీఎం సీఎస్ఆర్ మూర్తి, మేనేజ్ డైరెక్టర్ జనరల్ పి.చంద్ర శేఖర, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,793 మంది స్వామిని దర్శించుకోగా, 30,254 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.47 కోట్లు వేశారు. దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.

పట్టాలు తప్పిన కిరండూల్ ప్యాసింజర్

ప్రయాణికులు సురక్షితం

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం- కిరండూల్(08551)స్పెషల్ ప్యాసింజర్ రైలు సోమవారం జయ్‌పూర్-చత్రిపుట్ స్టేషన్ల మధ్య పట్టాలు తప్పింది. ఒక స్లీపర్ క్లాస్, మూడు జనరల్ కోచ్‌లు పట్టాలు తప్పాయి. రైలులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా ఉన్నారని రైల్వే అధికారులు తెలిపారు. ప్రైవేట్ బస్సులు, కార్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపారు. రాత్రి తొమ్మిది గంటలకు ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు.

లోన్ యాప్ ఘటనలో ఏడుగురి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : లోన్ యాప్ వేధింపులకు బలైన దంపతుల సంఘటనలో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. రాష్ట్రంలో రుణ యాప్ బాధితులు పెరుగుతుండటంతో సీఎం వైఎస్ జగన్ తీవ్రంగా స్పందించారు. లోన్ యాప్‌లతో వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ నెల ఏడో తేదీన రాజమహేంద్రవరానికి చెందిన కొల్లి దుర్గారావు, రమ్యలక్ష్మి ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి, వారంలోనే నిందితుల్ని పట్టుకున్నారు. స్థానిక దిశా పోలీస్ స్టేషన్‌లో సోమవారం మీడియాకు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి వివరాలు తెలిపారు. భార్యాభర్తల ఆత్మహత్యకు కారణమైన హ్యాండీ లోన్, స్పీడ్ లోన్ యాప్‌లపై పోలీసులు ఆరా తీశారు. దీనికి సంబంధించి మూడు పోలీసు బృందాలు పనిచేశాయి. యాప్‌లకు, లోన్ తీసుకునే వారికి మధ్యవర్తులుగా పని చేస్తున్న వారిని గుర్తించారు. తెలంగాణ రాష్ట్రం గండిపేట మండలం మానికొండకు చెందిన లంబాడీ నరేష్, మియాపూర్‌కు చెందిన కొల్లూరు శ్రీనివాస్‌యాదవ్, కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన మేడిశెట్టి పృథ్వీరాజ్, ఏలేశ్వరానికి చెందిన నక్కా సుమంత్, అన్నవరానికి చెందిన మండా వీరవెంకటహరిబాబు, విశాఖ జిల్లా కేకే అగ్రహారానికి చెందిన కోరుపోలుత రామకృష్ణ, అనకాపల్లి సమీపంలోని సిరసపల్లికి చెందిన దానబోయిన భాస్కర్లు నిందితులని పోలీసులు గుర్తించారు. వీరి బ్యాంకు ఖాతాలను పరిశీలించగా నెలలోనే రూ.కోటి లావాదేవీలు చేసినట్టు గుర్తించారు. బ్యాంకు అధికారులకు అనుమానం రాకుండా ప్రతి నెలా వేర్వేరు ఖాతాలను వీరు నిర్వహిస్తున్నారు. పోలీసులకు ఇతర రాష్ట్రాల్లోని యాప్ నిర్వాహకుల సమాచారం కూడా లభించడంతో ఆ దిశగా కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. త్వరలోనే వీరిని కూడా పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

ఉదయగిరిలో బాలిక కిడ్నాప్!

- అటవీ ప్రాంతంలో చెట్టుకు కట్టేసిన కిడ్నాపర్లు
- బాలికను రక్షించిన జీవాల కాపరులు


బాలికతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాలిక బంధువులు

ఉదయగిరి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా) : ఉదయగిరి పట్టణంలో సోమవారం ఓ బాలికను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి అడవిలో చెట్టుకు కట్టేశారు. ఆ బాలికను గొర్రెల కాపరులు రక్షించి ఇంటికి చేర్చారు. ఉదయగిరి దిలావర్‌భాయి వీధికి చెందిన రషీద్, నస్రీన్‌లకు సమ్రీన్, మసీరా అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. స్థానిక నాగులబావి వీధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మసీరా ఐదో తరగతి, సమ్రీన్, ఏడో తరగతి చదువుతున్నారు. సోమవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి పాఠశాల నుంచి భోజనం కోసం ఇంటికి వచ్చారు. అనంతరం సమ్రీన్ ముందు వెళ్లగా, మసీరా ఇంటి నుంచి ఆలస్యంగా బయలుదేరింది. మార్గమధ్యంలో బైక్‌పై మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మసీరాను కిడ్నాప్ చేశారు. పట్టణ శివారులోని బండగానిపల్లి వైపు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి పొదల్లో ఓ చెట్టుకు బాలికను కట్టేసి వెళ్లిపోయారు. అటవీ ప్రాంతంలో ఉన్న గొర్రెలకాపరులు బాలికను గుర్తించి కట్లు విప్పి వివరాలు తెలుసుకుని ఇంటికి చేర్చారు. అప్పటికే పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన సమ్రీన్.. చెల్లిని ఎందుకు స్కూలుకు పంపలేదని తల్లిని అడిగింది. దీంతో మసీరా పాఠశాలకు వెళ్లకపోవడం, ఇంట్లో లేకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెదకడం ప్రారంభించారు. అదే సమయంలో బాలిక అటవీ ప్రాంతం వైపు నుంచి ఇంటికి రావడంతో కిడ్నాప్ ఉదంతం బయటపడింది. ఈ నేపథ్యంలో బాలిక బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక నుంచి వివరాలు తెలుసుకున్న ఎస్ఐ జి.అంకమ్మ... నాగులబావి వీధిలోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర ఆర్థికమంత్రిని కలిసిన స్వాత్మానందేంద్ర

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


నిర్మలాసీతారామన్‌కి శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సాక్షి, న్యూఢిల్లీ/సింహాచలం: విశాఖపట్నంలోని శారదాపీఠంలో ఈనెల 26 నుంచి నిర్వహించనున్న శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలకు రావాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆ పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి ఆహ్వానించారు. న్యూఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో సోమవారం స్వాత్మానందేంద్ర ఆమెకు ఆహ్వానపత్రం ఇచ్చారు. అమ్మవారి ప్రసాదాన్ని, ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని అందజేశారు. స్వధర్మ వాహిని సంస్థ ద్వారా తమ పీఠం చేపట్టనున్న ధర్మ ప్రచారం గురించి వివరించారు. గిరిజన తండాలు, దళితవాడల్లో ధర్మ ప్రచారం కోసం రూపొందించిన ప్రణాళికపై చర్చించారు. స్వధర్మ వాహిని సంస్థకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండాలని ఆకాంక్షించారు. పూజాదికాల నిర్వహణ కోసం మత్స్యకారులు, గిరిజనులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. కోస్టల్ కారిడార్ వెంబడి మత్స్యనారాయణుడి ఆలయాలు నిర్మించడం ద్వారా ఆయా వర్గాలపై అన్యమతాల ప్రభావం తగ్గుతుందని సూచించారు. మరోవైపు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి నుంచి రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి, విదేశీ వ్యవహారాలశాఖ అదనపు కార్యదర్శి రమేష్‌చంద్ర, ఏపీ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్, అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాంశు కౌశిక్, పంజాబ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.శివప్రసాద్ తదితరులు రాజశ్యామల అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఏసీబీ వలలో ఎంపీడీవో

రూ.40 వేల లంచం తీసుకున్న పి.గన్నవరం ఎంపీడీవో విజయ


లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎంపీడీఓ విజయ

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ఎంపీడీవో కె.ఆర్.విజయ రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఎంపీ ల్యాడ్స్ మంజూరు కోసం మండల పరిషత్ నుంచి 10 శాతం మ్యాచింగ్ గ్రాంటు ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. మండలంలోని రాజులపాలెంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.1.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించాలని పంచాయతీలో నిర్ణయించారు. ఎంపీ లాడ్స్ మంజూరుకు ముందుగా గ్రామ పంచాయతీ నుంచి 10 శాతం, మండల పరిషత్ నుంచి 10 శాతం సొమ్ము మ్యాచింగ్ గ్రాంటుగా చెల్లించాల్సి ఉంది. మండల పరిషత్ మ్యాచింగ్ గ్రాంటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఉప సర్పంచ్ ఎన్.విజయలక్ష్మి ఇటీవల ఎంపీడీవో విజయను కోరారు. అనుమతి ఇచ్చేందుకు ఎంపీడీవో రూ.50 వేలు డిమాండ్ చేశారు. ఈ నెల 6న విజయలక్ష్మి ఎంపీడీవోకు రూ.10 వేలు ఇచ్చారు. మిగిలిన సొమ్ము కూడా ఇవ్వాలని ఎంపీడీవో ఒత్తిడి చేయడంతో ఉప సర్పంచ్ తమను ఆశ్రయించినట్టు ఏసీబీ ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయలక్ష్మి నుంచి రూ.40 వేలు తీసుకుంటుండగా ఎంపీడీవో విజయను పట్టుకున్నట్టు చెప్పారు. తమ పరీక్షల్లో ఎంపీడీవో నగదు తీసుకున్నట్టు నిర్ధారణ అయిందన్నారు. ఎంపీడీవోను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, అరెస్టు చేస్తామని ఏఎస్పీ చెప్పారు. ఈ దాడుల్లో సీఐలు వి.పుల్లారావు, బి.శ్రీనివాస్, వై.సతీష్, ఎస్ఐ ఎస్.విల్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టేందుకు కులవాదుల కుట్ర

715వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : అమరావతి పేరుతో ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టేందుకు కులవాదుల కుట్ర నడుస్తోందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఆరోపించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 715వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సోమవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలు తనను నమ్మడం లేదని గ్రహించిన చంద్రబాబు ఓట్ల కోసం ప్రజల్లో ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే ధోరణితో అమరావతి పేరుతో దొంగ యాత్రలకు శ్రీకారం చుడుతున్నాడని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి కోరుకుంటున్న ప్రజలను రెచ్చగొట్టడమే లక్ష్యంగా అమరావతి టు అరసవెల్లి పాదయాత్ర ప్రారంభించాడనేది తేటతెల్లమవుతోందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షాలు కులవాదంతో ఓ సామాజిక వర్గ ప్రయోజనాల కోసం పాకులాడుతుండటం సిగ్గుచేటన్నారు. అమరావతి ప్రాంత అభివృద్ధితో పాటు.. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి దిశగా ప్రభుత్వం అడుగులేస్తుంటే.. బాబు అండ్ కో అడుగడుగునా అడ్డంకులు కలిగించడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో అందరికీ తెలుసన్నారు.

'స్మార్ట్ విలేజ్' సుధాకర్‌కు రిమాండ్

- 2018 నుంచి ఉద్యోగాల పేరుతో దాదాపు రూ.300 కోట్లు వసూలు
- ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో ఫిర్యాదు చేసిన బాధితులు
- నిందితుడిని అరెస్టు చేసిన సీఐడీ పోలీసులు


విశాఖలోని సీఐడీ రీజినల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): స్మార్ట్ విలేజ్ అనే సంస్థ ఏర్పాటు చేసి.. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను ముంచేసిన ఇందుపూడి సుధాకర్‌కు కోర్టు రిమాండ్ విధించింది. ఈ వివరాలను సీఐడీ డీఎస్పీ చక్రవర్తి సోమవారం మీడియాకు వెల్లడించారు. అనకాపల్లికి చెందిన ఇందుపూడి సుధాకర్ 2018లో స్మార్ట్ విలేజ్ సంస్థ ఏర్పాటు చేసి క్రమంగా రాష్ట్రంలో సుమారు 7,000 మందిని ఉద్యోగాల్లో చేర్చుకున్నాడు. ఇందుకుగాను కేడర్‌ను బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు తీసుకున్నాడు. ఇలా రూ.300 కోట్ల వరకు వసూలు చేశాడు. అయితే డబ్బులిచ్చిన చాలా మందికి సుధాకర్ ఉద్యోగాలివ్వలేదు. ఉద్యోగాలిచ్చిన కొంతమందికేమో జీతాలు ఇవ్వట్లేదు. దీంతో వివిధ జిల్లాలకు చెందిన బాధితులంతా కొంతకాలం కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన సీఐడీ ఆదివారం సుధాకర్‌ను అదుపులోకి తీసుకుంది. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐడీ డీఎస్పీ చక్రవర్తి తెలిపారు. బాధితులు విశాఖ సీఐడీ కార్యాలయంలోని సీఐ బుచ్చిరాజు 9441379913ను సంప్రదించి.. తమ వివరాలు చెప్పాలని సూచించారు. ఈ కేసుతో సంబంధమున్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేస్తామని చెప్పారు. కాగా, సుధాకర్‌ను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న బాధితులు సోమవారం విశాఖ సీఐడీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సుధాకర్ బీజేపీ నాయకుల పేర్లు చెప్పి మోసం చేశాడని.. తమకు న్యాయం చేయాలంటూ కోరారు.

మంత్రి విశ్వరూప్‌కు ప్రముఖుల పరామర్శ


విశ్వరూప్‌ను పరామర్శిస్తున్న మంత్రులు వేణు, నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ప్రసాదరాజు

రామచంద్రపురం : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను సోమవారం ఇద్దరు మంత్రులు, ఒక ఎమ్మెల్యే పరామర్శించారు. విశ్వరూప్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన విషయం తెలిసినదే. హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విశ్వరూప్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబును ఓడించేది మత్స్యకారుడే..

మంత్రి సీదిరి అప్పలరాజు



వజ్రపుకొత్తూరు రూరల్ : 'అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులను తొక్క తీస్తాం.. తోలు తీస్తాం... అంటూ కించపరిచిన చంద్రబాబును గంగపుత్రులు ఎన్నడూ మర్చిపోరు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ఓ మత్స్యకారుడే కుప్పంలో ఓడిస్తారు...' అని రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, అందువల్లే ఆ పార్టీని ప్రజలు 23 స్థానాలకు పరిమితం చేశారని చెప్పారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, ఈ నెల 22న వైఎస్సార్ చేయూత సొమ్ము జమ కానుందని తెలిపారు. పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రి నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, మరికొద్ది రోజుల్లో భావనపాడు పోర్టు నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. నువ్వలరేవు జెట్టీ పనులు, రూ.700 కోట్లతో ఇంటింటికీ తాగునీటి ప్రాజెక్టు పనులు కూడా పూర్తవుతాయన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

R.G.M. COLLEGE OF ENGG & TECH.
(AUTONOMOUS), NANDYAL - 518501, A.P., INDIA
www.rgmcet.edu.in, Mobile No : 9866308477
Applications are invited from the candidates having Doctoral Degree in any branch of Engineering from IITs/IISc/NITs/Reputed Universities from abroad / India for the post of VICE PRINCIPAL. Qualifications & Scale of pay are as per AICTE norms.
Experience: Minimum 15 years of Teaching / Research in reputed Institution and in administrative Position.
Applications are also invited for the positions of Asst. Prof., Assoc. Prof. & Professors in the Departments of CSE & ECE. Qualifications, Experience & Scale of pay are as per AICTE norms.
Please send resume along with the proof of educational qualifications to the mail ID: hr@rgmcet.edu.in on or before 24.09.2022
CHAIRMAN

SRKR ENGINEERING COLLEGE (A)
CHINAAMIRAM, BHIMAVARAM - 534 204 PH : 08816-223332
RECOGNIZED AS SIRO / ARIIA & NIRF RANKED INSTITUTE
WALK-IN INTERVIEWS
On 18/09/2022 Time : 10:00 A.M.
Applications are invited for the faculty positions in the following Branches.
- COMPUTER SCIENCE AND ENGINEERING
- INFORMATION TECHNOLOGY
- ARTIFICIAL INTELLIGENCE AND DATA SCIENCE
- ARTIFICIAL INTELLIGENCE AND MACHINE LEARNING
- COMPUTER SCIENCE AND BUSINESS SYSTEM
- COMPUTER SCIENCE AND DESIGN
- ELECTRONICS AND COMMUNICATIONS ENGINEERING
- CIVIL ENGINEERING

* Preference will be given to Ph.D. holders.



ఎస్సీఓ సదస్సుకు జిన్‌పింగ్

మోదీ, పుతిన్ సైతం హాజరయ్యే అవకాశం

బీజింగ్: చైనా అధినేత షీ జిన్‌పింగ్ రెండేళ్ల తర్వాత దేశం బయట అడుగుపెట్టబోతున్నారు. ఈ నెల 14 నుంచి 16 దాకా ఆయన కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌ల్లో పర్యటించనున్నట్లు చైనా ప్రభుత్వం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఉజ్బెకిస్తాన్‌లో షాంఘై సహకార సంఘం (ఎస్సీఓ) 22వ సదస్సులో జిన్‌పింగ్ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా పాల్గొనే అవకాశముంది. జిన్‌పింగ్ 2020 జనవరిలో మయన్మార్ పర్యటన తర్వాత కరోనా నేపథ్యంలో విదేశాలకు వెళ్లడం మానుకున్నారు. ఎస్సీఓలో చైనా, రష్యా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, భారత్, పాకిస్తాన్ సభ్యదేశాలు. ఇరాన్‌ను సైతం చేర్చుకొనేందుకు రంగం సిద్ధమయ్యింది.

కొలువుకు టాటా

అమెరికాలో ఈ ఏడాది ఇప్పటికే ఏకంగా 40 లక్షల రాజీనామాలు

- ప్రపంచవ్యాప్తంగా ఇదే ట్రెండు
- అసంతృప్తి, అరకొర జీతాల వల్లే
- సొంత వ్యాపారాలకు ప్రాధాన్యం
- దిగ్గజ కంపెనీలకు తలపోటు

కంచర్ల యాదగిరిరెడ్డి



ప్రపంచాన్ని గడగడలాడించి 65 లక్షల మందిని కబళించిన కరోనా దిగ్గజ కంపెనీలకూ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కోవిడ్ విజృంభన మొదలైనప్పటి నుంచీ లక్షల మంది ఉద్యోగాలు మానేస్తున్నారు. ప్రపంచమంతటా ఇదే ట్రెండ్ నడుస్తోంది. కరోనా కల్లోలం సద్దుమణిగినా రాజీనామాల జోరు మాత్రం తగ్గడం లేదు.

గత ఫిబ్రవరి– ఏప్రిల్ మధ్య అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఇండియా, సింగపూర్లలో 13,382 మంది ఉద్యోగులపై మెకిన్సే సర్వే చేసింది. రాజీనామాలకు కారణాలతో పాటు ఏం చేస్తే ఉద్యోగం మానకుండా ఉంటారో తెలుసుకోవడం దీని ఉద్దేశం. కనీసం 40 శాతం మంది తమ ఉద్యోగం పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తేలింది. వీరంతా మూడు నుంచి ఆర్నెల్లలో రాజీనామా యోచనలో ఉన్నారట. చేస్తున్న ఉద్యోగం కంటే మెరుగైన, మరింత తృప్తినిచ్చే పనులు చేయాలని కోరుకుంటున్నారట. ఎదుగుదలకు అవకాశాల్లేక మానేసినట్టు 41 శాతం మంది చెప్పారు. మొత్తమ్మీద ఆశించిన వేతనం, ఇతరత్రా తగినన్ని లాభాలు లేకపోవడం రాజీనామాలకు ప్రధాన కారణమని సర్వే తేల్చింది. ఈ ఏడాదిలో ఒక్క అమెరికాలోనే ఇప్పటిదాకా దాదాపు 40 లక్షల మంది ఉద్యోగాలు మానేసినట్లు తేలింది. 2022 అంతా ఇదే ట్రెండ్ కొనసాగొచ్చన్నది నిపుణుల అంచనా. ఇందుకు కరోనా కొంతవరకే కారణమని మెకిన్సే నివేదికను సిద్ధం చేసిన వారిలో ఒకరైన బోనీ డౌలింగ్ అన్నారు. ''ఉద్యోగమనే భావనే సమూలంగా మారుతున్న వైనం కొన్నాళ్లుగా స్పష్టంగా కన్పిస్తోంది. జీవితంలో ప్రాథమ్యాల విషయంలో ఆలోచనా శైలిలోనే మార్పు కనిపిస్తోంది. ఏ ఉద్యోగం చేసినా తమకు నచ్చినట్లు ఉండాలని ఆశిస్తున్నారు'' అని వివరించారు. ఉద్యోగుల మార్కెట్ ఇప్పుడిప్పుడే కరోనా ముందునాటి స్థితికి చేరుకోవడం కష్టమేనన్నారు.

నచ్చని రంగాలకు గుడ్‌బై...

కరోనా తరువాత రాజీనామా చేసిన వాళ్లలో సగం ఇతర రంగాలకు మళ్లుతున్నట్లు మెకిన్సే చెబుతోంది. సర్వేలో భాగంగా గత రెండేళ్లలో ఉద్యోగాలు మానేసిన ఐటీ, ఫార్మా, హాస్పిటాలిటీ, నర్సింగ్ రంగాలకు చెందిన 2,800 మందిని ఇందుకోసం ప్రత్యేకంగా ప్రశ్నించింది. వీరిలో 48 శాతం ఇతర రంగాల్లో అవకాశాలను వెతుక్కుంటున్నట్లు తేలింది. ''కరోనా వేళ విపరీతమైన ఒత్తిడికి గురై శక్తివిహీనంగా మారిపోయిన భావన తట్టుకోలేక పలువురు ఉద్యోగాలు మానేశారు. ఉన్న రంగంలో మెరుగైన ఆదాయం కష్టమని కొందరు ఇతర రంగాల వైపు మళ్లారు. రిటైల్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో మానేసిన వారిలో ఏకంగా 60 శాతం రంగం మారడమో, పూర్తిగా మానేయడమో చేశార''ని తేల్చింది.

భారత్‌లోనూ...

భారత ఐటీ కంపెనీల్లో ఈ ఏడాది వేలకొద్ది రాజీనామాలు జరిగాయి. గత ఏప్రిల్– జూన్ మధ్య కాలంలో ఇన్ఫోసిస్‌కు ఏకంగా 28.4 శాతం మంది రాజీనామా చేశారు. తర్వాత స్థానాల్లో విప్రో (23.3), టెక్ మహీంద్రా (22), టీసీఎస్ (19.7) ఉన్నాయి. ''ఒకే కంపెనీలో మూడేళ్ల కంటే ఎక్కువ ఉంటే ఎదుగుదలకు అవకాశాలు బాగా తగ్గుతున్నాయి. కెరీర్ కోసం అవసరమైతే ఏడాదిలో రెండు ఉద్యోగాలు కూడా మారతాం'' అని ఓ ఐటీ కంపెనీలో సీనియర్ మేనేజర్ రఘురామ మంచినేని అన్నారు. భారత ఐటీ పరిశ్రమలో ఉద్యోగులు భారీగా ఉండటమూ రాజీనామాలకు ఓ కారణమని ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ టి.వి.మోహన్‌దాస్ పాయ్ అభిప్రాయపడ్డారు. ''వాళ్లంతా పెద్ద కంపెనీల్లో చేరి కెరీర్‌ను నిర్మించుకోవాలని కోరుకుంటున్నారు''అని సాక్షి ప్రతినిధితో అన్నారు.

స్వయం ఉపాధే బెటర్...



మరో ఉద్యోగం చూసుకోకుండానే రాజీనామా చేసిన వారిలో 29 శాతమే మళ్లీ సంప్రదాయ కొలువుల్లో చేరారు. మిగతా వారిలో చాలామంది సొంత వ్యాపారాలకు మొగ్గారు. కొందరు పార్ట్‌టైం కొలువులకు జై కొట్టారు. కరోనా సమయంలో అమెరికాలో సొంత వ్యాపారాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 30 శాతం పెరిగిందట. 2021లోనే 54 లక్షల దరఖాస్తులు వచ్చాయని వైట్‌హౌస్ వెల్లడించింది.

మనోళ్లు అక్కడలా...



అమెరికాలోని భారత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కరోనా సమయంలో వర్క్ ఫ్రమ్ హోం కాసులు కురిపించింది. ఓవైపు వేలాది మంది రాజీనామాలు చేస్తుంటే మనవాళ్లేమో ఫుల్ టైం కొలువుకు తోడు రెండు, మూడు కాంట్రాక్టు ఉద్యోగాలు కూడా చేశారు. ఇది వారికీ, అటు ఉద్యోగుల కొరతతో అల్లాడిన పలు కంపెనీలకూ కలిసొచ్చింది. కానీ యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఇకపై వారానికి కనీసం 3 రోజులు విధిగా ఆఫీసుకు రావడం తప్పనిసరి చేయడంతో చాలామంది పార్ట్ టైం కొలువులకు స్వస్తి పలకాల్సి వస్తోంది.



రాణి నిస్వార్థ సేవను కొనసాగిస్తా

బ్రిటన్ పార్లమెంట్‌లో కింగ్ చార్లెస్–3 తొలి ప్రసంగం

లండన్: బ్రిటన్ రాజు హోదాలో కింగ్ చార్లెస్–3 పార్లమెంట్‌లో తొలి ప్రసంగం చేశారు. సోమవారం లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో ఉభయ సభల సభ్యులనుద్దేశిస్తూ మాట్లాడారు. ''దివికేగిన ప్రియమైన మాతృమూర్తి నిస్వార్థ సేవకు ప్రతిరూపం. ప్రజాసేవకు అంకితమైన రాణి ఎలిజబెత్ బాటలో నడుస్తూ రాజ్యాంగబద్ధ అత్యున్నత పాలనా ప్రమాణాలను కొనసాగిస్తా. ప్రజాస్వామ్యానికి నిలువెత్తు నిదర్శనమైన బ్రిటన్ పార్లమెంట్‌లో క్వీన్ ఎలిజబెత్ సేవను మరోసారి స్మరించుకుందాం. దేవుడి, మీ పరిపూర్ణ సహకారంతో నా బాధ్యతలు నిర్వరిస్తా'' అని అన్నారు. గురువారం అస్తమయం చెందిన రాణి ఎలిజబెత్–2కు ఎంపీలు సహా దాదాపు 900 మంది ఘనంగా నివాళులర్పించారు. మరోవైపు, రాణి పార్థివదేహాన్ని మంగళవారం స్కాట్లాండ్ నుంచి లండన్‌కు వాయు మార్గంలో తీసుకురానున్నారు.

క్లుప్తంగా...

హోం మంత్రి మఫ్లర్ ఖరీదు రూ.80 వేలు: గహ్లోత్

జైపూర్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేసుకునే మఫ్లర్ ఖరీదు రూ.80 వేలు కాగా, కాషాయ పార్టీ నేతలు రూ.2.5 లక్షల విలువ చేసే కళ్లద్దాలు ధరిస్తున్నారని రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో బీజేపీలో ఆందోళన మొదలైందన్నారు. ప్రధాని, హోం మంత్రి, బీజేపీ నేతలు విధులను వదిలేసి, రాహుల్ గాంధీపై దాడే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ రూ.41 వేల విదేశీ టీ షర్టు వేసుకున్నారన్న బీజేపీ వ్యాఖ్యలపై గహ్లోత్ ఈ మేరకు స్పందించారు.

త్వరలో ఆన్‌లైన్‌లోనే వినియోగదారుల ఫిర్యాదుల విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: వినియోగదారుల ఫిర్యాదులపై విచారణను ఇకపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ఆరంభించింది. ఇది అమల్లోకి వస్తే ఫిర్యాదు దారులు భౌతికంగా కేసుల విచారణకు హాజరయ్యే అవసరం గణనీయంగా తగ్గనుంది. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేందుకు, కేసులను సత్వరమే పరిష్కరించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్ ప్రకటించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉండే అన్ని వినియోగదారుల కమిషన్‌లలో త్వరలోనే ఈ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

ఫొగాట్ మృతి కేసు సీబీఐకి

న్యూఢిల్లీ/పణజి: సంచలనం రేపిన బీజేపీ నేత సోనాలీ ఫొగాట్(43) మృతి కేసును సీబీఐకి అప్పగిస్తూ కేంద్ర హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హోం శాఖ సోమవారం సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖను కోరినట్లు అధికారి ఒకరు వెల్లడించారు. సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలోనే సీబీఐ పని చేస్తుంది. హరియాణాలోని హిసార్‌కు చెందిన ఫొగాట్ గత నెలలో గోవాలో అనుమానాస్పద స్థితిలో చనిపోయారు. ఈ కేసు దర్యాప్తులో గోవా పోలీసులు గణనీయమైన పురోగతి సాధించారని అంతకు మునుపు గోవా సీఎం ప్రమోద్ సావంత్ చెప్పారు. అయితే, హరియాణా ప్రజలు, ఫొగాట్ కూతురి డిమాండ్ మేరకు ఈ కేసును సీబీకి బదిలీ చేయాలని కోరుతూ హోం శాఖకు లేఖ రాశానన్నారు. ఫొగాట్ మృతికి సంబంధించి ఆమె ఇద్దరు సహాయకులతోపాటు ఐదుగురిని ఇప్పటి వరకు గోవా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బంగ్లాదేశ్‌కు కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం త్వరలో బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఇటీవల భారత్‌లో పర్యటన సందర్భంగా బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఈ మేరకు ఆహ్వానించారు. షేక్ హసీనా ఆహ్వానం మేరకు ఏడు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు కేంద్రం కూడా సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. కనీసం మూడు రోజులపాటు సాగే ఈ పర్యటన షెడ్యూల్ త్వరలోనే ఖరారవుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

సంతృప్తి లేదు.. అసంతృప్తీ లేదు

ఎన్సీపీ నేత అజిత్ పవార్ వ్యాఖ్యలు

ముంబై: ఎన్సీపీలో తానేమీ అసంతృప్తితో రగిలిపోవడం లేదని ఆ పార్టీ సీనియర్ నేత అజిత్ పవార్ అన్నారు. ''అలాగని సంతోషంగా ఉన్నానని చెప్పడం లేదు'' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఢిల్లీలో పార్టీ జాతీయ సదస్సు సభావేదికపై నుంచి అజిత్ మధ్యలో వెళ్లిపోయారంటూ జాతీయ మీడియాలో వార్తలు రావడం తెల్సిందే. వీటిపై సోమవారం ఆయన స్పందించారు. 'గంటల తరబడి వేదికపై ఉండి అలసిపోవడంతో వాష్‌రూమ్‌కు వెళ్లా' అని ఆయన అన్నారు. ఎన్సీపీ మహారాష్ట్ర విభాగం చీఫ్ జయంత్ పాటిల్‌తో అజిత్‌కు పొసగడం లేదంటున్నారు.

ఉపసంహరణ ప్రక్రియ పూర్తి!

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో గోగ్రా–హాట్‌స్ప్రింగ్స్‌లోని పెట్రోలింగ్ పాయింట్(పీపీ) 15 నుంచి భారత్, చైనా సైనికుల బలగాల ఉపసంహరణ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. సోమవారం ఇరు దేశాల జవాన్లు వెనక్కి వెళ్లిపోయారు. అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మౌలిక సదుపాయాలను సైతం నేటమట్టం చేశారు. ఐదు రోజుల ఉపసంహరణ ప్రక్రియ ముగిసినట్లు ఈ అంశంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. పీపీ–15 నుంచి భారత్, చైనా సైన్యం వెనక్కి మళ్లినప్పటికీ డెమ్‌చోక్, డెప్సాంగ్‌లో ఉద్రిక్తతల నివారణపై ఇంకా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

లంపీ వ్యాధి వ్యాప్తిని అడ్డుకుంటాం

- ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి
- ప్రపంచ పాడి సదస్సులో ప్రధాని మోదీ




గ్రేటర్ నోయిడా(యూపీ): పశుసంపదను బలితీసుకుంటున్న లంపీ చర్మ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉమ్మడిగా కలిసి పనిచేస్తున్నాయని ప్రధాని మోదీ రైతాంగానికి భరోసా ఇచ్చారు. ప్రాణాంతక వైరస్ కారణంగా ప్రబలే లంపీ వ్యాధి పశువుల్లో తీవ్రమైన జ్వరం, చర్మంపై గడ్డలు ఏర్పడి తుదకు ప్రాణాలను హరిస్తోంది. ఇటీవలికాలంలో ఈ వ్యాధికారణంగా గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, హరియాణాసహా ఎనిమిది రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో పాడి ఆవులు, పశువులు మృత్యువాతపడిన విషయం తెల్సిందే. సోమవారం గ్రేటర్ నోయిడాలో ఇంటర్నేషనల్ డైరీ ఫెడరేషన్ వరల్డ్ డైరీ సమ్మిట్‌ను ప్రారంభించి మోదీ ప్రసంగించారు. 'రైతులకు, వారి ఆదాయానికి, పాల ఉత్పత్తికి విఘాతంగా మారిన లంపీ వ్యాధి వ్యాప్తి నిరోధానికి దేశీయంగా వ్యాక్సిన్ అందుబాటులోనే ఉంది. మూడేళ్లలో దేశంలోని అన్ని పశువులకు కాళ్ల, నోటి సంబంధ వ్యాధులకు సంబంధించిన వ్యాక్సినేషన్ పూర్తిచేస్తాం' అని మోదీ అన్నారు. ''పశు ఆధార్ పేరిట ప్రతీ పాడిజంతువుకు బయోమెట్రిక్ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో పాడి పరిశ్రమ విస్తరణతోపాటు సంతులిత పాడి ఆర్థికవ్యవస్థ సాధ్యమవుతుంది. గోవర్ధన్ యోజనతో వ్యవసాయ, డెయిరీ రంగంలో కొత్తగా వేయికిపైగా అంకుర సంస్థలు పురుడుపోసుకున్నాయి. మహిళల భాగస్వామ్యం వల్లే డెయిరీ సెక్టార్ వృద్ధిబాటలో పయనిస్తోంది. ఎనిమిదేళ్ల క్రితంతో పోలిస్తే 44 శాతం వృద్ధితో పాల ఉత్పత్తి నేడు 21 కోట్ల టన్నులకు పెరిగింది. ప్రపంచ వృద్ధి రేటు (2 శాతం)తో పోలిస్తే భారత్‌లో పాల ఉత్పత్తిలో వార్షిక వృద్ధి రేటు 6 శాతానికి పెరిగింది. చిన్న రైతుల వల్లే ఇది సాధ్యమైంది'' అని మోదీ అన్నారు.

ఆ పిటిషన్‌పై ఇక విచారణే

'జ్ఞానవాపి' కేసులో వారణాసి కోర్టు నిర్ణయం

వారణాసి: జ్ఞానవాపి మసీదు కేసులో హిందువులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కొనసాగించాలని వారణాసి జిల్లా కోర్టు సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. దాని విచారణార్హతను సవాలు చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని తిరస్కరిస్తున్నట్టు జిల్లా జడ్జి ఎ.కె.విశ్వేశ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆరాధన స్థలాల చట్టం 1991, వక్ఫ్ చట్టం 1995, యూపీ శ్రీ కాశీవిశ్వనాథ ఆలయ చట్టం 1983 ప్రకారం హిందువుల పిటిషన్‌ను తోసిపుచ్చలేమన్నారు. విచారణను 22వ తేదీకి వాయిదా వేశారు. కాశీ విశ్వనాథ ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలోని హిందూ దేవతల విగ్రహాలకు నిత్య పూజలకు అనుమతి కోరుతూ ఐదుగురు మహిళలు గతంలో సుప్రీంకోర్టులో సివిల్ సూట్ దాఖలు చేయడం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ మసీదు ప్రాంగణంలో సర్వే చేసి నివేదిక సమర్పించింది. జ్ఞానవాపి మసీదు వ్యవహారంపై వారణాసి జిల్లా కోర్టు విచారణ చేపట్టింది.



హైకోర్టును ఆశ్రయిస్తాం: మసీదు కమిటీ

జిల్లా కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయిస్తామని మసీదు కమిటీ తరపు న్యాయవాది మిరాజుద్దీన్ సిద్దిఖీ చెప్పారు. జ్ఞానవాపి మసీదు వక్ఫ్ బోర్డు ఆస్తేనని మసీదు కమిటీ వాదిస్తోంది. జిల్లా జడ్జి ఉత్తర్వు గురించి తెలియగానే జనం కోర్టు బయట గుమికూడారు. మిఠాయిలు పంచుకొని హర్షం వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం ఆదివారం ముందస్తుగా పరిసర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించింది.

తొలి అవరోధం దాటాం: వీహెచ్‌పీ

జిల్లా కోర్టు సంతృప్తికరమైన ఉత్తర్వు ఇచ్చిందంటూ వీహెచ్‌పీ హర్షం వ్యక్తం చేసింది. ''న్యాయ పోరాటంలో తొలి అవరోధం దాటేశాం. ఇది విజయమో, పరాజయమో కాదు. కేవలం మతపరమైన, ఆధ్యాత్మిక అంశం. కోర్టు ఉత్తర్వును వినమ్రంగా, ప్రశాంతచిత్తంతో స్వీకరించాలి'' అని వీహెచ్‌పీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్ అన్నారు.



తీర్పుపై పిటిషన్‌దారుల సంబరాలు

ఆప్ ఆఫీసులో సోదాలు!

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లోని తమ పార్టీ కార్యాలయంలో పోలీసులు అక్రమంగా సోదాలు జరిపారని ఆప్ ఆరోపించింది. అలాంటిదేమీ లేదని పోలీసులు ఖండించగా, సోదాలు చేసినట్టు తమ వద్ద ఆధారాలున్నాయని పేర్కొంది. దీనిపై తమ ప్రశ్నలకు బదులిచ్చేందుకు సీఎం భూపేంద్ర పటేల్ సిద్ధమా అని ప్రశ్నించింది. ''రెండు రోజుల పర్యటన కోసం ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం చేరుకున్న కాసేపటికే పోలీసులు అహ్మదాబాద్‌లోని మా పార్టీ ఆఫీసులోకి పోలీసులు బలవంతంగా ప్రవేశించారు. ఎలాంటి వారెంట్ లేకుండానే రెండు గంటలపాటు సోదాలు జరిపారు. డబ్బు, ఇతర అక్రమ లావాదేవీల పత్రాలు లభించకపోయేసరికి మళ్లీ వస్తామంటూ సిబ్బందిని బెదిరించి వెళ్లారు'' అని ఆప్ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. బహిరంగ చర్చకు సీఎం సిద్ధమైతే సోదాలు చేపట్టిన అధికారుల వివరాలను కూడా అందజేస్తామన్నారు. ''రాష్ట్రంలో కేజ్రీవాల్ ప్రజాదరణ చూసి బీజేపీలో ఆందోళన మొదలైంది. అందుకే ఇలా పోలీసుల ద్వారా మా ఆఫీసులో సోదాలకు తెగబడింది'' అని ఆరోపించారు. అయితే గుజరాత్ పోలీసులు ఆప్ వీటిని ఖండించారు. ఆప్ కార్యాలయంలో తాము ఏ సోదాలూ జరపలేదంటూ ట్వీట్ చేశారు.

వసూళ్ల కోసమే సోదాలు: కేజ్రీవాల్

దర్యాప్తు సంస్థలను అవినీతిని రూపుమాపేందుకు బదులుగా అక్రమ దందా కోసమే వాడుకుంటోందని కేంద్రంపై ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆదివారం అహ్మదాబాద్ కార్యాలయంలో సోదాల సమయంలో తమ పార్టీ శ్రేణులను పోలీసులు డబ్బులు అడిగారన్నారు. ఏమీ దొరక్కపోయేసరికి ఎలాంటి సోదాలు జరపలేదంటూ పోలీసులు చెప్పుకోవడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు. 'ఈ దేశంలో ఏం జరుగుతోంది? పోలీస్ సర్కార్ ఇలాగే పనిచేస్తుందా? ఎలాంటి పత్రాలు లేకుండానే పోలీసులు ఇళ్లు, ఆఫీసుల్లోకి చొరబడతారా?'అని సోమవారం అహ్మదాబాద్ టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కేజ్రీవాల్ ప్రశ్నించారు. బడా వ్యాపారవేత్తల నుంచి దేశానికి విముక్తి కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఆయన చెప్పారు.

ఆటో డ్రైవర్ ఇంట్లో భోజనం



అహ్మదాబాద్‌లో కేజ్రీవాల్ ఓ ఆటోడ్రైవర్ కోరిక మేరకు ఆయన ఇంట్లో భోజనం చేశారు. సోమవారం జరిగిన ఆటో డ్రైవర్ల కార్యక్రమంలో విక్రమ్ దంతానీ అనే డ్రైవర్ కేజ్రీవాల్‌ను తన ఇంటికి ఆహ్వానించారు. ''నేను మీ అభిమానిని. పంజాబ్‌లో ఆటో డ్రైవర్ ఇంట్లో మీరు భోంచేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో చూశా. మా ఇంట్లో భోజనానికి వస్తారా?'' అని అడగ్గా కేజ్రీవాల్ అంగీకరించారు. ''ఎప్పుడు రమ్మంటారు? నేను బస చేసిన హోటల్ నుంచి మీ ఆటోలో తీసుకెళ్తారా?'' అని అడిగారు. అన్నట్టుగానే రాత్రి విక్రమ్ ఆటోలోనే ఆయన ఇంటికి భోజనానికి వెళ్లారు. ఇదంతా నాటకమని, కేజ్రీవాల్ గొప్ప నటుడని గుజరాత్ మంత్రి హర్ష సంఘ్వీ ఎద్దేవా చేశారు.



హింసాద్వేషాలు పరిష్కారం కాదు

కేరళలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

తిరువనంతపురం: విద్వేషం, హింసతో ఎన్నికల్లో విజయం సాధించవచ్చు తప్ప వాటితో దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ఎంతమాత్రం పరిష్కరించలేమని, కొత్త ఉద్యోగాలు సృష్టించలేమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అధికార బీజేపీ ఈ విషయాన్ని నిరూపించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కేరళలో సోమవారం రెండో రోజుకు చేరుకుంది. రాహుల్ గాంధీ తిరువనంతపురం జిల్లాలోని వెల్లాయానీ జంక్షన్ నుంచి ఉదయం పాదయాత్ర ప్రారంభించారు. భారీ సంఖ్యలో జనం ఆయన వెంట యాత్రలో పాలుపంచుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. రాహుల్ వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు శశిథరూర్, కేసీ వేణుగోపాల్, కె.సుధాకరన్, సతీశన్ తదితరులు ఉన్నారు. కళాకూట్టమ్ వద్ద ప్రజలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. దేశంలో మన పాలకులు ప్రజలతోపాటు ప్రసార మాధ్యమాల గొంతుక వినిపించకుండా నొక్కేస్తున్నారని ఆరోపించారు. అందుకే నేరుగా ప్రజలతో మాట్లాడానికి జోడో యాత్ర ప్రారంభించామని తెలియజేశారు. మన దేశం, మన యువత మెరుగైన రేపటి రోజు కోసం ఆశగా ఎదురు చూస్తోందని, ప్రతి ఉషోదయం తనతో కొత్త ఆశను, నమ్మకాన్ని నింపుతోందని రాహుల్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. 'దేశం కోసం అందరు, దేశం కోసం ప్రతి అడుగు' అని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతకు బలమైన కాంగ్రెసే మూలస్తంభమని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ సోమవారం ఢిల్లీలో మీడియాతో అన్నారు. యాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు.



యాత్రలో ఓ వృద్ధురాలితో రాహుల్

మంటల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఖాకీ నిక్కర్

కాంగ్రెస్ ట్వీట్‌పై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మండిపాటు

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)కు గతంలో యూనిఫాంలో భాగమైన ఖాకీ నిక్కర్ మంటల్లో ఉన్న ఫొటోను కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేయడం రాజకీయ దుమారం రేపింది. 'దేశాన్ని విద్వేషపు సంకెళ్ల నుంచి విముక్తి చేయడం, ఆర్‌ఎస్‌ఎస్–బీజేపీ విధానాలతో కలిగిన నష్టాన్ని తగ్గించడమనే లక్ష్యాన్ని మేం అంచెలంచెలుగా సాధిస్తాం. ఇందుకు ఇంకా 145 రోజులే మిగిలి ఉన్నాయి'అనే వ్యాఖ్యతో ఇటీవల మొదలైన భారత్ జోడో యాత్రను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ సోమవారం మంటల్లో ఖాకీ నిక్కర్ ఫొటోను జత చేసింది. దీనిపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా స్పందించాయి. కాంగ్రెస్ దేశంలో హింసను ప్రేరేపిస్తోందని మండిపడ్డాయి. కేరళలో ప్రస్తుతం భారత్ జోడో యాత్ర సాగుతున్న ప్రాంతంలోని తమ బీజేపీ, హిందూ సంస్థల నేతలపైకి ఉగ్రవాదులను ఉసిగొల్పేందుకే కాంగ్రెస్ ఇలాంటి ట్వీట్లు చేస్తోందని బీజేపీ ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. కాంగ్రెస్ యాత్రను ఆయన భారత్ తోడో(ముక్కలు చేసే) యాత్ర, ఆగ్ లగావో(నిప్పు పెట్టే) యాత్ర అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి మంటలతో ఎప్పటి నుంచో అనుబంధం ఉందని పేర్కొన్న సంబిత్ పాత్రా.. ఆ పార్టీ అధికారంలో ఉండగా 1984 అల్లర్లలో సిక్కులను సజీవంగా దహనం చేసిందంటూ ఎదురుదాడికి దిగారు. మంటల్లో ఖాకీ నిక్కర్ ట్వీట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. విద్వేషాలను ప్రేరేపించడం ద్వారా ప్రజలను కాంగ్రెస్ కలపాలనుకుంటోందని ఆర్‌ఎస్‌ఎస్ జాయింట్ జనరల్ సెక్రటరీ మన్‌మోహన్ వైద్య పేర్కొన్నారు. ఆ పార్టీ గత నాయకత్వం కూడా ఇటువంటి ప్రయత్నాలు చేసినా తమ హిందుత్వ వాదనకు సమాజంలో ఆదరణ పెరుగుతోందని చెప్పారు.



నార్కో టెర్రరిజం కేసులో ఎన్‌ఐఏ సోదాలు

న్యూఢిల్లీ: దేశంలోకి మాదకద్రవ్యాలను అక్రమంగా తేవడం, వాటిని విక్రయించగా వచ్చిన సొమ్మును ఉగ్రవాదం వ్యాప్తికి వాడుతున్నారంటూ నమోదైన కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) సోమవారం ఢిల్లీ, పంజాబ్, హరియాణా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లలో సోదాలు జరిపింది. డ్రగ్స్ స్మగ్లింగ్‌తో సంబంధమున్న గ్యాంగ్‌స్టర్ల నివాసాల్లోనూ సోమవారం దాడులు కొనసాగాయి. పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసు నిందితులైన గ్యాంగ్‌స్టర్లు గోల్డీ బ్రార్, జగ్గూ భగవాన్‌పురియా ఇళ్లలో అధికారులు సోదా చేశారు. ఢిల్లీసహా 50 చోట్ల దాడులు చేసి ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, డ్రగ్ స్మగ్లర్లు, సరఫరాదారుల మధ్య ఏర్పడుతున్న కొత్త నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేశామని ఒక ఎన్‌ఐఏ అధికారి చెప్పారు. దేశ, విదేశాల్లో అత్యంత క్రియాశీలకంగా ఉన్న గ్యాంగ్‌స్టర్లపై గత నెల 26లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఐఏ ఈ ముమ్మర సోదాలు జరిపింది. ఈ గ్యాంగ్‌స్టర్‌లలో కొందరు భారత్ నుంచి పారిపోయి కెనడా, పాకిస్తాన్, మలేసియా, ఆస్ట్రేలియాలో ఉంటూ అక్కడి నుంచే భారత్‌లో తమ అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

ఆపరేషన్ చేసేందుకు...

3 కి.మీ. పరుగెత్తిన డాక్టర్



బనశంకరి: ఆస్పత్రికి వెళ్లి అర్జంటుగా ఆపరేషన్ చేయాలి. కానీ విపరీతమైన ట్రాఫిక్. దాంతో ఆ డాక్టర్ ఏకంగా 3 కిలోమీటర్లు ఏకబిగిన పరుగెత్తారు. సకాలంలో ఆస్పత్రికి చేరుకుని విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు. ట్రాఫిక్ జామ్‌లకు పెట్టింది పేరైన బెంగళూరులో ఆగస్టు 30న ఈ సంఘటన జరిగింది. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గోవింద్ నంద కుమార్ ఒకావిడకు అత్యవసరంగా పిత్తాశయ శస్త్రచికిత్స చేయడానికి సర్జాపురలోని మణిపాల్ ఆస్పత్రికి కారులో బయల్దేరారు. ఇంకో 3 కిలోమీటర్లు ఉందనగా ట్రాఫిక్ జామైంది. గూగుల్‌లో చెక్ చేస్తే ట్రాఫిక్ క్లియరవడానికి కనీసం 45 నిమిషాలు పడుతుందని చూపించిందట. ఆలస్యమైతే రోగికి ప్రాణాపాయమని కారును డ్రైవర్‌కు వదిలేసి ఆయన కాళ్లకు పని చెప్పారు. దీనికి సంబంధించిన క్లిప్‌ను ఆయన ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. ఈ ఫీట్‌పై సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. 'హ్యాట్సాఫ్', 'ఆయన రియల్ హీరో', 'నిజంగా స్ఫూర్తిదాయకం' అంటూ డాక్టర్ గారిని నెటిజనం తెగ మెచ్చుకుంటున్నారు. ఆయన రెగ్యులర్‌గా జిమ్ చేస్తారట. అందుకే అలవోకగా పరిగెత్తినట్టు చెప్పుకొచ్చారు. ట్రాఫిక్ కారణంగా ఆస్పత్రులకు సకాలంలో చేరేందుకు గతంలోనూ డాక్టర్ నందకుమార్ చాలాసార్లు ఇలా నడకనూ, పరుగునూ ఆశ్రయించారట! కొన్నిసార్లయితే రైల్వే లైన్లను కూడా క్రాస్ చేస్తూ పరిగెత్తానని చెప్పారాయన.


సాక్షి
విజయనగరం
మంగళవారం ‌। 13 ‌। సెప్టెంబర్ ‌। 2022

వీడని వరద



రేగిడి: మండలంలోని ఆకులలోవ కట్టిగెడ్డలో నీటి ఉధ్ధృతి తగ్గలేదు. రేగిడి గ్రామం చుట్టూ వరదనీరు చుట్టుముట్టింది. ప్రజలు, విద్యార్థులు నీటిలో నుంచే సోమవారం రాకపోకలు సాగించారు. తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఇరిగేషన్ జేఈలు రాజేష్, రమణ, ఆర్ఐ ఉమాపట్నాయిక్, వీఆర్వో తదితరులు రేగిడి గ్రామాన్ని సందర్శించారు. గెడ్డను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు.

పులి పుకార్లు..



గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో పులి సంచరిస్తోందంటూ పుకార్లు షికారు చేస్తున్నాయి. చంపావతి నదికి వెళ్లే మార్గంలో పెద్ద పాదముద్రలను చూసి పులి పాదముద్రలు అంటూ ప్రచారం సాగుతోంది. పొలంపనులకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు.

నేడు డీసీఎంఎస్ సర్వసభ్య సమావేశం

విజయనగరం ఫోర్ట్: జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డీసీఎంఎస్) సర్వ సభ్య సమావేశం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్టు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 93 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రెండు రైతు సేవా సహకార సంఘాలు, 12 ఇతర సహకార సంఘాల అధ్యక్షులందరూ ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన



గురుకుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షిస్తున్న చంద్రావతి

రేగిడి: గురుకుల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సాగించాలని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకులాల సమన్వయాధికారి బి.చంద్రావతి సూచించారు. రేగిడి మండలం ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజన, వసతి, డార్మెటరీ, గురుకులం పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని, పీహెచ్‌సీ వైద్యాధికారులతో పరీక్షలు చేయించాలని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజుకు సూచించారు. గురుకులం నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేలా విద్యను బోధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్య, ఆరోగ్యశాఖ, వైద్య కళాశాల, వైద్యవిధాన్ పరిషత్‌లలో 194 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్‌జాబితాను 'విజయనగరం.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తెలియజేయాలన్నారు. కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఒకేషనల్ (ఎంఎల్‌టీ) చదివినవారు తప్పనిసరిగా ప్రభుత్వాస్పత్రిలో క్లినికల్ ట్రైనింగ్‌చేసి ఉండాలన్నారు. ఎలక్ట్రీషియన్, ల్యాబ్ అటెండెంట్, లైబ్రరీ అసిస్టెంట్, మార్చురీఅసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ప్లంబర్, స్టోర్ అటెండర్ పోస్టులకు మినహాయించి మిగిలిన పోస్టులకు రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు.

ఆడిట్ అభ్యంతరాలపై స్పెషల్ డ్రైవ్

- జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఆడిట్ అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలపై అన్ని శాఖలు వెంటనే స్పందించి, వాటిని పరిష్కరించుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. నెలరోజుల్లో ఆడిట్ అభ్యంతరాలన్నీ పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆడిట్ అభ్యంతరాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలను జిల్లా ఆడిట్ అధికారి అరుణకుమారి వివరించారు. నిర్దేశిత తేదీలను తెలియజేస్తే తమ అధికారులతో ఆయా శాఖల కార్యాలయాలకు వచ్చి అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ ఆడిట్ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలపై స్పందించి, వాటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ఆయా శాఖలపై ఉందన్నారు.

- అన్ని రకాల ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని, ప్రజలకు సేవలందించేలా జిల్లాలో ఎంపిక చేసిన 300 మంది ఆపద మిత్రులకు శిక్షణ ఇవ్వాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. ఆపద మిత్రల శిక్షణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా విపత్తుల నిర్వహణాధికారి బి.పద్మావతి మాట్లాడుతూ వలంటీర్లతోపాటు ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్లు, సివిల్ ఇంజినీర్లు, అగ్నిమాపక, పోలీస్ అధికారులు వయసుతో సంబంధం లేకుండా ఆపద మిత్రలుగా చేరవచ్చన్నారు. వీరికి ఈ నెల 16 నుంచి 12 రోజుల శిక్షణ ఇస్తామని చెప్పారు. మండలానికి ఇద్దరు చొప్పున ఆశ కార్యకర్తలను ఎంపిక చేసి, ఆపదమిత్ర శిక్షణ ఇప్పించాలని జేసీ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డీపీఓ ఇందిరా రమణ, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, మత్స్యశాఖాధికారి ఎస్.నిర్మలాకుమారి, సెట్విజ్ సీఈఓ రామానందం, పోలీసు, అగ్నిమాపక, అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు.

అందాల లోకానికి హాయివే



అరకు.. ఓ అందమైన పర్యాటక ప్రదేశం. ఆంధ్రా ఊటీగా పేరుంది. అరకు వెళ్లే పర్యాటకులు సుఖంగా.. హాయిగా వాహనాలపై సాగిపోయేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాయి. విశాఖ-అరకు మార్గంలో పెందుర్తి నుంచి ఎస్.కోటలోని బొడ్డవర వరకు ఉన్న రాష్ట్ర రహదారికి జాతీయ రహదారి హోదా కల్పించడంతో పనులు జోరందుకున్నాయి. తొలుత విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి కొత్తవలస మీదుగా ఎల్.కోట మండలం గోల్డుస్టార్ కూడలి వరకు 18 కిలోమీటర్ల రహదారిని రూ.9కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ముందుగా పాడైన రోడ్డును రూ.60లక్షల వ్యయంతో బాగుచేస్తు న్నారు. కొత్తవలస కూడలిలో సుమారు 600 మీటర్ల మేర రోడ్డును ఏడు మీటర్ల నుంచి 12 మీటర్ల వరకు విస్తరించారు. ప్రయాణాలు సాఫీగా సాగేలా రోడ్డును నిర్మిస్తున్నట్టు హైవే అధికారులు చెబుతున్నారు.

– ఎల్.కోట



ఎల్.కోట మండలం మల్లివీడు సమీపంలో సాగుతున్న హైవే పనులు

14 నుంచి అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో రెవెన్యూ డివిజన్ల వారీగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు ఈ నెల 14వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని భోగాపురం, గంట్యాడ, ఎస్.కోట, వియ్యంపేట, విజయనగరం మండలంలోని నాలుగు కార్యకర్తల పోస్టులు, 38 హెల్పర్ పోస్టులు, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, 15న చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం, వీరఘట్టం మండలాలకు చెందిన 5 అంగన్‌వాడీ వర్కర్లు, 29 హెల్పర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16న బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని బాడంగి, బొబ్బిలిరూరల్, సాలూరు, బొబ్బిలి అర్బన్, గజపతినగరం మండలాల్లో ఖాళీగా ఉన్న 27 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, ఒక మిని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

పట్టణాల్లో భూముల రీసర్వే



- వందేళ్ల తర్వాత నగరం/పట్టణాల్లో భూముల రీసర్వేకు ప్రభుత్వ ఆదేశం
- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం అమలు
- విజయనగరంలో 51.62 స్క్వేర్ కిలో మీటర్ల పరిధిలో సర్వేకు కార్యాచరణ
- సర్వే సిబ్బందికి శిక్షణ పూర్తి
- భూ సర్వే బాధ్యతలు ప్లానింగ్ కార్యదర్శులకు అప్పగింత
- వ్యవసాయ, వ్యవసాయేతర, లే అవుట్, రెసిడెన్షియల్ భూములకు సర్వే
- రీ సర్వేలో హద్దుల నిర్ణయం అనంతరం శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేత

ఏడాదిలోగా పూర్తి చేస్తాం..

నగరం/పట్టణాల్లో భూముల రీ సర్వేకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. నగర హద్దులు నిర్ణయించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో క్రోడీకరిస్తున్నాం. సుమారు 100 ఏళ్ల తరువాత జరుగుతున్న రీ సర్వేలో ప్రణాళిక విభాగ కార్యదర్శుల సేవలు వినియోగించుకుంటాం. వారికి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణలు పూర్తియితే సర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో డ్రోన్‌ల సహాయంతో చేపడతాం. ఈ రీ సర్వేతో భూ హక్కుదారులకు శాశ్వత హక్కు లభిస్తుంది.

– సింహాచలం, టౌన్ సర్వేయర్, విజయనగరం కార్పొరేషన్

విజయనగరం:

కొద్దినెలల్లో నగరాలు/ పట్టణాల్లో భూ వివాదాలు సమసిపోనున్నాయి. భూ యజమానులకు శ్వాశ్వత హక్కులు సంక్రమించనున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తోన్న జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకాన్ని ఉమ్మడి జిల్లాల్లోని విజయనగరం కార్పొరేషన్‌తో పాటు సాలూరు మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో అమలుకు చర్యలు ప్రారంభించింది. సుమారు 100 ఏళ్ల తరువాత భూముల రీ సర్వే చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. రీ సర్వే బాధ్యతలను నగరం/పట్టణాల్లో ప్లానింగ్ కార్యదర్శుల ఆధ్వర్యంలో చేపట్టనుండగా.. ఇప్పటికే మాస్టర్ ట్రైనీలకు సర్వే విధి, విధానాలపై శిక్షణ ఇచ్చింది. వారు మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. రీ సర్వేలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములతో పాటు లే అవుట్‌లు, రెసిడెన్షియల్ భవనాలను పాత, అధునాతన పద్ధతుల్లో సర్వే చేపట్టి శాశ్వత హక్కు పత్రాలు అందజేయనున్నారు.

రెండు నెలల్లో క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం...

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో 100 ఏళ్ల కిందట భూములు సర్వే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సర్వే చేపట్టలేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడుతున్న సర్వేలో ప్రతి అంగుళం భూమి వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరిచి హక్కుదారులను గుర్తించనున్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 1917–22 సంవత్సరంలో అప్పటి పట్టణ విస్తీర్ణం 8.86 స్క్వేర్ కిలోమీటర్ల పరిధితో సర్వే నిర్వహించగా.. 2022 సంవత్సరంలో 51.62 స్క్వేర్ కిలో మీటర్ల పరిధితో రీ సర్వే నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. 50 డివిజన్లుగల విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 61 వార్డు సచివాలయాలు ఉండగా... వాటి పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రణాళికా కార్యదర్శులు సర్వే చేపట్టనున్నారు. ప్రస్తుతం సర్వే విభాగాధికారులు హద్దులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తుండగా... రెండు నెలల్లో సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో ప్రారంభించనున్నారు. ఏడాది కాలంలో సర్వే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదే తరహాలో బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో భూముల రీసర్వే జరగనుంది.

అందుబాటులో వివరాలు..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రతివ్యక్తి భూ హక్కు సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. వారి ఆస్తికి సంబంధించిన వివరాలు ప్రపంచంలో ఎక్కడి నుంచి అయినా పరిశీలించే అవకాశముంది. పలు చోట్ల భూములకు సంబంధించిన అడంగల్, 1బీలో మార్పులు జరుగుతున్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. వాటికి అడ్డుకట్ట పడుతుంది. ప్రభుత్వ, స్థానిక సంస్థల భూములు, చెరువుల సంరక్షణకు వీలవుతుంది. ఆక్రమణల గుర్తింపునకు వెసులబాటు కలుగుతుంది. ప్రతి భూమి వివరాలు నమోదవుతాయి. అవసరం మేరకు హద్దులను నిర్ధారించి వివాదాలకు తెర దించనున్నారు.

పాత, కొత్త పద్ధతుల్లో భూముల రీ సర్వే..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకంలో భాగంగా భూముల రీ సర్వే ప్రక్రియ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో ప్రారంభం కానుంది. దీనికోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. డ్రోన్ సర్వే కోసం ఎస్.కోటలో కోర్స్ టవర్‌ను వినియోగించనున్నారు. అలాగే, పూర్వపద్ధతులను అనుసరిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో భూముల రీ సర్వే సాగుతుండగా, ఇప్పుడు నగరాలు/ పట్టణాల్లో అదే తరహాలో చేపట్టనున్నారు. భూమి ఉన్న ప్రతి వ్యక్తికి హక్కు భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం భారీ వ్యయంతో రీ సర్వేకు సమాయత్తమైంది. నగరాలు, పట్టణాల్లో వ్యవసాయ, ప్రభుత్వ, ప్రైవేటు, దేవదాయ, బంజరు భూముల సర్వేను డ్రోన్‌ల సహాయంతో నిర్వహించనున్నారు. ఈ సర్వే కంటే ముందు ఆయా ప్రాంతాల్లో సరిహద్దుల నిర్ధారణ, మ్యాప్‌ల తయారీ పనిలో సర్వే అధికారులు నిమగ్నమయ్యారు.

వివాదాలకు చెక్...

భూ వివాదాలు పరిష్కరించేందుకు, సర్వే పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను నియమించింది. రాష్ట్ర స్థాయిలో కమిషనర్ డీఎంఏ చైర్మన్‌గా, సభ్యులుగా సర్వే విభాగం నియమించే సీనియర్ అధికారి, సీసీఎల్ఏ నుంచి సీనియర్ అధికారి, సబ్ కన్వీనర్‌గా డీటీసీపీ ఉంటారు. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ విభాగం అధికారి, సహాయక కమిషనర్లు, టౌన్ సర్వేయర్లు, సబ్ కన్వీనర్లగా పట్టణ ప్రణాళికా అధికారులు, సహాయక సిటీ ప్లానర్లు వ్యవహరిస్తారు. వీరంతా చిన్నపాటి వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.



ఆన్‌లైన్‌లో నగర హద్దుల వివరాలను నమోదు చేస్తున్న కార్యదర్శులు

చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పాలన



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు, పాల్గొన్న జెడ్పీ చైర్మన్

- 98.44 శాతం హామీలు అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి
- అక్టోబర్ 1 నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అమలు
- వీటిని స్వాగతిస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు

చీపురుపల్లి: దేశ చరిత్రలో నిలిచిపోయేలా ప్రజా సంక్షేమ పాలనను రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా అక్టోబర్ 1 నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయన్నారు. వీటిని స్వాగతిస్తూ చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద ముస్లింలు సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన జెడ్పీ చైర్మన్ ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం చిత్రపటానికి ముస్లింలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో 98.44 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను గ్రంథంగా భావించి అందులో ఉన్న ప్రతీ మాటను అమలు చేస్తున్నట్టు చెప్పారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 500 హామీలతో మేనిఫెస్టో ఇచ్చి ఒక్క హామీను కూడా అమలు చేయకుండా ముఖంచాటేశారని గుర్తుచేశారు. టీడీపీ మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లోనూ లేకుండా చేశారన్నారు. తాజాగా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలు ముస్లిం, బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర కులాలకు చెందిన వారికి మేలు జరుగుతుందన్నారు.

అర్హతకలిగిన ప్రతి ఒక్కరూ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పేద వర్గాల్లో ఆడపి ల్లలు వివాహాల నుంచి కులాంతర వివాహాల వరకు ప్రభుత్వం ఈ పథకాల ద్వారా అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, చీపురుపల్లి, గరివిడి మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, ఇప్పిలి గోవింద, తాడేల ఉమ, మంగళగిరి శ్రీను, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీనివాసరావు, కొణిశ కృష్ణంనాయుడు, యలకల అప్పలనాయుడు, దాలయ్య, ముస్లిం సంఘ నాయకులు ముజీకీర్ మహ్మద్, నూరు తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ వర్ధంతి



జననం: 27-06-1945
మరణం : 05-09-2020

కీ॥శే॥ బెవర లక్ష్మునాయుడు గారు
రిటైర్డ్ సూపరింటెండెంట్, పంచాయితీరాజ్
అరుంధతీనగర్, విజయనగరం

మీరు వేసిన ప్రతిఅడుగు మాకు ఆదర్శం... నడిచిన ప్రతిదారి సదాశయం...చేసిన ప్రతిగమ్యం స్ఫూర్తి శిఖరం...
ప్రేమానురాగాలతో మా అందరికీ వెలుగునిచ్చి... జీవనజ్యోతిగా ఆఖరి వరకు దారి చూపారు... అలసిసొలసిపోయి...
విశ్రమించిన మీ పాదాలకు మా హృదయ నివాళులు అర్పిస్తూ... మీరు భౌతికంగా దూరమై నేటికి 2 సంవత్సరముల కాలం
గడిచినప్పటికీ మీ మధురజ్ఞాపకాలతో ముందుకు సాగుతూ... మీపవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

భార్య : అన్నపూర్ణ

కుమారులు - కోడళ్లు
కన్నబాబు - వినీల
రాంబాబు - శ్రీదేవి
కుమార్తె - అల్లుడు
టి.ప్రమీల - శ్రీనివాసరావు

మనుమలు :
బాలాజీనాయుడు, స్నేహిత్
మనుమరాళ్లు :
లిఖిత, పునీత

క్లుప్తంగా

జాతీయ క్రీడాపోటీల విజేతలకు నగదు పురస్కారాలు

విజయనగరం: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు నగదు పురస్కారాలు అందజేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను శాప్ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను, క్రీడల్లో సాధించిన సర్టిఫికెట్లను కాష్ఇన్‌సెంటివ్.శాప్ఎట్‌దిరేట్ఆఫ్‌జీమెయిల్.కామ్‌కు పంపించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0866-2499699 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సివిల్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

పార్వతీపురం: అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ అఖిల భారత సివిల్ ఉద్యోగుల క్రీడల పోటీలు 17 విభాగాల్లో-అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్యారమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ నిర్వహిస్తున్నారని వివరించారు. పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, పోటీల్లో పాల్గొనేవారికి ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లా క్రీడా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇందులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులను 27, 28, 29 తేదీలలో విజయవాడలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపికలకు పంపిస్తారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని జిల్లాకు పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఎంపిక పోటీలలో పాల్గొనే ఉద్యోగులు వారి వివరాలను క్రీడల చీఫ్ కోచ్‌కు అందించాలని పేర్కొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా నష్టపరిహారం



రైతుల నుంచి భూముల వివరాలు సేకరిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: రైతులకు ఉపయోగ పడే విధంగా నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఆర్డీఓ శేషశైలజ సోమవారం అన్నారు. భూసేకరణ ప్రత్యేక అధికారి నీలకంఠరావుతో పాటు ఆమె..దత్తిరాజేరు-మెంటాడ మండలాల మధ్య నిర్మాణం చేపట్టనున్న గిరిజన యూనివర్సిటీ పరిధిలో ఉన్న రైతులను కలిశారు. ఈ సందర్భంగా దత్తిరాజేరు మండలం మర్రివలస రైతులతో కలిసి స్థలాన్ని పరిశీలించి అనంతరం వారి భూమి పత్రాలను, మెంటాడ మండలం కుంటినవలస రైతులు భూమి పత్రాలను పరిశీలించి వివరాలు సేకరించారు.జాతీయస్థాయి విశ్వవిద్యాలయం నిర్మాణానికి రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల సహకారంతో భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెంటాడ, దత్తిరాజేరు తహసీల్దార్లు ఆదిబాబు, ఎం.రమణమ్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనాలపై కేసుల నమోదు

లక్కవరపుకోట (కొత్తవలస): జామి మండలం అలమండ సంత నుంచి పరిమితి మించి పశువులను తరలిస్తున్న పశువుల వ్యాన్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌లను గుర్తించి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ANDHRA PRADESH MEDICAL SERVICES INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION DIVISION :VIZIANAGARAM
1st Floor, Central Medicine Stores, Beside DM & HO's Office Building, District Hospital Compound, Vizianagaram-535003 (Mail id:eeapmsidcvzm@gmail.com)

Short Tender Notice

T.O.Short Tender Notice No.06/DB/APMSIDC/EE-VZM/2022-23/199. Dt.12.09.2022

Tenders are invited through e-procurement plotform for NIT No. 1. From registered Contractors and firms for 1 (One) work for **Rs 40.00 lakhs** in Vizianagaram Districts website:**apeprocurement.gov.in.**
On-Line tenders NIT Nos. **Last date and time for uploading: 20.09.2022 Upto 3.30PM**
Any information can be had from office working hours **Phone No.9849515953**
Sd/-**Executive Engineer**, APMSIDC Division, Vizianagaram

GOVERNMENT OF ANDHRA PRADESH ENDOWMENTS DEPARTMENT
Sri Rama Swamy Vari Devasthanam,
Ramatheertham (V), Nellimarla (M), Vizianagaram (D).
& other Group Temples

E-Procurement Tender Notice NIT 2022-23

Name of the Work	Technical Sanction Order No.	Estimate Value Rs.
Re-construction of Sri Ramalingeswara Swamy Temple, Nandigam (v), Bhogapuram (M), Vizianagaram (Dist)	Rc.No.AE/192/2022 dt.03.08.2022	50 Lakhs
Re-Construction of Sri Pydithallamma Amma vari Temple, Polipalli (v) Bhogapuram (M), Vizianagaram (Dist)	Rc.No.AE/181/2022 dt.10.08.2022	50Lakhs

further details **http://tender.apeprocurement.gov.in**
bid opening date **13.09.2022** closing date **27.09.2022**
Cell:9491000711
Sd/- D.V.V.Prasada Rao,
Assistant Commissioner & Executive officer

కంచరాం పాఠశాలకు జాతీయ గుర్తింపు

- అవార్డుకు ఎంపికైన విద్యార్థినుల సైన్స్ ప్రాజెక్ట్
- రోగనిరోధకశక్తి పెంపొందించే చిరుధాన్యాల పొడి' ప్రాజెక్టు ఆన్‌లైన్‌లో ప్రదర్శన
- రాష్ట్రం నుంచి ఎంపికైన ఒకే ఒక ప్రాజెక్టు



పాఠశాలలో ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థినులు

రాజాం సిటీ: తాము కూడా ఎందులోనూ తక్కువ కాదని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిరూపిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసంతో పాటు సైన్స్ ప్రాజెక్టులపై అవగాహన కల్పిస్తూ ఉపాధ్యాయులు కూడా తమను తాము రుజువు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు జాతీయస్థాయి అవార్డు తెచ్చిపెట్టడమే ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. కేంద్ర శాస్త్ర.సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన పరిషత్ (సీఎస్ఐఆర్) పాఠశాలల స్థాయిలో విద్యార్థుల వినూత్న ఆలోచనలతో కూడిన ప్రాజెక్టులను పరిశీలిస్తోంది. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు 14 ఆవిష్కరణ అవార్డులను అందజేస్తోంది. ఈ అవార్డులకు సంబంధించి ఈ నెల 1న ఆన్‌లైన్‌లో ప్రాజెక్టుల ప్రెజెంటేషన్‌కు ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పరిధిలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సైదాల లయ, పొట్నూరు ఝాన్సీలు ఘనత సాధించినట్లు గైడ్ టీచర్ పందూరి వేణుగోపాల్ సోమవారం తెలిపారు. కంచరాం విద్యార్థినులు అవార్డు కమిటీకి తాము తయారుచేసిన 'రోగనిరోధకశక్తిని పెంచే చిరుధాన్యాల పొడి' అనే ప్రాజెక్టును వివరించారు.

ప్రాజెక్టు వివరాలిలా..

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ రోగనిరోధకశక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన పోషకాలతోపాటు ప్రొటీన్లు, పీచు పదార్థాలు, కొవ్వులు చిరుధాన్యాలలో ఉన్నాయని కమిటీకి వివరించారు. ప్రతి ఇంట్లో చిరుధాన్యాల పొడిని తక్కువ ఖర్చుతో ఎలా తయారుచేయాలి, దానిని ఎలా వాడాలి, తద్వారా రోగనిరోధకశక్తిని ఏ విధంగా పెంపొందించుకోవచ్చో అవార్డు కమిటీకి విద్యార్థినులు క్షుణ్ణంగా వివరించారు.

14 ప్రాజెక్టుల్లో నాలుగవ స్థానం

మొత్తం జాతీయ స్థాయిలో 14 ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో రాష్ట్రం నుంచి కంచరాం ప్రాజెక్టు నాలుగో స్థానం సాధించిందని గైడ్ టీచర్ పేర్కొన్నారు. ఈ నెల చివరి వారంలో జరిగే కార్యక్రమంలో ప్రశంసాపత్రంతోపాటు రూ.20వేల నగదు బహుమతి కూడా సీఎస్ఐఆర్ నుంచి తమ విద్యార్థినులు అందుకోనున్నారన్నారు. విద్యార్థినులు జాతీయ అవార్డుకు ఎంపిక కావడంపట్ల ఎంఈఓ పి.నాగయ్య, హెచ్ఎం ఎంవీ సాయీశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

కలెక్టర్ స్పందనకు 188 వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 188 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలు 118 వచ్చాయి. మిగిలిన వాటిలో వైద్యశాఖకు చెందినవి 22, డీఆర్‌డీఏకి సంబంధించి 26 ఉన్నాయి. అలాగే మాన్యువల్‌గా 22 వినతులు అందాయి. వాటిలో సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. అర్జీలను కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, సబ్‌కలెక్టర్ సుదర్శనదొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

విజయనగరం క్రైమ్: చట్టపరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి వచ్చిన 37 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్పీ సీఐ జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ పాల్గొన్నారు.

ఆడిట్ సీఆర్‌పీల పరీక్షకు 263 మంది హాజరు

విజయనగరం అర్బన్: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ల లావాదేవీలు నిర్వహించడానికి సంబంధించి ఆడిట్ సీఆర్‌పీల భర్తీ కోసం స్థానిక టీటీడీసీ జిల్లా సమాఖ్య కార్యాయంలో సోమవారం నిర్వహించిన పరీక్షకు 268 మంది హాజరయ్యారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి ఆదేశాల మేరకు ఏపీడీ సావిత్రి పర్యవేక్షణలో జరిగిన ఎంపిక పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 27 మండలాల నుంచి వచ్చారు. వారిలో ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి మండలానికి 3 బృందాల చొప్పున ఆరుగురు సీఆర్‌పీలను పంపిస్తారు. ఈ సందర్భంగా ఏపీడీ సావిత్ర మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీల ప్రారంభం నుంచి 2021-22 వరకు జరిగిన లావాదేవీలను ఆడిటింగ్ చేసేందుకు ఆడిట్ సీఆర్‌పీలను ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం వారికి వైఎస్ఆర్‌కేపీ డీఆర్‌డీఏ ద్వారా అమలు చేయనున్న పథకాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎంపిక పరీక్ష నిర్వహణలో జిల్లా సమాఖ్య అధ్యక్షులు, డీపీఎంలు, ఏపీఎంలు, ఎస్‌సీ సీసీలు జిల్లా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆడిట్ సీఆర్‌పీల ఎంపిక పరీక్ష రాస్తున్న పొదుపు సంఘాల సభ్యులు

సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి ప్రజలనుంచి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించి వారిలో సంతృప్త స్థాయి పెంచాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, డీఆర్ఓ జె.వెంకటరావులు 109 వినతులను స్వీకరించారు. ఎక్కువగా భూసమస్యలు, సామాజిక పింఛన్లు మంజూరు, ఉపాధి కల్పించాలని వినతులు వచ్చాయి.

దివ్యాంగులకు ట్రైసైకిల్స్ మంజూరు

దివ్యాంగులైన మర్రాపు రామారావు, సిమ్మ చంటి, తాడంగి నిర్మలకు మూడు చక్రాల సైకిల్స్ మంజూరుచేయాలన్న జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్ అభ్యర్థన మేరకు కలెక్టర్ నిషాంత్ కుమార్ వారికి ట్రైసైకిల్స్ అందించారు. సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగులవద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుని వెంటనే స్పందించి మూడు చక్రాల సైకిల్స్ అందించారు. దివ్యాంగులు సుదూరం నుంచి జిల్లా కేంద్రానికి రాకుండా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అక్కడే ట్రైసైకిల్ అందించాలని జిల్లా మేనేజర్‌కు కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రభుత్వానికి దివ్యాంగులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం జరగాలి

పార్వతీపురం టౌన్: ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించి వారికి సత్వర న్యాయం అందేలా చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించి చట్టపరిధిలో చర్యలు చేపటిటట ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి విచారణ చేపట్టి ఏడు పనిదినాల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఎస్సై దినకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

పార్వతీపురం టౌన్: దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ పార్వతీపురం మన్యం జిల్లా సహాయ సంచాలకుడు ఎం. కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్‌పాస్‌ల మేళాను పార్వతీపురం ఆర్టీసీ డిపోలో ఈనెల 19వ తేదీన, సాలూరులో 20వ తేదీన, పాలకొండలో 21వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. రాయితీతో కూడిన బస్‌పాస్‌లను పొందేందుకు దరఖాస్తు, సదరం, ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ జిరాక్స్ ఉండాలని తెలిపారు. దరఖాస్తు కోసం రూ.100 చెల్లించాలని ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వలసకార్మికుడి మృతి

మక్కువ: మండలంలోని ఎస్. పెద్దవలస గ్రామ సమీపంలో ఫైబర్ కేబుల్ అమరుస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై వలస కార్మికుడు ఆదివారం మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామం సమీపంలోని విద్యుత్ స్తంభాలపై ఫైబర్ కేబుల్ వైరు అమరుస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లోకేశ్వర్ సింగ్(22) విద్యుత్ షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే తోటి వలస కార్మికులు శంబర పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మక్కువ పీహెచ్‌సీకి తీసుకురాగా అప్పటికే లోకేశ్వర్ సింగ్ మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



వేపాడ: సన్యాసి నాయుడు (ఫైల్)

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన పెనగంటి సన్యాసిరావు (58) సోమవారం పాముకాటుకు గురై మృతిచెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెనగంటి సన్యాసిరావు సోమవారం నల్లబిల్లి రెవెన్యూలో ఉన్న అనంచారి పొలంలో సాగుచేస్తున్న వరిపంటను చూడడానికి ఉదయం 10 గంటల సమయంలో వెళ్లాడు. అక్కడ పొలం గట్టుపై సన్యాసిరావును పాము కాటు వేయడంతో కేకలు వేయగా చుట్టుపక్కల రైతులు గ్రామానికి తీసుకొచ్చి కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు చేయడంతో వల్లంపూడి ఏఎస్సై పి.రామ్మూర్తి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	51,000-00
బంగారం(22సి. 10గ్రా.)	46,750-00
వెండి (కిలో)	60,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹ 274

చెరువులో శవమై తేలిన మూగబాలుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద తరిమి గ్రామంలో కనిపించకుండా పోయిన మూగ బాలుడి కథ విషాదాంతమైంది. గ్రామానికి చెందిన మాటలు రాని బాలుడు పిట్టా పవన్ కల్యాణ్(7) ఆదివారం మధ్యాహ్నం అదృశ్యమయ్యాడు. బయటకు ఆడుకోవడానికి వెళ్లిన కుమారుడు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు..కుటుంబ సభ్యులు గ్రామంలోను, సమీప గ్రామాల్లోనూ వెతికినా ఫలితం లేకపోయింది. బాలుడిని ఎవరో కిడ్నాప్ చేశారని తొలుత అంతా భావించారు. అదే రోజు రాత్రి 9గంటల వరకు చెరువులు, నేల బావుల్లో గ్రామస్తులు విస్తృత గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో బాలుడు పవన్ కల్యాణ్ శవమై తేలడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు.



చెరువులో లభ్యమైన బాలుడు పవన్‌కల్యాణ్ మృతదేహం

తల్లిచెంతకు చేరిన బాలుడు

విజయనగరం ఫోర్ట్: తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు చేరాడు. ఈనెల 10వతేదీన సాలురుకు చెందిన ఏడాది బాలుడు ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఏడుస్తుండగా ప్రయాణికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావుకు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు చైల్డ్‌లైన్ 1098 సంస్థ సభ్యులు బాలుడిని చైల్డ్‌లైన్ కార్యాలయానికి తీసుకువచ్చి తర్వాత బాలల సంక్షేమ కమిటీ ముందు ప్రవేశపెట్టారు. అనంతరం బాలుడిని కేఎల్‌పురంలో ఉన్న శిశు గృహాలో ఉంచాలని కమిటీ ఆదేశించిన మేరకు చైల్డ్‌లైన్ సభ్యులు శిశుగృహాలో బాలుడిని చేర్పించారు. విషయం తెలుసుకున్న బాలుడి తల్లి శిశుగృహకు సోమవారం రావడంతో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు బాలుడిని తల్లికి అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ హిమబిందు, సభ్యులు చిట్టిబాబు, భవాని, సుధారాణి, చైల్డ్‌లైన్ 1098 సంస్థ కోఆర్డినేటర్ మీనా తదితరులు పాల్గొన్నారు.



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న బాలల సంక్షేమ కమిటీ సభ్యులు

ఎట్టకేలకు విద్యార్థుల చదువుకు మోక్షం

- వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో తాత్కాలిక పాఠశాల ప్రారంభం



తాత్కాలిక పాఠశాల ప్రారంభానికి హాజరైన ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

మక్కువ: మక్కువ పంచాయతీలో ఉన్న ఆర్‌సీఎం పాఠశాల ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేయడంతో 2016లో ఆ పాఠశాల మూతబడింది. అంతవరకు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు కాలినడకన పక్కగ్రామాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లి, చదువులు సాగించాల్సి వస్తోంది. నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు చొరవ తీసుకుని గ్రామంలో 1,2 వతరగతుల విద్యార్థులకు తాత్కాలికంగా అయినా పాఠశాల ఏర్పాటుచేయాలని, ఉన్నతాధికారులకు నివేదించడంతో సోమవారం తాత్కలిక పాఠశాల భవనాన్ని విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. దీంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచే స్తున్నారు. మండలంలోని దబ్బగెడ్డ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక భవనాన్ని ఎంఈఓ వి.మల్లేశ్వర రావు సోమవారం ప్రారంభించారు. పక్కనే ఉన్న కోనయూపీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలిని డిప్యుటేషన్ పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేందుకు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల తిరుపతిరావు, పువ్వల పకీరునాయుడు, రౌతు హరిసాయికృష్ణ, కోన హెచ్ఎం పి.జయకుమార్, ఉపాధ్యాయులు శంబంగి ప్రభాకరరావు, మండల వెంకట్రావు, రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, సీఆర్‌పీ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం

- జగనన్న స్పోర్ట్స్‌క్లబ్ యాప్ ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు జగనన్న స్పోర్ట్స్ క్లబ్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ యాప్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న స్పోర్ట్స్ క్లబ్ యాప్ ద్వారా క్రీడాకారులు తమ సమాచారాన్ని అందించి క్లబ్‌లో చేరవచ్చన్నారు. యాప్ ద్వారా సమాచారం అందించడం వల్ల క్రీడాకారులకు ప్రభుత్వంనుంచి మరింత ప్రోత్సాహం అందించడానికి తోడ్పడుతుందన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి క్రీడాకారుడిలో ఉన్న నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు వివరించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి జగనన్న స్పోర్ట్స్‌క్లబ్ యాప్‌ను అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, సబ్ కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, డీఈఓ పి.బ్రహ్మాజీరావు, జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు డి.టి.గాంధీ, మురళీకృష్ణ, కోచ్‌లు పాల్గొన్నారు.



స్పోర్ట్స్‌క్లబ్ యాప్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్ తదితరులు

సాక్షి క్లాసిఫైడ్స్

SUPER DELUXE FLAT FOR SALE
1080 SFt, N/F, Car parking, Johnson Lift, 80Ft Road, @ CMR GREEN FIELDS, VZM. Ready to Move
Rs.35 LAKHS
Limited Offer, NO GST
Ph:8374618189 7997187989

EDUCATION
■ ఒకే సం.లో Reg./Distance 10th, Inter Degree, PG, B.Tech, Dip, Ag. B.Sc, MBA, MCA, ANM, GNM, BSc. Nursing, BAMS, BHMS. D/B Pharmacy. Lateral Entry Previous Date Adm. ✆ 72070 83477 [B-762753]

FLAT FOR SALE
■ 914 to 1528Sft. E/W Facing, Mini Gated Community, Good appreciation, Bank Loan facility, under Construction. Ph : 89789 81887, 92486 76799 [V-1142765]

PLOT FOR SALE
■ విజయనగరం నడిబొడ్డులో, భోగాపురం, జమ్మూ, ద్వారపూడిలలో UDA, RERA అప్రూవల్‌తో అందుబాటు ధరలలో హౌసింగ్ సైట్స్ కొరకు సంప్ర. స్వామి ప్రసాద్. ఫోన్ : 81792 00497 [V- 1436]
■ VMRDA Plots : విజయనగరం, జమ్ము వద్ద కాంపౌండ్ వాల్, డ్రైనేజ్, 40' B.T రోడ్స్, త్రీఫేస్ పవర్, చిల్డ్రన్ పార్క్, 100% వాస్తు & గ్రౌండ్ వాటర్ పూర్తి రెసిడెన్షియల్ ఏరియాలో అమ్మకానికి కలవు. ఫోన్ : 91431 43818 [V-1279]

SERVICES
■ హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి,వ్యక్తిగత,ఏ ప్రాపర్టీ అయి నా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సంప్ర: 9417654749. [T-1647]

జ్యోతిష్యాలయం
■ అష్టాదశ శక్తి పీఠాలను సందర్శించి పేరు ప్రసిద్ధి పొందిన దుర్గాప్రసాద్ సిద్ధాంతి గారు జ్యోతిష్యం, వాస్తు, వివాహ తారాబలం పొంతన కుజదోష, అన్ని విషయాలు చెప్పబడును. పరిష్కారం చూపబడును. బొబ్బిలి. సెల్: 9000518711 [K-1150985]

WANTED
■ ప్రముఖ ఛానల్ / న్యూస్ పేపర్ కు జిల్లాల వారీగా విలేకర్లు, స్టాఫ్ రిపోర్టర్లు, యాంకర్లు, ఆపరేటర్లు కావలెను. సంప్ర: 8332807053, 9063796001 [S-1217403]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి పార్ట్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 10,000- 15,000 వరకు సంపాదించే అవకాశం. ఫ్రీ బుక్‌లెట్ కొరకు. 83099 74722 [G-782013]
■ కనస్ట్రక్షన్ రంగం నందు అనుభవం కలిగిన డిప్లమో మరియు సివిల్ అర్హత గల అభ్యర్థులు వెంటనే కావలెను. ఫోన్ : 77802 60084 [V- 1437]
■ విజయనగరం లోని ఆఫీస్ నందు వర్క్ చేయుటకు రిసెప్షనిస్ట్, కం॥ ఆపరేటర్స్ టెలికాలర్స్, సూపర్‌వైజర్స్, ఆఫీస్ ఇంచార్జ్, కలెక్షన్ ఎగ్జి/మార్కెటింగ్, అర్జెంటుగా కావలెను. సంప్ర: విజయనగరము 7416567719 [W-783808]
■ 10th, ITI, డిప్లమో, డిగ్రీ, నర్సింగ్, క్లీనింగ్, ఇంటివని, సెక్యూరిటీ గార్డు జాబ్స్ RSR, ఓప్పో విమల్ షోరూమ్ పైన 3వ ఫ్లోర్ జగదాంబ థియేటర్-CMR రోడ్డు, వైజాగ్. ఫోన్ : 77029 59468 [V-319]
■ Hydలో 5 స్టార్ హోటల్స్‌లో ఫిలిమ్ ఫంక్షన్ హాల్స్ కు క్యాటరింగ్ బాయ్స్/గర్ల్స్/హెల్పర్స్, సె. గార్డ్స్, సూ.వైజర్స్ కావలెను. జీ: 21,000/- to 35,000/- రూం+భోజనం ఫ్రీ. 9505799387, 8897672587 [H-783684]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం: 13 -18 వేలు, సంప్ర: Ph: 9631767312 [HA-454]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

స్పందనకు నాలుగు వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించి స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి ఒకటి, ప్రజారోగ్యానికి సంబంధించి ఒకటి, నగర ప్రణాళిక విభాగానికి ఒకటి చొప్పున నాలుగు వినతులు వచ్చాయి. గతంలో అర్జీ చేసుకున్నవారు కూడా తమ సమస్య పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, ఏసీపీ అమ్మాజీరావు, ప్రజారోగ్యాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు



నాటికలో ఓ సన్నివేశం

విజయనగరం: విద్యార్థులలో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు లఘు నాటికలు దోహదం చేస్తాయని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డి. ఉమాబాలాజీ అన్నారు. కొత్తగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న యూత్ మంత్ ఉత్సవాలలో భాగంగా సోమవారం లఘు నాటిక పోటీలను నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉమాబాలాజీ మాట్లాడుతూ సమాజాన్ని రచనలు, నాటికలు, చలనచిత్రాలు ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పి.కృష్ణ, కె.సత్యప్రసాద్, సీహెచ్ వీరభద్రరావు, సూర్యలక్ష్మి, డాక్టర్ బి. రాధికారాణి, జి.వినోద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ జి. రామారావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనంతరం తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, బొడ్డు ఎల్లాజీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం నుంచి మండల స్థాయికి..



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి సచివాయంలో వేల్ఫేర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.అశోక్‌కుమార్ ఈ మధ్య జరిగిన ఏపీపీఎస్సీ పరీక్షల్లో పంచాయతీ రాజ్ జేఈగా ఎంపికయ్యాడు. నెల్లిమర్ల మండల జేఈగా ఎంపిక కావడంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అశోక్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు బంగారునాయుడు, వైకుంఠరావు, ఈఓపీఆర్డీ సురేష్, జేఈ చంద్రనాయుడు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుచికరంగా 'జగనన్న గోరుముద్ద'

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద రుచికరంగా అందించాలని ఎంపీడీఓ జి. గిరిబాల, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు ఎండీఎం నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలానికి చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, భోజనం తయారీలో వేయాల్సిన దినుసులను సమపాళ్లలో వేయాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే గుడ్లు, చిక్కీలు ప్రతి విద్యార్థికీ అందించాలని సూచించారు. మెనూ అమలు చేయకపోయినా, వంటలు రుచికంగా లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎండీఎం జిల్లా పర్యవేక్షకుడు డి. సత్యం పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా..

విజయనగరం ఉత్సవాలు

- అమ్మవారి పండగలో భాగంగా వచ్చే నెల 9 నుంచి 11 వరకు ఉత్సవాల నిర్వహణ
- జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో దిశానిర్దేశం చేసిన జెడ్పీ చైర్మన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: జిల్లా సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా విజయనగరం ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాలు అమ్మవారి జాతరను సంతృప్తికర స్థాయిలో జరిపించుకోలేక పోయామని.. ఈ ఏడాది అన్ని రకాల ప్రదర్శనలు, కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ అంగరంగ వైభవంగా పైడితల్లి జాతర కూడా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. అమ్మవారి పండగలో భాగంగా వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు విజయనగరం ఉత్సవాలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సూర్యకుమారి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిలతో కలిసి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ పలు అంశాలపై సూచనలు చేశారు. అమ్మవారి ఆలయ నుంచి ఆనందగజపతి ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. ర్యాలీలో భాగంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. ర్యాలీగా వెళ్లిన వారంతా ఆనందగజపతి ఆడిటోరియం మీదుగా సాగాలని, అనంతరం ఆడిటోరియంలో ఉత్సవాల ప్రారంభ సూచికంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యుల ప్రసంగాలతో అటు అమ్మవారి పండగ, ఇటు విజయనగరం ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సమావేశంలో మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన ప్రదర్శనలు, కార్యక్రమాలపై కమిటీ కీలక నిర్ణయాలను తీసుకుంది. తొలిరోజు ర్యాలీ జరిపించాలని ఆనందగజపతి ఆడిటోరియంలో సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత కళాశాల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని సంగీత కళాశాల నుంచి కళాకారులను రప్పించి పోటీలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది.

అయోధ్య మైదానంలో మ్యూజికల్ కార్యక్రమానికి సంబంధించి అలరింపజేసే ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. సినీతారల ప్రదర్శనలు, పులివేషాలు, ఫైర్ షోలు యథావిధిగా జరిపించాలన్నారు. ఆకర్షణీయ రీతిలో పూలు, పళ్ల ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర కప్ మేరుతో రాజీవ్ క్రీడా మైదానంలో కబడ్డీ, వాలీబాల్, షటిల్ పోటీలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. రాజమన్నార్ ఆలయంలో అవధానం, హరికథ, పద్య పఠనం, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు ఇప్పటి నుంచే ప్రారంభించాలని డీఆర్‌ఓకు కమిటీ సూచించింది. విభిన్న రంగాల్లో రాణిస్తున్న జిల్లా వాసులను సత్కరించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం..



లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

- సంక్షేమ పాలనపై హర్షాతిరేకాలు
- భోగాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. సంక్షేమ పథకాలే జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తాయని చెబుతున్నారు. మండల కేంద్రంలోని చిన్నవీధి, తోటవీధి, పెద హరిజనపేటలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అడగడుగునా హారతులిస్తూ, పూలు చల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. అర్హతలుండి పథకాలు అందకపోతే వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనటువంటి సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ప్రతి ఊరులో కొత్తగా జగనన్న కాలనీలు వెలుస్తున్నాయని, వాటి ద్వారా ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షలు విలువ చేసే ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, వైస్ ఎంపీపీలు దంతులూరి రావాబాబు, పడాల సత్యవతి, హౌసింగ్, మత్స్యశాఖ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, ఎం.నరసింహులు, కొమ్మూరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, ఊడికల అప్పయ్యమ్మ, సుందర హరీష్, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఈఓపీఆర్డీసురేష్, ఈఓ రామకృష్ణనాయుడు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలకూ తాగునీటి సౌకర్యం



పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల, నగర మేయర్

- మూడు డివిజన్‌లలో రూ.26.70 లక్షలతో పైప్‌లైన్ల ఏర్పాటు
- పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కోలగట్ల, నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: నగరంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించటమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు నగరంలోని 18, 20, 33 డివిజన్‌లలో రూ.9 లక్షలతో బుచ్చన్న కోనేరు వద్ద, రూ.9.20 లక్షలతో హుకుంపేట ప్రాంతంలో, రూ.8.50 లక్షలతో తోటపాలెం ప్రాంతాలలో నూతనంగా పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసే పనులను ఎమ్మెల్యే కోలగట్ల, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అయా డివిజన్‌ల కార్పొరేటర్లు సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా శాసన సభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఎన్నో ఏళ్లగా తాగునీటి కుళాయిలు లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్న ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, జీవీ రంగారావు మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు జి.ఈశ్వర్‌కౌశిక్ మాజీ వైస్ చైర్‌పర్సన్ లంక వరలక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు కనకల నాగవల్లి, మీసాల రమాదేవి, బాలి పైడిరాజు, కో ఆప్షన్ సభ్యురాలు పిల్లా పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల సూరిబాబు, భోగాపురపు రవిచంద్ర, దేశెట్టి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన..

నగరంలోని మయూరి జంక్షన్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు గల రైల్వేస్టేషన్ రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను ఎమ్మెల్యే కోలగట్ల, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు పరిశీలించారు. ఈ ప్రాంతంలో డివైడర్ ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఈ అప్పారావు పాల్గొన్నారు.

చేరికలు శుభపరిణామం

- ఎమ్మెల్యే కోలగట్ల
- వైఎస్సార్‌సీపీలోకి 20 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని సమర్థిస్తూ వైఎస్సార్‌సీపీలోకి చేరికలు పెరుగుతుండడం శుభపరిణామమని విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గుంకలాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కోసూరి సూరమ్మ, దుర్గమ్మ, లక్ష్మి, రాజాన జగదీశ్వరి, సత్తెరపు ఆదినారాయణ, కోసూరి శివకుమారి, ఎర్ర అచ్చయ్యతో పాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే కోలగట్ల తన స్వగృహంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, ఎమ్మెల్యే కోలగట్ల చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరారని చెప్పారు. ఎమ్మెల్యే కోలగట్ల నాయకత్వంలో అందరూ సమన్వయంతో పని చేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, సర్పంచ్ నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రిని మించిన తనయుడు జగనన్న

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

భోగాపురం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిబడ్డాడని.. అదే స్ఫూర్తితో ఆయన కుమారుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తూ తండ్రిని మించిపోయాడని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. కల్యాణమస్తు పథకాన్ని ప్రవేశపెట్టడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండడంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మండల కేంద్రంలో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘుబాబు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి,జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, రావాడ బాబు, రమేష్‌బాబు, కొమ్మూరు సుభోషణరావు, సర్పంచ్ అప్పయ్యమ్మ, పడాల శ్రీనివాసరావు, భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జీఓ సవరించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: కార్మికుల కనీస వేతనాల జీఓ సవరించాలని.. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అనంతరం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు బి. రమణ, ఎ. జగన్‌మోహన్, కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

భోగాపురం రూరల్: మండలంలోని చెరుకుపల్లిలో గత నెల 21న కొయ్య అప్పలనర్సమ్మ ఇల్లు కాలిపోయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులైన సంతోష్ బ్రదర్స్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను బాధితురాలికి సోమవారం అందజేశారు.

విజిలెన్స్ అధికారులమంటూ హడావిడి..

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కేఎల్‌పురంలో ఉన్న శిశుగృహానికి సోమవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చి విజిలెన్స్ అధికారులమంటూ హడావిడి చేశారు. ఎంతమంది పని చేస్తున్నారు.. సమయానికి వస్తున్నారా, లేదా.. గతంలో మేనేజర్‌గా ఎవరు పనిచేశారు.. ప్రస్తుత మేనేజర్ ఎవరంటూ ఆయాలను ప్రశ్నించారు. రికార్డులను చూపించాలని అడగ్గా.. మేనేజర్ అనుమతి లేకుండా ఇవ్వమని ఆయాలు చెప్పడంతో రేపు వస్తామంటూ వెళ్లి పోయారు. అయితే విజిలెన్స్ అధికారులను అడిగితే ఎవ్వరం శిశుగృహ తనిఖీకి వెళ్లలేదని చెప్పారు. మరి శిశుగృహకు తనిఖీ చేయడానికి వచ్చింది ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరావు

విజయనగరం రూరల్: మండలంలోని నారాయణపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) ఎంపీడీఓ గంటా వెంకటరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి, గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. అలాగే ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాలకు తరలించే చెత్తను వర్మీకంపోస్టు ఎరువుగా మార్చాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్:



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మణ్, శ్రీనివాస్

అగ్రికల్చర్ విద్యార్థులకు వ్యవసాయంపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కెల్ల లక్ష్మణ్ తెలిపారు. శ్రీకాకుళం నైరా కళాశాల విద్యార్థులు స్థానిక ఏరువాక కేంద్రంతో పాటు ఐదు మండలాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ, వివిధ పంటలకు ఆశించు తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే యాజమాన్య పద్ధతులను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నైరా కళాశాల అసోసియేట్ డీన్ డి. శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎ. ఉపేంద్ర, శాస్త్రవేత్తలు కె.తేజేశ్వరావు, స్వాతి, అమరజ్యోతి పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో ఉపాధిహామీ పనులపై మంగళవారం సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ అరుణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అన్ని పంచాయతీల్లో ఆడిట్ నిర్వహించామన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో అభ్యంతరాలున్న వేతనదారులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె సూచించారు.

భగవతీ నృత్య కళామందిర్ చిన్నారులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న భగవతీ నృత్య కళామందిర్ చిన్నారులు

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగ్‌రోడ్డులో ఉన్న భగవతీ నృత్యకళామందిర్ చిన్నారులకు తిరుపతికి చెందిన సాయి ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో పురస్కారాలు లభించాయని సంస్థ డైరెక్టర్ వడ్లమాని రమణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ, విశాఖలోని జల ఉద్యానవనం వేదికపై సాయి ఆర్ట్స్ ఇటీవల నిర్వహించిన పోటీల్లో అకాడమీ విద్యార్థులు దీక్షిత, ధైత్యస్నేహిత, మానస, వినీత, శ్వేత, దేవీ శ్రీప్రియాంక, సమన్విత, హారిక, తేజస్విని, దూర్తి శరణ్య, అవంతిక, మౌనిషా, జాహ్నవి రెడ్డి, వేదాన్షిత, యషీక, యోచన, సుస్మిత, యశస్విని, సోనూలు పలు కీర్తనలకు ప్రదర్శనలిచ్చారని చెప్పారు. అనంతరం ఏయూ ప్రొఫెసర్ శశికళ, అకాడమీ నిర్వాహకులు నవీన్ కుమార్, శరత్ చంద్రల చేతులమీదుగా పురస్కారాలు, ప్రశంసపత్రాలు, బహుమతులు అందుకున్నారని తెలిపారు. అదేవిధంగా తనకు నాట్యశిరోమణి పురస్కారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్‌బీకేల్లో వలంటీర్లు

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: రైతుభరోసా కేంద్రాల్లో వలంటీర్లు నిత్యం రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వలంటీర్లతో పాటు సచివాలయ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో నిర్మాణంలోనున్న సచివాలయ, రైతుభరోసా కేంద్రాల భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలను వెల్ఫేర్ అసిస్టెంట్లు నిత్యం తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే చిట్టి గురువులు కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, ఎంపీడీఓ జి. గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు, చిట్టి గురువులు మండల లిటరసీ అధికారి ఆల్తి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సాక్షరభారత్ వీసీలకు న్యాయం చేయండి



నిరసనలో వీసీఓలు

విజయనగరం అర్బన్: సాక్షర భారత్ గ్రామ సమన్వయకర్తలకు (వీసీఓ) తిరిగి ఉద్యోగాలిచ్చి న్యాయం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట వీసీఓలు నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పనిచేసిన వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, జిల్లా కార్యదర్శి పురం అప్పారావు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల కృష్ణ, వీసీఓల సంఘ నాయకులు ఆర్.పాండురంగనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన గ్రావెల్ రోడ్డు



అధ్వానంగా ఉన్న ఎస్సీ కాలనీ గ్రావెల్ రోడ్డు

భోగాపురం రూరల్: మండలంలోని కొత్తచెరుకుపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే గ్రావెల్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. ఎస్సీ కాలనీ మెట్టపై ఉండడంతో వర్షం నీరు మెట్టపై నుంచి కిందకు ప్రవహించడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. కాలనీ ఏర్పాటై సుమారు 20 సంవత్సరాలవుతున్నా.. ఇంతవరకు సరైన రహదారి నిర్మించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీకి సీసీ రోడ్డు వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

న్యాయమూర్తులను దూషించిన కేసులో ఏడుగురి అరెస్ట్



సాక్షి, అమరావతి : న్యాయమూర్తులను దూషించిన కేసులో వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన చొక్కా రవీంద్ర, కొత్తగూడేనికి చెందిన సొంటి రంగారావు, గుంటూరు జిల్లాకు చెందిన బత్తుల అశోక్‌రెడ్డి, తియ్యగురి సుమ అలియాస్ మాన్విత, నరసారావుపేట జొన్నలగడ్డకు చెందిన చందన ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రకాశం జిల్లాకు చెందిన గంజికుంట మల్లికార్జు రావు, రామాంజయులరెడ్డి ఉన్నారు. వీరిని సోమవారం విజయవాడలోని సీబీఐ కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది.

కౌన్సిలర్‌కు సీబీఐ నోటీసులు



మారుతిరెడ్డి ఇంటి వద్ద సీబీఐ అధికారులు

హిందూపురం : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ నమోదైన కేసులో విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన కౌన్సిలర్ మారుతిరెడ్డికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) అధికారులు సోమవారం నోటీసులిచ్చారు. బెంగళూరులోని సీబీఐ ఆఫీస్‌లో ఈ నెల 12న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈ నెల ఏడో తేదీన పోస్ట్ ద్వారా నోటీసులు పంపారు. అవి పదో తేదీన మారుతిరెడ్డికి చేరాయి. తగినంత సమయం లేకపోవడం వల్ల తాను హాజరుకాలేకపోతున్నట్టు ఆయన ఈ నెల 11న సీబీఐ అధికారులకు మెయిల్ పంపారు. 12వ తేదీన ఆయన హాజరుకాకపోవడంతో సీబీఐ అధికారులు సోమవారం నేరుగా హిందూపురంలోని కౌన్సిలర్ నివాసానికి చేరుకున్నారు. ఆయన నివాసంలో అందుబాటులో లేకపోవడంతో భార్య చేతికి నోటీసులిచ్చారు. మంగళవారం విజయవాడలోని కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచించారు.

3 నెలల్లో 15,032 మందికి ఉపాధి

ఏపీఎస్ఎస్‌డీసీ జాబ్ మేళాలకు విశేష స్పందన

- రూ.10వేల నుంచి రూ.40వేలు వేతనంతో ఉద్యోగాలు
- ఫ్లిప్‌కార్ట్, డైకిన్ వంటి ఎంఎన్‌సీల్లో ఉపాధి
- ఈ ఏడాది 45,000 మందికి ఉపాధి లక్ష్యం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలకు మంచి స్పందన వస్తోంది. ఈ జాబ్ మేళాల ద్వారా కేవలం మూడు నెలల్లోనే 15,032 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. కరోనా కారణంగా గత రెండేళ్లు ఆన్‌లైన్ జాబ్ మేళాలకు మాత్రమే పరిమితమైన ఏపీఎస్ఎస్‌డీసీ... ఇప్పుడు నేరుగా కళాశాలల్లోనే జాబ్ మేళాలను నిర్వహిస్తోంది. ఈ విద్యా సంవత్సరం జూన్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్ర వ్యాప్తంగా 142కు పైగా జబ్‌మేళాలను నిర్వహించగా, 37,879 మంది విద్యార్థులు హాజరైనట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ ఎస్.సత్యనారాయణ 'సాక్షి'కి తెలిపారు. ఈ జాబ్ మేళాల్లో 146కు పైగా ప్రఖ్యాత కంపెనీలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 15,032 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. వారికి అర్హతల ప్రకారం రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు నెలవారీ వేతనం ఇవ్వడానికి కంపెనీలు సిద్ధమయ్యాయని తెలిపారు. గత మూడు నెలల్లోనే ఫ్లిప్‌కార్ట్ ఏకంగా 2,000 మందికిపైగా విద్యార్థులను ఎంపిక చేసుకోగా, డైకిన్ వంటి పలు ఎలక్ట్రానిక్ కంపెనీలు, ప్రైవేట్ బ్యాంకులు, హాస్పిటల్స్ వంటి సంస్థలు అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం ముగిసేలోపు జాబ్ మేళాల ద్వారా 45,000 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు.

కంపెనీలకు అవసరమైన నిపుణుల కోసం స్కిల్ హబ్స్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏర్పాటైన కంపెనీల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలి. ఈ క్రమంలో కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించే విధంగా ఏపీఎస్ఎస్‌డీసీ చర్యలు చేపట్టిందని సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా ఈ స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తొలి దశలో 66 స్కిల్ హబ్స్‌ను సిద్ధం చేశామని, త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఏటా 42,000 మందికి శిక్షణ ఇచ్చే విధంగా ఈ స్కిల్ హబ్స్‌ను రూపొందించినట్లు చెప్పారు. శిక్షణ అనంతరం అదే కంపెనీలో ఉద్యోగం ఇచ్చే విధంగా పలు సంస్థలతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందాలు చేసుకుంటోంది.

సీఎంను కలిసిన మున్నూరు కాపులు

బీసీ–డీ కింద గుర్తింపు ఇచ్చినందుకు కృతజ్ఞతలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న నేతలు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌కు మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం జగన్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం విలీన మండలాల్లోని మున్నూరు కాపులకు బీసీ–డీ కింద గుర్తింపునిస్తూ ఉత్తర్వులిచ్చినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, మున్నూరు కాపు సంఘం ఎటపాక డివిజన్ ప్రెసిడెంట్ ఉమాశంకర్, నాయకులు వెంకటేశ్వరరావు, నాగేంద్ర, శివాజీ, నాగేశ్వరరావు, నాగ సూర్యనారాయణ, రాహుల్‌నాయుడు ఉన్నారు.

పవన్, చంద్రబాబుతో కాపులకు అన్యాయం..

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి మీడియాతో మాట్లాడుతూ.. కాపుల అభివృద్ధి కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కానీ చంద్రబాబు ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన పాలనలో కాపుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని దుయ్యబట్టారు. పవన్‌కల్యాణ్ కూడా చంద్రబాబు మార్గంలోనే నడుస్తూ.. కాపులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభాన్ని చంద్రబాబు వేధించిన విషయం తెలియదా? అని పవన్‌ను ప్రశ్నించారు.

మూడు రాజధానులు ప్రజలందరి అభీష్టం

- తగ్గేదే లేదు : మాజీ మంత్రి కన్నబాబు
- సీఎం జగన్ రాష్ట్ర ప్రజలందరి సంక్షేమం కోసం పని చేస్తున్నారు
- చంద్రబాబు రియల్ ఎస్టేట్ కోసమే పని చేస్తున్నారు
- చంద్రబాబు డైరెక్షన్‌లోనే అమరావతి టు అరసవల్లి పాదయాత్ర
- అమరావతిలో గొప్ప రాజధాని కడతానని బాబు నమ్మించారు
- రేణుకా చౌదరి ఏనాడైనా ప్రత్యేక హోదా గురించి మాట్లాడారా?
- ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ఆత్మగౌరవం ఉండదా?
- విశాఖలో రాజధాని వద్దనడానికి మీరెవరు?
- విశాఖ కన్నా పెద్ద నగరం మనకుందా?

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రజలందరి అభీష్టం మేరకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నారని, ఈ విషయంలో తగ్గేదే లేదని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్న బాబు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో 26



జిల్లాల్లోని ప్రజలందరి సంక్షేమం కోసం పని చేస్తున్నారని చెప్పారు. ఎవరు అడ్డుపడినా మూడు రాజధానులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. భవిష్యత్తును ఆలోచించి, చంద్రబాబులాంటి స్వార్థపరులకు ఎప్పటికీ రాష్ట్రం దక్కకూడదనే ఆశయంతో తమ నాయకుడు పని చేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతల పిల్లి శాపనార్థాలు పని చేయవని చెప్పారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు రాష్ట్రం కోసం కాకుండా రియల్ ఎస్టేట్ కోసమే పనిచేస్తున్నారని అన్నారు. కొందరు వ్యక్తులు, సంస్థల కోసమే పాట్లు పడుతున్నారన్నారు. నిపుణుల కమిటీ వద్దని చెప్పినా ఆయన అనుకున్న చోట అమరావతిలో ప్రపంచంలో గొప్ప రాజధాని కడతానని నమ్మించి, చివరికి ప్రజల చేతిలో ఘోర పరాభవం పొందారని తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో పెట్టిన పెట్టుబడులు పెరగక.. అమరావతిలో రాజధాని లేకుంటే రాష్ట్రం లేదన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే అమరావతి – అరసవల్లి పాదయాత్ర జరుగుతోందన్నారు. చంద్రబాబు రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం చేస్తున్న ఈ కార్యక్రమంతో ఇతర ప్రాంతాల ప్రయోజనాలను బలి పెడతామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సీపీఐ నారాయణ, సీపీఎం శ్రీనివాస్, బీజేపీ తరఫున పాతూరి నాగభూషణం కూడా అమరావతి గురించి మాట్లాడతారని, పక్క రాష్ట్రం నుంచి కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి కూడా వచ్చి సీఎం జగన్‌ని శాపనార్థాలు పెడతారని, సంస్కారం లేకుండా మాట్లాడతారని అన్నారు. రేణుకా చౌదరి ఏనాడైనా ప్రత్యేక హోదా గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ కోసం చేస్తున్న ఆందోళనలతో కోట్లాది మంది ఆత్మగౌరవం కోసం జరిగిన స్వాతంత్ర్య పోరాటానికి సంబంధం ఏమిటని అన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులే త్యాగమూర్తులా? పోలవరం, ఇరిగేషన్ ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన రైతులు త్యాగమూర్తులు కాదా? అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు ఎన్టీఆర్, ఆత్మగౌరవం అంటున్నారని, రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ఆత్మగౌరవం ఉండదా అని ప్రశ్నించారు. చంద్రబాబు డిక్షనరీలో దేశం అంటే తెలుగుదేశం, జాతిపిత అంటే చంద్రబాబు, భవిష్యత్తు అంటే లోకేశ్, సంక్షేమమంటే సొంత మనుషుల సంక్షేమం, రైతులంటే అమరావతిలో భూములు ఇచ్చిన రైతులు అని వ్యాఖ్యానించారు.

విశాఖ వద్దనడానికి మీరెవరు?

విశాఖలో రాజధాని ఉండకూడదని చెప్పడానికి మీరెవరని ప్రశ్నించారు. విశాఖకన్నా పెద్దనగరం మనకుందేమో చెప్పాలన్నారు. విశాఖపట్నంలో అన్ని సౌకర్యాలూ ఉన్నాయని తెలిపారు. సాంకేతిక సమస్యల వల్లే మూడు రాజధానుల విషయంలో జాప్యం జరిగిందని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ దేశం మధ్యలో ఉందా అన్ని ప్రశ్నించారు. కొన్ని రాష్ట్రాలకు రెండు రాజధానులున్నాయని తెలిపారు.

కోర్టుల్లో కేసు ఫైళ్లు మాయం అవడమా?

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా ధర్మాసనం విస్మయం
- కోర్టుల్లోనే ఈ పరిస్థితి ఉంటే అధికారులను ఎలా ప్రశ్నించగలం?
- విచారణ జరిపి పూర్తి వివరాలను మా ముందుంచండి
- గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : న్యాయస్థానాల్లోనే కేసుల ఫైళ్లు మాయం అవుతుండటంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. కోర్టుల్లోనే ఫైళ్లు మాయం అయ్యే పరిస్థితులు ఉన్నప్పుడు, తప్పు చేసే ప్రభుత్వాధికారులను తామెలా ప్రశ్నించగలమని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. నర్సరావుపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, గుంటూరు జిల్లా కోర్టులో ఓ కేసుకు సంబంధించిన ఫైల్ మాయం కావడంపై విచారణకు ఆదేశించింది. ఈ ఘటనపై విచారణ జరపాలని గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జిని ఆదేశించింది. బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసేలా చూడాలంది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రెండు కోర్టుల్లోనూ లేని కేసు ఫైల్

నర్సరావుపేటలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 1998 ఏప్రిల్ 6న ఓ కేసులో ఇచ్చిన తీర్పు సర్టిఫైడ్ కాపీని ఇవ్వాలంటూ వినుకొండకు చెందిన షేక్ లతీఫ్ సాహెబ్ దరఖాస్తు చేశారు. అయితే ఆ కేసు ఫైల్ తమ వద్ద లేదంటూ ఆ దరఖాస్తును కోర్టు సిబ్బంది తిరస్కరించారు. గుంటూరు జిల్లా కోర్టులోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. దీంతో లతీఫ్ సాహెబ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది కె.వెంకట రామారావు వాదనలు వినిపిస్తూ, నర్సరావుపేట కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఓ కేసులో తాము అడుగుతున్న సర్టిఫైడ్ కాపీ అవసరం చాలా ఉందన్నారు. ఎక్కడా ఆ ఫైల్ లేకపోవడంతో సర్టిఫైడ్ కాపీ ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఆ కాపీ లేకపోవడం వల్ల పిటిషనర్‌కు తీరని నష్టం కలుగుతుందని చెప్పారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం దీనిపై విచారణ జరపాలని గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జిని ఆదేశించింది.

అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌కి ఆత్మీయ అభినందన



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న 1990-91 డైట్ బ్యాచ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నాన్‌కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన కె.శ్రీనివాసరావుకు భీమిలి డైట్ (1990–91) బ్యాచ్ విద్యార్థులు అభినందనలు తెలిపారు. శ్రీనివాసరావు అక్కడ ఉపాధ్యాయ శిక్షణ తీసుకున్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర శిక్షకరణ సంఘం అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 1991 నుంచి వివిధ పోటీ పరీక్షలకు హాజరై గ్రూప్–1 పరీక్షల్లో ఉత్తీర్ణులై నేడు ఎస్పీగా పదోన్నతి పొందడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా డైట్ మిత్రులందరూ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రావు, సాయి సుజాత, పొట్నూరు శ్రీనివాసరావు, శాంతీశ్వరరావు, రామకృష్ణ, నాగేశ్వరరావు, విమ ల, ఉష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనల మేరకు ట్యాక్స్ చెల్లించండి'



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్

నరసన్నపేట: వ్యాపారం బాగా చేయండి, నిబంధనల మేరకు టాక్స్ చెల్లించండి అని జీఎస్టీ జాయింట్ కమిషనర్ కొత్తపల్లి రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. స్థానిక వ్యాపారులు, వ్యాట్ డీలర్లు, సబ్ డీలర్లతో మాట్లాడారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్ సకాలంలో చెల్లించాలని కోరారు. వ్యాపారాలు, లెక్కలు చట్టబద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, కాశీబుగ్గ సర్కిల్స్‌లో ఆదాయం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వ్యాపారులు సహకరించాలన్నారు. ట్యాక్స్ ఎవరూ బకాయి ఉండవద్దని సూచించారు. జిల్లాలో రైస్, బంగారం, జీడిపప్పు, కిరాణా, స్టీల్ వంటి వ్యాపారాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. వీటి నుంచి నిబంధనల మేరకు ట్యాక్స్ వసూలుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

స్మార్ట్ విలేజ్ పేరుతో టోపీ

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల మంది నుంచి రూ.300 కోట్లు వసూలు
- పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదులు.. సీఐడీకి కేసు అప్పగింత
- విశాఖ సీఐడీ కార్యాలయానికి సోమవారం వందలాది మంది బాధితుల రాక
- నిర్వాహకుడు సుధాకర్‌ను రిమాండ్‌కు పంపించిన సీఐడీ పోలీసులు
- డబ్బులు వసూలు చేసిన మధ్యవర్తులను కూడా అరెస్ట్ చేస్తాం : సీఐడీ డీఎస్పీ చక్రవర్తి



ఫిర్యాదు చేయడానికి బాధితులను బ్యాచ్‌లుగా లోపలకు పంపిస్తున్న సీఐడీ అధికారులు

ఆరిలోవ (విశాఖ తూర్పు):

నిరుద్యోగులకు స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్మార్ట్ విలేజ్ పేరుతో ఏర్పాటు చేసిన సంస్థ ద్వారా నిర్వాహకుడు టోకరా వేశాడు. కేంద్ర ప్రభుత్వంలో పర్మినెంట్ ఉద్యోగాలు అంటూ నిరుద్యోగుల నుంచి రూ.కోట్లలో వసూలు చేసి చేతులెత్తేశాడు. సంస్థలో ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకొన్నవారికి దొంగ నియామకపత్రాలు ఇచ్చి తేరుకోలేని జెల్ల కొట్టాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐడీ అధికారుల వరకు కేసు వెళ్లింది. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు సంస్థ నిర్వాహకుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకొన్న నిరుద్యోగ బాధితులు సోమవారం నగరంలోని ఆరిలోవ ప్రాంతం పైనాపిల్‌కాలనీ వద్ద గల సీఐడీ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. సీఐడీ అధికారులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...

ఐదేళ్లుగా వసూళ్ల పర్వం

అనకాపల్లికి చెందిన ఇండిపుడి సుధాకర్ 2018లో స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేశాడు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని గ్రామాల్లో సొసైటీ పేరుతో ఉద్యోగులను నియమిస్తున్నట్లు ప్రకటించడంతో నిరుద్యోగులు వేలాది మంది చేరారు. కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాలంటూ వారిని నమ్మించి ఉద్యోగం కేటగిరీ వారీగా డబ్బులు వసూలు చేశాడు. ఒక్కొక్కరి నుంచి పోస్టును బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.6 లక్షలు వరకు వసూలు చేశాడు. ఇలా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలకు చెందిన వేల మంది నుంచి రూ.వందల కోట్లు వసూలు చేశాడు. ఉద్యోగులుగా నియమించిన వారికి కొన్నాళ్లపాటు నెలకు రూ.19,200 నుంచి రూ.30 వేల వరకు వేతనాలు చెల్లించాడు. ఆ తర్వాత చేతులెత్తేశాడు. ఇంకా కొత్తగా ఉద్యోగాలు ఇస్తామంటూ అదే పద్ధతిలో గత ఏడాది నుంచి మధ్యవర్తులను నియమించి డబ్బులు వసూలు చేయించాడు. వారికి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో నాలుగు నెలలు క్రితం బాధితులు నిర్వాహకులను నిలదీశారు. దీంతో వారికి అనుమానం రాకుండా ఉండడానికి దొంగ నియామకపత్రాలు సృష్టించి ఇచ్చాడు. అవి నకిలీవని తేలడంతో మోసపోయామని తెలుసుకొన్న నిరుద్యోగులు పలు జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదులు చేశారు. వీరి ఫిర్యాదుల సంఖ్య పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. సీఐడీ పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు రంగు బయటపడింది.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ చక్రవర్తి, పక్కనే సీఐ బుచ్చిరాజు

బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

విశాఖ రీజియన్ సీఐడీ అధికారుల ఆదేశాలతో సీఐ బుచ్చిరాజు ఆదివారం సిబ్బందితో అనకాపల్లి, నర్సీపట్నంలో స్మార్ట్ విలేజ్ పేరుతో నిర్వహిస్తున్న కేంద్రాలపై దాడి చేశారు. అక్కడి రికార్డులు, కంప్యూటర్‌కు సంబంధించిన డేటా తీసుకొచ్చి నిర్వాహకుడు సుధాకర్‌ను అరెస్టు చేశారు. సోమవారం రిమాండ్‌కు తరలించారు. కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుల నుంచి సీఐడీ అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులను గ్రూపులుగా కార్యాలయం లోపలకు విడిచిపెట్టి వారితో ఫిర్యాదులు రాయించి తీసుకొన్నారు. ఎప్పుడు, ఎవరికి ఎంత మొత్తంలో డబ్బులు చెల్లించారో, ఎవరు మధ్యవర్తిత్వం వహించారో తదితర అంశాలను ఫిర్యాదులో రాయించారు.

సీఐడీ కార్యాలయం ముట్టడి


సుధాకర్‌ను సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకొన్న విషయం తెలుసుకొన్న నిరుద్యోగ బాధితులు విశాఖతోపాటు పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి తదితర జిల్లాల నుంచి సీఐడీ రీజియన్ కార్యాలయానికి చేరుకొన్నారు. వారంతా తమకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన సుధాకర్‌ను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. వారికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు సుధాకర్‌కు బీజేపీలో పలువురు నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సత్సంబంధాలున్నాయని, వాళ్ల ప్రోత్సాహంతో సుధాకర్ సంస్థలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా నియామకాలు చేస్తున్నామంటూ ఆశ చూపించి డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. తమకు న్యాయం చేసి తాము కట్టిన డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు.

అందరినీ అరెస్ట్ చేస్తాం

సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐడీ డీఎస్పీ చక్రవర్తి విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 7 వేల మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. సుధాకర్‌ను ఆదివారం అరెస్టు చేశామన్నారు. ఈ వ్యవహారానికి సంబంధం ఉన్నవారు అందరినీ అరెస్టు చేస్తామన్నారు. ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రతి ఒక్కరి నుంచి కేడర్‌ను బట్టి రూ.1.50 లక్షలు నుంచి రూ.6 లక్షలు వరకు వసూలు చేశారన్నారు. డబ్బులు వసూలు చేసిన వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే సీఐడీ సీఐ బుచ్చిరాజు సెల్ నంబరు 9441379913లో సంప్రదించాలన్నారు. సుధాకర్ 2018లో ఈ సంస్థ ఏర్పాటు చేసి వ్యవహారం నడుపుతున్నట్లు తెలిపారు.

టీడీపీ ప్రభుత్వంలో సంస్థ ఏర్పాటు

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే 2018లో స్మార్ట్ విలేజ్ పేరుతో సంస్థను ప్రారంభించారు. అప్పటి నుంచి సుధాకర్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు గేలం వేశారు. ఉద్యోగం కేటగిరీని బట్టి రూ.1.50 లక్షలు నుంచి రూ.6 లక్షల వరకు ఒక్కొక్కరి నుంచి వసూలు చేశారు. ఐదు, ఆరు నెలలపాటు రూ.19,200 నుంచి 30 వేలు వరకు కేటగిరీలను బట్టి వేతనాలు చెల్లించి చేతులెత్తేశాడు. పలువురు బీజేపీ నాయకులతో సత్సంబంధాలు ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కొందరు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా నిరుద్యోగులకు లెటర్లు ఇచ్చి ఈ సంస్థలో చేర్పించారు. వారి నుంచి డబ్బులు వసూలు చేశారు. బీజేపీలో పలువురు నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అండతో నిరుద్యోగుల నుంచి రూ.వందల కోట్లులో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **రూ.1.20 లక్షలు ఇచ్చాను**
>
> 
>
> నాకు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అందుకోసం నానుంచి రూ 1.20 లక్షలు తీసుకొన్నారు. నేను దఫదఫాలుగా ఆ డబ్బులను ఫోన్ పే చేశాను. నేను 2021లో ఉద్యోగంలో చేరాను. ఉద్యోగంలో చేరిన ఆరు నెలల వరకు జీతం ఇచ్చి ఆ తర్వాత నుంచి ఇవ్వడం మానేశారు. నాకు దొంగ నియామకపత్రం గ్రీన్ ఇంక్ సంతకంతో ఇచ్చారు.
>
> – వై.సుబ్బారావు, బాధితుడు, విజయనగరం

వర్క్‌షాపులతో సృజనాత్మక



మాట్లాడుతున్న డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ చెన్నై ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: వర్క్‌షాపుల నిర్వహణ ద్వారా విద్యార్థుల మేధో సంపత్తి పెంపొందించవచ్చని చెన్నైలోని భారత ప్రభుత్వం మేధోసంపత్తి సంస్థ డిప్యూటీ కంట్రోలర్స్ డి.ప్రసాదరావు, అజిత్, చరణ్ గౌడ అన్నారు. ప్రభుత్వ యాజమాన్య సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సెంటర్ ఫర్ అడ్వాన్స్ సైన్సెస్ (బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఓవర్‌ వ్యూ ఆఫ్ ఐపీఆర్ – కెపాసిటీ బిల్డింగ్ అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలు మాట్లాడుతు మేధో సంపత్తి హక్కులు అనేవి విద్యార్థుల సృజనాత్మకతని వెలికి తీస్తాయన్నారు. అంతే కాకుండా మేధోసంపత్తి హక్కులు సరిగా అర్థం చేసుకోవడం ద్వారా అన్ని స్థాయిల్లోని వారు వ్యవస్థాపకులుగా మారవచ్చన్నారు. నాన్ పేటెంటబుల్ ఇన్ సైన్సెస్, ఫైలింగ్ ఆఫ్ పేటెంట్స్, ఐపీఆర్ కేస్ స్టడీస్, పేటెంటబుల్ క్రైటీరియా తదితర అంశాలపై ప్రసాద్,అజిత్,చరణ్ వివరించారు. రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమం జరగడం ఇదే తొలిసారని ప్రిన్సిపాల్ సురేఖ గుర్తుచేశారు.

కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ హెచ్ లక్ష్మీపతి, ఎగ్జిక్యూటివ్ అధికారి ఎం.ప్రదీప్, డాక్టర్ హెచ్ హరిత, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ శాంతి దేవి, కామర్స్ అధ్యాపకులు ఈశ్వరరావు, పావని, చిన్నారావు, అరుణకుమారి, రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ దివస్ రేపు

శ్రీకాకుళం: జిల్లాలో 14న హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హిందీ మంచ్ ప్రధాన కార్యదర్శి కోనే శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2005 నుంచి హిందీ పక్షోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఏటా లాగానే ఈ ఏడాది కూడా 14 నుంచి 28 వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో హిందీ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 14న శ్రీకాకుళంలోని ఏపీఎన్ మున్సిపల్ హైస్కూల్‌లో పక్షోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పక్షోత్సవాల సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు హిందీ పోటీలు నిర్వహించి హిందీ భాషపై భయం పోగొట్టి, ఇష్టం పెంచుతామని వివరించారు.

కిచెన్ టిప్



కిచెన్‌లోని జిడ్డు పట్టి పోయిన స్టీలు డబ్బాల మీద టూత్ పొడర్ వేసి బట్టతో గట్టిగా తుడిస్తే చాలు. నీటితో పనిలేకుండా జిడ్డు ఇట్టే తొలగి పోయి డబ్బాలు శుభ్రంగా మెరుస్తాయి..

బ్యూటిప్



వర్షాకాలంలో సైతం కొంతమంది చర్మం తేమ లేక పొడిబారడమే గాక, మొటిమలతో విసిగిస్తుం టుంది. ఇటువంటి చర్మా నికి తేనె, వేప, పాలతో తయారైన ఫేస్‌ప్యాక్ మంచి పరిష్కారం చూపు తుంది. వేప, మొటిమ లను తగ్గిస్తే, తేనె చర్మా నికి తేమనిస్తుంది.

● రెండు టేబుల్ స్పూన్ల వేపాకు పేస్టులో టేబుల్ స్పూను తేనె, ఒకటిన్నర టేబుల్ స్పూన్ల పచ్చి పాలు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఆరాక గోరు వెచ్చని నీటితో కడిగే యాలి. వారంలో మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకో వడం వల్ల మొటిమలు పోయి ముఖం ఫ్రెష్‌గా కనిపి స్తుంది.





శ్వేతా దేశ్‌ముఖ్

సందర్భం

నిలువెత్తు గెలుపు సంతకం

'మర్యాద, సభ్యత, క్రమశిక్షణ అనేవి మనిషిని తీర్చిదిద్ది ఉత్తములుగా తయారుచేస్తాయి' అనేది మంచిమాట. ఈ మాటకు తన వంతుగా మరో మాట చేర్చాడు ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ లారీ బేకర్...

'మర్యాద, సభ్యత, క్రమశిక్షణ అనేవి అత్యుత్తమ నిర్మాణాలకు కారణం అవుతాయి'

ఆర్కిటెక్ట్‌గా దేశవిదేశాల్లో రాణిస్తున్న శ్వేతా దేశ్‌ముఖ్ లారీ బేకర్ చెప్పిన ప్రతి మాటను అక్షరాలా ఆచరించే ప్రయత్నం చేస్తోంది.

తాజాగా ది ఇండియన్ అలర్ట్ 'టాప్ టెన్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్-2022' జాబితాలో చోటు సంపాదించిన శ్వేతాదేశ్‌ముఖ్ గురించి...

ముంబైకి చెందిన శ్వేతాదేశ్‌ముఖ్‌కు చిన్నప్పటి నుంచి స్కెచ్చింగ్, పెయింటింగ్ అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనను ఆర్కిటెక్చర్ వైపు తీసుకువచ్చింది. నాగ్‌పూర్‌లో బీ.ఆర్క్, పుణెలో కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసింది. ఆ తరువాత సొంతంగా ప్రాక్టీస్ మొదలు పెట్టింది.

ఉద్యోగంలో చేరితే ఎలా ఉండేదో తెలియదుగానీ, సొంతంగా ప్రాక్టిస్ చేయడం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది. వివాహం తరువాత ముంబైలోని ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సీనియర్ ఆర్కిటెక్ట్‌గా పనిచేసిన శ్వేత ఆ తరువాత 'డిజైన్‌బాక్స్' పేరుతో ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్ కంపెనీ మొదలుపెట్టింది.'డబ్బులు ఎక్కువ వచ్చినా సరే, తక్కువ క్రియేటివిటీ ఉండే ప్రాజెక్ట్‌లకు దూరంగా ఉండాలి' అనే నిబంధన విధించుకుంది.

క్లయింట్స్ నుంచి సైట్ ఫోటోలు, వీడియోలు, డ్రాయింగ్స్ తీసుకోవడమే కాదు డిజైన్ ప్రాసెస్‌లో కూడా వారిని భాగం చేస్తుంది. కలర్ కన్సల్టింగ్, ఫర్నిచర్ డిజైనింగ్, వాల్ డెకర్, లైటింగ్ ఐడియాస్... ఇలా ఎన్నో విషయాలలో ఎంతోమంది క్లయింట్స్‌కు సేవలు అందించిన 'డిజైన్‌బాక్స్' మోస్ట్ ఇన్నోవేటివ్ ఫర్మ్ అవార్డ్ గెలుచుకుంది.

తన ఫేవరెట్ ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే ఇరవై అయిదు ఎకరాల పరిధిలోని భీమాశంకర్ హిల్స్(కర్జత్, మహారాష్ట్ర), పుదుచ్చేరిలోని మలీప్లెక్స్,గ్రీన్‌హౌజ్, చెంబూర్‌లోని ఏడు ఎకరాల కమర్షియల్ ఇంటీరియర్... ఇలా ఎన్నో ఉన్నాయి.

'నాకంటూ ప్రత్యేకమైన స్టైల్ లేదు. క్లయింట్స్ అభిరుచి, అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేస్తాను' అంటున్న శ్వేత నిర్మాణ ప్రక్రియలో పర్యావరణ కోణానికి ప్రాధాన్యత ఇస్తుంది. ఉదా: స్క్రాప్ మెటీరియల్‌ను రీసైకిలింగ్ కంపెనీలకు తరలించడం, వర్షపునీటి నిల్వ, స్థానిక వనరులను సమర్థవంతంగా వాడుకోవడం... మొదలైనవి.

'నా డిజైనింగ్‌కు ప్రకృతే స్ఫూర్తి ఇస్తుంది' అని చెబుతున్న శ్వేత బాగా అభిమానించే ఆర్కిటెక్ట్ లారీ బేకర్. బ్రిటన్‌లో పుట్టిన బేకర్ ఇండియాకు వచ్చి నిర్మాణరంగంలో అనేక ప్రయోగాలు చేసి 'లెజెండ్' అనిపించుకున్నాడు. సామాన్యుల ఆర్కిటెక్ట్‌గా పేరు తెచ్చుకున్నాడు.

'ఇతర ఆర్కిటెక్ట్‌ల నుంచి స్ఫూర్తి పొందడం కంటే సామాన్యులు సృష్టించిన వాటిలో నుంచే ఎక్కువగా స్ఫూర్తి పొందుతాను' అనే లారీ బేకర్ మాట తనకు ఇష్టమైనది. ఆయన చెప్పిన 'లోకల్ విజ్‌డమ్'ను అనుసరిస్తుంది.

'ఒక డిజైన్ చేసే ముందు ఆ పరిసరాలకు సంబంధించిన విషయాలపై అవగాహన పెంచుకోవాలి' అని లారీ చెప్పిన మాటను ఆచరణలో చూపుతుంది శ్వేత.

గౌతమ్ భాటియా రాసిన 'లారీ బేకర్: లైఫ్, వర్క్ అండ్ రైటింగ్' పుస్తకం అంటే ఇష్టం.

'ప్రతి వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. అయితే ప్రతి సవాలు మన విజయానికి ఒక మెట్టులా ఉపయోగపడుతుంది. మొదట్లో మాకు కూడా రకరకాల సందేహాలు, సవాళ్లు ఎదురయ్యాయి. ఇలా స్టార్ట్ చేశాం. ఇలాగే ఉంటాం... అన్నట్లు కాకుండా ఎప్పటికప్పుడు మా ప్రణాళికలో మార్పు చేసుకుంటూ వచ్చాం' అంటుంది శ్వేతాదేశ్‌ముఖ్.

చదువుకునే రోజుల్లో, వృత్తిలోకి వచ్చిన తొలి రోజుల్లో మూర్ఛవ్యాధి సమస్యతో సతమతమయ్యేది శ్వేత. అలా అని ఎప్పుడూ ఆగిపోలేదు. ఇంటికి పరిమితం కాలేదు. పనిలో దొరికే ఉత్సాహాన్నే ఔషధంగా చేసుకొని ముందుకు కదులుతుంది.

ఖాండ్వా టీన్ హీరో



● ఫాజియా

చిన్నారులందరిలానే ఫాజియా కూడా ఉండి ఉంటే ఈ రోజు ఆమె గురించి ఇక్కడ చదివే వాళ్లం కాదేమో. వచ్చీరాని మాటలేగాక, సైగల భాషను తప్పటడుగులు వేసే వయసు నుంచే నేర్చుకుందామె. ఎనిమిదేళ్లు వచ్చేనాటికి చెవిటి, మూగ వాళ్ల సైగల భాషను అవపోసనపట్టి ఎంతోమందికి అండగా నిలుస్తూ... 'ఖాండ్వా టీన్ హీరో'గా గుర్తింపు తెచ్చుకుంది ఫాజియా.

మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాకు చెందిన ఫారుఖ్, ఫాతిమా మొహమ్మద్ దంపతుల కూతురే ఫాజియా. తల్లిదండ్రులు మూగ, చెవిటి వారు కావడంతో ఫాజియాతో మాట్లాడడం, లాలించడం దగ్గరనుంచి అంతా సైగలతోనే. బుడిబుడి అడుగులు వేసేటప్పుడే ఫాజియా సైగల భాషను అవపోసన పట్టేసింది. తల్లిదండ్రులేగాక, ఇతర మూగ, చెవిటి వ్యక్తులు ఏం చెబుతున్నారో ఇట్టే తెలుసుకుని తిరిగి సైగలతో సమాధానం చెప్పేది. ఈ విషయం ఆ నోటా ఈ నోటా ప్రభుత్వ అధికారులతో తెలియడంతో... మూగ, చెవిటి వాళ్ల సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటి పరిష్కారానికి ఫాజియాను సాయం చేయమని అడిగారు. దీంతో ఎనిమిదేళ్ల వయసు నుంచి ఫాజియా స్థానికంగా ఉన్న చెవిటి–మూగ వాళ్లు ప్రభుత్వ అధికారులకు ఏం చెబుతున్నారు... వారి సమస్యలేమిటో తెలుసుకుని వాటిని అధికారులకు వివరించడంతో ఈ సమస్యతో బాధపడుతున్న వందలమంది సమస్యలకు ఫాజియా వల్ల పరిష్కారం దొరికినట్లయింది.



● తల్లిదండ్రులతో ఫాజియా

కేసు పెట్టి... అది 2017... ఓరోజు బుర్హాన్‌పూర్ స్కూల్లో చెవిటి పిల్లల పట్ల అక్కడి టీచర్లు అమానుషంగా ప్రవర్తిస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఫాజియా...ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్ని హింసిస్తున్న ఆ స్కూలుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం కోర్టు వరకు వెళ్లి పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారికి శిక్ష పడేలా చేసింది. అప్పట్లో ఈవిషయం ఖాండ్వా వ్యాప్తంగా పాపులర్ అయ్యింది. అప్పటినుంచి చెవిటి, మూగ వాళ్లు ఏం సాయం కావాలన్నా ఫాజియాను సంప్రదించడం మొదలు పెట్టారు. అలా మొదలైన ఫాజియా సాయం నేటికి కొనసాగుతూనే ఉంది.

దరఖాస్తులు నింపడం నుంచి... బ్యాంక్‌లు, కోర్టులు, పోలీస్ స్టేషన్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో తమ పనులు పూర్తిచేసుకునేందుకు మూగ–చెవిటివారు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుంటున్న ఫాజియా.. బ్యాంక్ దరఖాస్తులు నింపడం, ఆధార్ సంబంధిత పనులు, దాడులకు గురైన వారి బాధను పోలీసులకు వివరించడం, కోర్టులో మూగ, చెవిటి వాళ్ల సాక్ష్యాలను వివరించడం వంటివి చేస్తోంది. అన్యాయానికి గురైన వారికి న్యాయం జరిగే వరకు వారి తరఫున నిలబడి పోరాడుతోంది. ఇంత చిన్నవయసులోనే అధికారులతో ధైర్యంగా మాట్లాడుతూ అందరి మన్ననలను పొందుతూ టీన్ హీరోగా పేరుని నిలబెట్టుకుంటోంది ఫాజియా.

సాగుబడి
ఉత్తర కార్తె : సెప్టెంబర్ 13 నుంచి



అధిక వర్షాల్లో కూరగాయ, పండ్ల తోటల సంరక్షణ ఎలా?

● అతివృష్టి నష్టనివారణ చర్యలపై డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సూచనలు



ఎడతెగని వర్షాలు, అధిక వర్షపాతం కారణంగా ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన నష్ట నివారణ చర్యలపై డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ నిపుణులు పండ్లు, కూరగాయ తోటల సాగుదారులకు ప్రత్యేక జాగ్రత్తలు సూచిస్తున్నారు. వివిధ పండ్లు, కూరగాయ, తోట పంటల్లో పాటించవలసిన మెళకువలను ప్రధాన/సీనియర్ శాస్త్రవేత్తలు డా. కె.టి. వెంకటరమణ, డా. ఎం. రవీంద్రబాబు, డా. ఆర్.నాగరాజు, డా. డి.వి.కె. భగవాన్ రైతులకు సూచిస్తున్నారు. ఉపకులపతి డా. టి. జానకిరామ్, విస్తరణ సంచాలకులు డా. బి. శ్రీనివాసులు, పరిశోధనా సంచాలకులు డా. ఎల్. నారం నాయుడు ఈ సూచనలను పత్రికలకు విడుదల చేశారు.

అధిక వర్షాలప్పుడు సాధారణంగా ఉద్యాన తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. చేలల్లో అధికంగా ఉన్న నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలి. పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ డోస్ ఎరువులను వేసుకోవాలి. అధిక తేమ వల్ల ఉధృతి పెరిగే అవకాశం గల తెగుళ్ళు, పురుగుల నివారణ చర్యలు చేపట్టాలి. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తీసివేసి కొత్త మొక్కలను నాటుకోవాలి. వర్షాలు తగ్గగానే వీలైనంత త్వరగా చెట్ల మధ్య దున్నటం వలన తేమ త్వరగా ఆరి చెట్లు కోలుకుంటాయి. అధిక గాలులకు వేర్లతో సహా ఒరిగిన చెట్లను లేపి నిలబెట్టి, మట్టిని ఎగదోసి ఊతమివ్వాలి.

అధిక వర్షాల్లో కూరగాయ పంటల సంరక్షణ

కూరగాయ తోటల్లో నీటి ముంపు సమయంలో హార్మోన్ల పిచికారీ ద్వారా పంటలను కాపాడుకోవచ్చు. జీఏ3, బీఏపీ పిచికారీ చేసుకొని నీటి ముంపు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఎన్.ఎ.ఎ. (40 పీపీఎం)ను పిచికారీ చేసుకొని పూత, పిందె రాలటం అరికట్టవచ్చు. నేలలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు సాలిసిక్ యాసిడ్ (100 పిపిఎం)ను పిచికారీ చేసుకుని మొక్కలో నిల్వ ఉన్న పోషకాల వినియోగాన్ని పెంపొందించవచ్చు. బ్రసినొలైడ్ (0.5 పిపిఎం)ను పిచికారీ చేసుకొని కిరణజన్య సంయోగ క్రియను పెంపొందించవచ్చు.

అధిక వర్షాల ప్రభావం వల్ల టమాటో మొక్కల ఎదుగుదల తగ్గుతుంది, పూత రాలటం, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు సోకే అవకాశం ఉంది. వంగ తోటల్లో ఆకులు పసుపుబారటం, పూత రాలటం, అక్షింతల పురుగు, బాక్టీరియా మచ్చ తెగులు రావచ్చు. మిరపలో నారు కుళ్ళు, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు, కొయనోఫోరా తెగులు సోకవచ్చు.

తీగజాతి కూరగాయ తోటలకు ఆకులు పసుపుబారి, బూజు తెగులు సోకవచ్చు. ఆకుకూర తోటల్లో ఆకు తినే పురుగు, ఆకుమచ్చ తెగులు ఇబ్బంది పెట్టవచ్చు. దుంప జాతి కూరగాయ మొక్కలకు అధిక శాఖీయోత్పత్తితో పాటు దుంప కుళ్ళు రావచ్చు. కూరగాయ తోటల్లో నిలచిన నీటిని బయటకు పంపివేయాలి. బోదెలపై లేదా ఎత్తు మడులపై మొక్కలు నాటుకుంటే అతి వృష్టి, అనావృష్టులను తట్టుకునే శక్తి పెరుగుతుంది.

వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలి

అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలను కూడా పిచికారీ చేసుకోవాలి. నేల కొంచెం ఆరిన తరువాత రసాయనిక ఎరువులను నేలలో వేసుకోవాలి. అధిక వర్షాలకు విత్తనం మొలకెత్తనప్పుడు లేదా లేత మొక్కలు దెబ్బ తిన్నప్పుడు నర్సరీలో నారు పెంచుకొని సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేలలో అధిక తేమను త్వరగా ఆరబెట్టుకోవాలి. మొక్కలకు ఊతం ఇవ్వటం, పందిళ్లపై తీగ జాతి కూరగాయలను సాగు చేసుకోవటం మేలు.

కూరగాయ తోటల్లో సస్యరక్షణ

కూరగాయ పంటలన్నిటిలోనూ ఆకు తినే పొగాకు లద్దెపురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి. వంగ, కాకర, ఆగాకర తోటల్లో అక్షింతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిపైరిఫాస్‌ను లీటరు నీటికి 2 మి.లీ. లేదా థయోడికార్బ్‌ను లీటరు నీటికి 1 గ్రా. మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

మిరప, టమాటో, క్యాబేజి తదితర పంటల్లో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను 3 గ్రా./లీ. లేదా మెటాలాక్సిల్+ మంకోజెబ్‌ను 2 గ్రా./లీ. మోతాదులో మొక్కల మొదళ్లలో పోసుకోవాలి.

మిరప, టమాటో, చిక్కుడు, ఆకుకూర తోటల్లో ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజిం‌ను 1 గ్రా./లీ. లేదా మంకోజెబ్‌ను 2.5 గ్రా./లీ. ను పిచికారీ చేసుకోవాలి. బీర, కాకర, దోస, పొట్ల, సొర తోటల్లో బూజు తెగులు నివారణకు డైమిథోమార్ఫ్‌ను 1.5 గ్రా./లీ. లేదా మెట్టలాక్సిల్+ మంకోజెబ్‌లను 2.0 గ్రా./లీ. మోతాదులో పిచికారీ చేసుకోవాలి. టమాటో, వంగ, కాప్సికం తోటల్లో బాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా./లీ, + ప్లాంటామైసిన్‌ను 0.2 గ్రా./లీ, కలిపి పిచికారీ చేసుకోవాలి.

అరటి, బొప్పాయి తోటల సంరక్షణ

3 నెలల వయసు కన్నా తక్కువ వయసున్న అరటి మొక్కలు 3 అడుగుల లోతు నీటిలో మునిగిపోతే నేల ఆరిన వంటనే మళ్లీ కొత్త పిలకలను నాటుకోవాలి. గొర్రుతో అంతర సేద్యం చేసి మొక్కకు 100 గ్రా. యూరియా, 80 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను 2-3 సార్లు 20-25 రోజుల కాల వ్యవధిలో వేయాలి. ఆకులు, గెలలపై పొటాషియం నైట్రేట్ (13-0-45(మల్టి-కె)) 5గ్రా. /లీటరు నీటికి చొప్పున వారం రోజుల వ్యవధిలో 3 నుంచి 4 సార్లు పిచికారీ చేయాలి. సగం తయారైన గెల (75% లోపు పక్వానికి వచ్చిన గెల) లను ఎండిన అరటి ఆకులతో కప్పి వుంచి 15 రోజుల లోపు కోసి అమ్ముకోవాలి. వెదురు బొంగులతో ఊతమిచ్చి మొక్కలు పడిపోకుండా చూసుకోవాలి. దుంపకుళ్ళు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./ లీటరు నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం 1 శాతం మొక్క చుట్టూ తడిచేటట్లుగా నేలలో పోయాలి. సిగటోక ఆకుమచ్చ తెగులును అరికట్టడానికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా./లీ. నీటికి కలిపి (1-2 సార్లు వారం రోజుల వ్యవధిలో) పిచికారీ చేయాలి.

కొబ్బరిలో అంతర పంటల సంరక్షణ

అధిక వర్షాలకు నీట మునిగిన కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగువుతున్న అరటి, బొప్పాయి పంటలను జాగ్రత్తలు పాటించి సంరక్షించుకోవచ్చు. నాలుగు రోజుల కంటే ఎక్కువ రోజులు నీటిలో మునిగిన మొక్కలు బతకటం కష్టం. రెండు రోజులుగా నీటిలో మునిగితే అధిక నీటిని బయటకు పంపి నేలలో అధిక తేమ తగ్గేలా చేయాలి. మొక్కలు 3 అడుగుల లోతులో మునిగిపోతే ఏం చేయాలి? 3 నెలల వయసు కన్నా తక్కువ వయసు ఉన్న మొక్కలు 3 అడుగుల లోత నీటిలో మునిగిపోతే, నేల ఆరిన వెంటనే మళ్లీ మొక్కలను నాటుకోవాలి.

గొర్రుతో అంతర సేద్యం చేసి మొక్కకు 100 గ్రా. యూరియా, 80 గ్రా. పొటాష్‌ను మొక్కకు 2-3 సార్లు 20-25 రోజుల కాల వ్యవధిలో వేయాలి. ఆకులు, గెలలపై 0.5% పొటాషియం నైట్రేట్ (13-0-45)ను వారం రోజుల వ్యవధిలో 3 నుంచి 4 సార్లు పిచికారీ చేయాలి. తయారైన అరటి గెలల(75% పక్వానికి వచ్చిన గెలల)ను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి 15 రోజులలోపు కోయాలి. వెదురు బొంగులతో ఊతమిచ్చి, మొక్కలు పడిపోకుండా చేసుకోవాలి. అరటి దుంపలు కుళ్లిపోకుండా నివారించడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా./లీ. నీటికి కలిపి దుంప తడిచేలా నేలలో పోయాలి. ఆకుమచ్చ తెగులును అరికట్టడానికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి (1-2 సార్లు వారం రోజుల వ్యవధిలో) పిచికారీ చేయాలి. బొప్పాయిలో కాండం కుళ్లు తెగులు (కాలర్ రాట్)ను నివారించడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా. /లీ. మోతాదులో నీటికి కలిపిన ద్రావణాన్ని కాండం మొదలు తడిచేలా పిచికారీ చేసుకోవాలి. సూక్ష్మ ధాతు లోపాలను నివారించడానికి ఐరన్, మెగ్నీషియం, జింక్, బోరాన్, మాంగనీస్‌లను బొప్పాయి చెట్లపై పిచికారీ చేసుకోవటం ద్వారా పంటను కాపాడుకోవచ్చు.

డా.వైఎస్సార్ విశ్వవిద్యాలయానికి 73826 33667, 98497 33741 నంబర్లకు ఫోన్ చేసి రైతులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

100 రకాల డ్రాగన్ రైతు!



● వండర్ బాయ్ జేకే 2



● జేకే1 పలోరా 2



● జోసెఫ్



● రెడ్ చిల్లీ

డ్రాగన్ ఫ్రూట్ పుష్కలంగా పోషకాలు కలిగి ఉండే పండు. అంతేకాదు, ఖరీదైనది కూడా. ఈ రెండు లక్షణాలూ 72 ఏళ్ల వృద్ధుడు జోసెఫ్‌ను రైతుగా మార్చేశాయి. కేరళకు చెందిన అమెరికా వెళ్లినప్పుడు తియ్యని డ్రాగన్ ఫ్రూట్ రుచి చూసి పరవశుడయ్యారు. ఏడేళ్ల క్రితం ఆ పండును ఏడు డాలర్లకు కొన్నారాయన. ఆ రుచి, కళ్లు చెదిరే ధర ఆయనను డ్రాగన్ రైతుగా మార్చేసింది. హైదరాబాద్‌లో మెషిన్ టూల్ ఇండస్ట్రీ నిర్వహించి విరామ జీవనం గడుపుతున్న జోసెఫ్.. తన స్వస్థలం కొట్టాయం దగ్గర్లోని చెంగనస్సెరీకి తిరిగి వెళ్లి స్థిరపడ్డారు. అమెరికా నుంచి తిరిగి వచ్చాక దేశ విదేశాల నుంచి డ్రాగన్ మొక్కల్ని సేకరించటం మొదలు పెట్టారు. ఈక్వెడార్, తైవాన్, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల నుంచి డ్రాగన్ మొక్కల్ని తెప్పించి ఇంటి పెరట్లోని 65 సెంట్ల స్థలంలో నాటారు. ఇప్పటికి దాదాపు 100 రకాలు సేకరించారు. అందులో కొన్ని మాత్రమే రుచిగా ఉంటాయంటారు జోసెఫ్. కొన్ని రకాల పండు లోపలి గుజ్జు తెల్లగా ఉంటే, మరికొన్నిటికి ఎర్రగా, పసుపు పచ్చగానూ ఉంటాయి. డ్రాగన్ జీవవైవిధ్యంతో ఆయన పెరటి తోట కళకళలాడుతూ ఉంటుంది. తనకు నచ్చిన రకాలను సంకరం చేసి 10 కొత్త డ్రాగన్ వంగడాలను రూపొందించే పనిలో ఆయన బిజీగా ఉన్నారు. వీటిల్లో జేకే1 పలోరా 2, రెడ్ చిల్లీ, వండర్ బాయ్ జేకే 2 అనే రకాల మొక్కలు నర్సరీలో సిద్ధంగా ఉన్నాయి. జేకే1 పలోరా 2 రకం పసుపు రంగు పండు అన్నిటికన్నా తియ్యనిది (బ్రిక్స్ 23.6). పూత వచ్చాక 65 రోజులకు పండు కోతకు వస్తుందని ఆయన 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. తన డ్రాగన్ పండ్ల రంగు, రుచిని బట్టి.. ఒక్కో మొక్కను రూ. వంద నుంచి 4,000 వరకు విక్రయిస్తుండటం విశేషం. వండర్ బాయ్ జేకే 2 రకం (క్రాస్ పాలినేషన్ రకం) పండు తియ్యదనం బ్రిక్స్ 21.5. ఈ మొక్క ధర రూ. 1,500. రెడ్ చిల్లీ పండు తియ్యదనం బ్రిక్స్ 17.5. దీని కటింగ్‌ను రూ. వెయ్యికి అమ్ముతున్నారాయన. అన్నట్టు.. మొక్కలతో పాటు పండ్లను కూడా అమ్ముతున్నారు జోసెఫ్(94472 94236). అనేక రాష్ట్రాల్లో తన కస్టమర్లున్నారని ఆయన అంటున్నారు కించిత్ గర్వంగా!

24న మట్టి లేని సేద్యం (కోకోపోనిక్స్)పై ఐఐహెచ్ఆర్ శిక్షణ

కొబ్బరి పొట్టు ఎరువులో పోషక ద్రావణంతో గ్రోబాగ్స్‌లో ఇంటిపై కూరగాయలు, ఔషధ మొక్కలను పెంచే కొత్త పద్ధతే కోకోపోనిక్స్ లేదా మట్టిలేని సేద్య పద్ధతి. బెంగళూరు లోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) ఈ నెల 24(బుధవారం)న ఆంగ్లంలో ఆఫ్‌లైన్/ ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది (ఈ సాగు పద్ధతిపై గత నెల 16న 'సాగుబడి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే). కొబ్బరి పొట్టు ఎరువును ఉపయోగించి టెర్రస్/బాల్కనీలో వివిధ ఉద్యాన పంటలను పండించడానికి అవసరమైన నైపుణ్యం, పరిజ్ఞానాన్ని ఈ శిక్షణ అందిస్తుందని ఐఐహెచ్ఆర్‌లో కోకోపోనిక్స్ నిపుణుడు డా. కర్తైవానన్ తెలిపారు. గృహిణులు, యువతీ యువకులు, వృద్ధులు.. ఎవరైనా అర్హులే. బెంగళూరులోని ఐఐహెచ్ఆర్‌కు వెళ్లి స్వయంగా హాజరయ్యే వారికి ఫీజు రూ. 2 వేలు. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందగోరే వారికి ఫీజు రూ.500.

పేర్ల నమోదు కోసం, క్రింది లింక్‌ను సందర్శించండి:
https://forms.gle/tx4i5BJnqDVUZGed6
ఇతర వివరాలకు.. 77608 83948
ఈ కింది బ్యాంక్ ఖాతా ద్వారా ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
Name: BESST-HORT REVENUE, Bank: State bank of India, A/c No.: 38854230395, Branch: Hesaraghatta Branch
IFSC Code: SBIN0041187



కర్మన్‌కౌర్ సంచలనం

చెన్నై ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో భారత క్రీడాకారిణి కర్మన్‌కౌర్ థండి సంచలనం సృష్టించింది. సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 359వ ర్యాంకర్ కర్మన్‌కౌర్ 4-6, 6-4, 6-3తో ప్రపంచ 109వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ చోల్ పాక్వె (ఫ్రాన్స్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 2 గంటల 35 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కర్మన్ నాలుగు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 2014 వింబుల్డన్ రన్నరప్ యుజీన్ బుషార్డ్ (కెనడా)తో కర్మన్ ఆడుతుంది.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ రెండో టి20

సిరీస్‌లో నిలిచేందుకు నేడు ఇంగ్లండ్‌తో జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. డెర్బీషైర్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం గెలిస్తే సిరీస్‌ను సమం చేస్తుంది. ఓడితే సిరీస్‌ను కోల్పోతుంది. తొలి మ్యాచ్‌లో దీప్తి శర్మ మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



స్పోర్ట్స్ రీల్

కార్తీక్ రెడ్డికి స్వర్ణం



సాక్షి, హైదరాబాద్: కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ కుర్రాడు ఎ.కార్తీక్ రెడ్డి స్వర్ణ పతకంతో మెరిశాడు. ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఈ పోటీల్లో కార్తీక్ రెడ్డి క్యాడెట్ బాలుర 70 కేజీల కుమిటే విభాగంలో విజేతగా నిలిచాడు. జారాలాంపాస్ (సైప్రస్) రజతం, హారిసన్ లుకాస్ (స్కాట్లాండ్), జేకబ్ కట్లర్ (ఇంగ్లండ్) కాంస్య పతకాలు గెలిచారు.

సెమీస్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ

కోల్‌కతా: డ్యూరాండ్ కప్ టోర్నీలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ 3-1తో రాజస్తాన్ యునైటెడ్‌పై నెగ్గింది. హైదరాబాద్ తరఫున ఒగ్బెచె (6వ ని.లో), ఆకాశ్ మిశ్రా (45వ ని.లో), సివెరియో (69వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.


ఇంగ్లండ్‌దే సిరీస్

లండన్: దక్షిణాఫ్రికాతో జరిగిన చివరిదైన మూడో టెస్టులో ఇంగ్లండ్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు టెస్టుల సిరీస్‌ను బెన్ స్టోక్స్ బృందం 2-1తో సొంతం చేసుకుంది. 130 పరుగుల విజయలక్ష్యాన్ని ఇంగ్లండ్ ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. ఆట చివరిరోజు సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 97/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ అలెక్స్ లీస్ (39; 4 ఫోర్లు) వికెట్ కోల్పోయి మిగతా 33 పరుగులు సాధించింది. జాక్ క్రాలీ (69 నాటౌట్; 12 ఫోర్లు), ఒలీ పోప్ (11 నాటౌట్; 1 ఫోర్) నాటౌట్‌గా నిలిచారు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి ఏడు వికెట్లు తీసిన ఇంగ్లండ్ బౌలర్ రాబిన్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... ఓవరాల్‌గా 149 పరుగులు సాధించి, 10 వికెట్లు పడగొట్టిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.



అల్‌కరాజ్ అదరహో

- యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ కైవసం
- కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌నూ అందుకున్న స్పెయిన్ టీనేజర్
- ఫైనల్లో కాస్పర్ రూడ్‌పై విజయం
- రూ. 20 కోట్ల 71 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



న్యూయార్క్: పురుషుల టెన్నిస్‌లో కార్లోస్ అల్‌కరాజ్ రూపంలో కొత్త కెరటం వచ్చింది. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో 19 ఏళ్ల ఈ స్పెయిన్ టీనేజర్ అద్భుతం చేశాడు. ఈ సీజన్‌లో తాను సాధించిన విజయాలు గాలివాటమేమీ కాదని నిరూపిస్తూ అల్‌కరాజ్ ఏకంగా గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా అవతరించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అల్‌కరాజ్ 6-4, 2-6, 7-6 (7/1), 6-3తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కాస్పర్ రూడ్ (నార్వే)పై విజయం సాధించాడు. ఈ గెలుపుతో అల్‌కరాజ్ కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించడంతోపాటు సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. రన్నరప్ కాస్పర్ రూడ్ ఐదు స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో నిలిచాడు. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 26 లక్షల డాలర్లు (రూ. 20 కోట్ల 71 లక్షలు)... రన్నరప్ కాస్పర్ రూడ్‌కు 13 లక్షల డాలర్లు (రూ. 10 కోట్ల 35 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. అల్‌కరాజ్ కెరీర్‌లో ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో టైటిల్ నెగ్గగా... కాస్పర్ రూడ్‌కు రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోనూ ఓటమి ఎదురైంది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో రాఫెల్ నాదల్ చేతిలో కాస్పర్ రూడ్ ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు. నాదల్ (19 ఏళ్లు; 2005లో ఫ్రెంచ్ ఓపెన్) తర్వాత గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన పిన్న వయస్కుడిగా... సంప్రాస్ (19 ఏళ్లు; 1990లో యూఎస్ ఓపెన్) తర్వాత యూఎస్ ఓపెన్ గెలిచిన పిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు.



కాస్పర్ రూడ్

ఫైనల్ గణాంకాలు

అల్‌కరాజ్		కాస్పర్ రూడ్
14	ఏస్‌లు	4
3	డబుల్ ఫాల్ట్‌లు	2
34/45	నెట్ పాయింట్లు	23/36
3/11	బ్రేక్ పాయింట్లు	3/10
55	విన్నర్స్	37
41	అనవసర తప్పిదాలు	29
127	మొత్తం పాయింట్లు	122

అదే జోరు

ఫైనల్ చేరే క్రమంలో ప్రిక్వార్టర్ ఫైనల్లో, క్వార్టర్ ఫైనల్లో, సెమీఫైనల్లో ఐదు సెట్‌లపాటు పోరాడిన గెలిచిన అల్‌కరాజ్ తుది సమరంలోనూ పట్టుదలతో ఆడాడు. పదునైన రిటర్న్‌లు, శక్తివంతమైన గ్రౌండ్ స్ట్రోక్‌లు, డ్రాప్ షాట్‌లు, బేస్‌లైన్ ఆటతో అలరించిన అల్‌కరాజ్ 3 గంటల 20 నిమిషాల్లో కాస్పర్ రూడ్ ఆట కట్టించాడు. తొలి సెట్‌లోని మూడో గేమ్‌లో రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ ఆ తర్వాత తన సర్వీస్‌లు నిలబెట్టుకొని సెట్ దక్కించుకున్నాడు. అయితే రెండో సెట్‌లో రూడ్ తేరుకొని నాలుగో గేమ్‌లో, ఆరో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌లను బ్రేక్ చేసి సెట్‌ను గెల్చుకున్నాడు. మూడో సెట్ హోరాహోరీగా సాగింది. రూడ్ 6-5తో ఆధిక్యంలో నిలిచి అల్‌కరాజ్ సర్వ్ చేసిన 12వ గేమ్‌లో రెండుసార్లు సెట్ పాయింట్లు సంపాదించాడు. అయితే అల్‌కరాజ్ పట్టుదలతో ఆడి ఐదుసార్లు డ్యూస్‌ల తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని స్కోరును 6-6తో సమం చేశాడు. అనంతరం టైబ్రేక్‌లో ఈ స్పెయిన్ యువతార పైచేయి సాధించి మూడో సెట్‌ను సాధించాడు. నాలుగో సెట్‌లోనూ అల్‌కరాజ్ జోరు కొనసాగించి ఆరో గేమ్‌లో రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 4-2తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత అల్‌కరాజ్ తన సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌తోపాటు మ్యాచ్‌ను గెల్చుకున్నాడు.

5 ఈ ఏడాది అల్‌కరాజ్ సాధించిన టైటిల్స్ (రియో డి జనీరో, మయామి, బార్సిలోనా, మాడ్రిడ్ ఓపెన్, యూఎస్ ఓపెన్).

51 ఈ సంవత్సరం అల్‌కరాజ్ మొత్తం 60 మ్యాచ్‌లు ఆడి 51 విజయాలు సాధించి అగ్రస్థానంలో ఉన్నాడు. తొమ్మిది మ్యాచ్‌ల్లో అతను ఓడిపోయాడు.

4 కార్లోస్ మోయా (1999), కార్లోస్ ఫెరీరో (2003), రాఫెల్ నాదల్ (2008) తర్వాత ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న నాలుగో స్పెయిన్ ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు. ప్రస్తుతం అల్‌కరాజ్ కోచ్ గా ఉన్న ఫెరీరో 2003లో యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఓటమి తర్వాత వరల్డ్ నంబర్‌వన్ కాగా అల్‌కరాజ్ టైటిల్ సాధించి టాప్ ర్యాంకర్ కావడం విశేషం.

1 టెన్నిస్‌లో ర్యాంకింగ్స్ (1973) ప్రవేశపెట్టాక టాప్ ర్యాంక్ అందుకున్న అతి పిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ రికార్డు నెలకొల్పాడు.

బుమ్రా వచ్చేశాడు...

- టి20 ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన
- హర్షల్ పటేల్ పునరాగమనం
- రిజర్వ్ ఆటగాళ్లలో షమీ



భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), కోహ్లి, సూర్యకుమార్, దీపక్ హుడా, పంత్, దినేశ్ కార్తీక్, పాండ్యా, అశ్విన్, చహల్, అక్షర్, బుమ్రా, భువనేశ్వర్, హర్షల్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్.
స్టాండ్‌బై: షమీ, అయ్యర్, రవి బిష్ణోయ్, దీపక్ చహర్.

ముంబై: ఎలాంటి అనూహ్య, ఆశ్చర్యకర ఎంపికలు లేవు. అంచనాలకు అనుగుణంగానే బీసీసీఐ సెలక్టర్లు టి20 ప్రపంచకప్ కోసం భారత జట్టును ప్రకటించారు. ఇప్పటికే తామేంటో రుజువు చేసుకున్న టాప్ ఆటగాళ్లతో పాటు ఇటీవలి ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ఈ ఎంపిక జరిగింది. గాయాలతో కొంత కాలంగా టీమ్‌కు దూరమైన అగ్రశ్రేణి పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా రాకతో భారత జట్టు బలం పెరిగింది. గాయం నుంచి కోలుకున్న హర్షల్ పటేల్ కూడా పునరాగమనం చేయడం బౌలింగ్‌ను మరింత పదునుగా మార్చింది. రోహిత్ శర్మ నాయకత్వంలో 15 మంది సభ్యుల జట్టుతో పాటు మరో నలుగురిని స్టాండ్‌బైలుగా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 13 వరకు ఆస్ట్రేలియాలో టి20 ప్రపంచకప్ జరుగుతుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏదైనా జట్టు తమ తొలి మ్యాచ్ బరిలోకి దిగే సమయం వరకు కూడా ఈ టీమ్‌లో మార్పులు చేసుకోవచ్చు. భారత్ తమ తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 23న పాకిస్తాన్‌తో తలపడుతుంది. 2021 టోర్నీలో భారత్ సెమీస్ చేరడంలో విఫలమైంది. తొలి ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జట్టులో (2007) భాగంగా ఉన్న రోహిత్ శర్మ 15 ఏళ్ల తర్వాత కెప్టెన్‌గా టీమ్‌ను నడిపించనున్నాడు.

హుడా, అశ్విన్‌లకు చాన్స్



హుడా



అశ్విన్

ఆసియా కప్ ఫలితం ఎలా ఉన్నా, ఒకరిద్దరు తప్పితే మిగతా వారిని ప్రపంచకప్‌కు ఎంపిక చేసే విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. ఈ ఏడాదే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టినా... నిలకడైన ఆటతో ఆకట్టుకున్న దీపక్ హుడాకు చోటు లభించింది. ఆఫ్‌స్పిన్ బౌలింగ్ చేయగల అదనపు నైపుణ్యం కూడా అతనికి అవకాశం తెచ్చి పెట్టింది. ప్రధాన స్పిన్నర్ చహల్ ఖాయం కాగా... రవీంద్ర జడేజా కోలుకునే అవకాశం లేకపోవడంతో అక్షర్ పటేల్‌కు సహజంగానే అవకాశం దక్కింది. అయితే మూడో స్పిన్నర్‌గా యువ లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్, సీనియర్ అశ్విన్ మధ్య పోటీ నడిచింది. అయితే ఆఫ్ స్పిన్‌తో జట్టుకు వైవిధ్యం చేకూరడంతో పాటు ఆసీస్ గడ్డపై అపార అనుభవం ఉండటంతో సీనియర్ అశ్విన్‌కే ఓటు వేసిన సెలక్టర్లు... డెత్ ఓవర్లలో ఆకట్టుకుంటున్న పేసర్ అర్ష్‌దీప్‌పై నమ్మకం ఉంచారు.

12 ఏళ్ల తర్వాత...



వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ 12 ఏళ్ల తర్వాత మళ్లీ టి20 వరల్డ్‌కప్‌లో ఆడనున్నాడు. కార్తీక్ 2007, 2010లలో టి20 ప్రపంచ కప్‌లు ఆడాడు. ఆ తర్వాత నాలుగు వరల్డ్ కప్‌లు జరిగినా కార్తీక్‌కు స్థానం దక్కలేదు. 2021లో జరిగిన టి20 ప్రపంచ కప్ ఆడిన జట్టుతో పోలిస్తే ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి, రాహుల్ చహర్, శార్దుల్ ఠాకూర్ తమ స్థానాలు కోల్పోయారు. మరోవైపు వరల్డ్ కప్ టీమ్‌లో స్టాండ్‌బైగా ఉన్న షమీని స్వదేశంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలతో జరిగే టి20 సిరీస్‌లకు ఎంపిక చేశారు. ఆస్ట్రేలియాతో సెప్టెంబర్ 20, 23, 25 తేదీల్లో... దక్షిణాఫ్రికాతో సెప్టెంబర్ 28, అక్టోబర్ 2, 4 తేదీల్లో టీమిండియా టి20 సిరీస్ ఆడుతుంది.

స్వదేశంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలతో జరిగే టి20 సిరీస్‌లలో కూడా స్వల్ప మార్పు మినహా ఇదే జట్టు బరిలోకి దిగుతుంది. హార్దిక్, భువనేశ్వర్ దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు, అర్ష్‌దీప్ ఆస్ట్రేలియాతో సిరీస్‌కు దూరం కానున్నారు. రెండు సిరీస్‌ల సమయంలో ఈ ముగ్గురు ఆటగాళ్లు ఫిట్‌నెస్ మెరుగుదలకు సంబంధించి జాతీయ క్రికెట్ అకాడమీలో ఉంటారు. షమీ, దీపక్ చహర్ ఈ రెండు సిరీస్‌లు ఆడతారు.

సినిమా

ఓ సినిమా సెట్స్‌పై ఉండగా లేదా విడుదలకు సిద్ధం అవుతున్న సమయంలోనే తర్వాతి సినిమా గురించి అనౌన్స్ చేస్తుంటారు కొందరు దర్శకులు. అయితే కొందరు డైరెక్టర్స్ మాత్రం మూడు నాలుగేళ్లుగా తమ తర్వాతి ప్రాజెక్ట్స్‌పై క్లారిటీ ఇవ్వలేదు. దీంతో 'వాట్ నెక్ట్స్?' అనే చర్చ జరగడం కామన్. మరి ఆ ప్రశ్నకు ఆయా దర్శకులే క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది. తెలుగులో తమ తర్వాతి సినిమాలపై ఓ క్లారిటీ ఇవ్వని శ్రీను వైట్ల, శ్రీకాంత్ అడ్డాల, విజయ్ కుమార్ కొండా, సంతోష్ శ్రీనివాస్, 'బొమ్మరిల్లు' భాస్కర్, సుజిత్, బుచ్చిబాబు వంటి దర్శకులపై ఓ లుక్కేద్దాం.

వాట్ నెక్ట్స్?



శ్రీను వైట్ల



శ్రీకాంత్ అడ్డాల



బొమ్మరిల్లు భాస్కర్



సంతోష్ శ్రీనివాస్



సుజిత్



విజయ్ కుమార్ కొండా



బుచ్చి బాబు

లవ్, యాక్షన్, ఫ్యామిలీ.. ఇలా అన్ని జానర్స్‌లో సినిమాలు తీసి హిట్ అందుకున్నారు శ్రీను వైట్ల. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రవితేజ, మంచు విష్ణు, రామ్.. వంటి హీరోలతో వరుసగా చిత్రాలు తీసిన ఆయన నాలుగేళ్లుగా నెమ్మదించారు. వరుణ్ తేజ్‌తో తీసిన 'మిస్టర్' (2017), రవితేజతో తెరకెక్కించిన 'అమర్ అక్బర్ ఆంటోనీ' (2018) చిత్రాల తర్వాత మంచు విష్ణుతో శ్రీను వైట్ల 'ఢీ' సినిమాకి సీక్వెల్‌గా 'ఢీ అండ్ ఢీ'ని ప్రకటించారు. అయితే ఆ సినిమాని ప్రకటించి రెండేళ్లవుతున్నా ఇప్పటివరకూ సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ మధ్యలో మంచు విష్ణు 'జిన్నా' సినిమాని పూర్తి చేశారు. ఈ మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. మరో దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల విషయానికి వస్తే.. సున్నితమైన ప్రేమకథకు ఫ్యామిలీ ఎమోషన్స్ యాడ్ చేసి తొలి సినిమాతోనే (కొత్తబంగారు లోకం) హిట్‌కొట్టారు. ఆ తర్వాత వెంకటేశ్, మహేశ్‌బాబులతో మల్టీస్టారర్ మూవీ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు. ఆ తర్వాత 'ముకుంద, బ్రహ్మోత్సవం, నారప్ప' వంటి చిత్రాలు తీశారాయన. వెంకటేశ్ హీరోగా రూపొందిన 'నారప్ప' గత ఏడాది జూలై 20న ఓటీటీలో విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం రిలీజై ఏడాది దాటినా తర్వాతి ప్రాజెక్టుపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు శ్రీకాంత్ అడ్డాల. సేమ్ ఇలానే దర్శకుడు విజయ్ కుమార్ కొండా కూడా ఏడాదికిపైనే అయినా తాజా చిత్రాన్ని ప్రకటించలేదు. నితిన్ హీరోగా 'గుండెజారి గల్లంతయ్యిందే' వంటి లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని తెరకెక్కించి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు విజయ్ కుమార్ కొండా. ఆ తర్వాత 'ఒక లైలా కోసం, ఒరేయ్ బుజ్జిగా, పవర్ ప్లే' వంటి సినిమాలు తెరకెక్కించారు. రాజ్ తరుణ్‌తో తీసిన 'పవర్ ప్లే' చిత్రం 2021 మార్చి 5న రిలీజ్ అయింది. ఈ చిత్రం విడుదలై ఏడాదిన్నర అవుతున్నా ఆయన తర్వాతి సినిమాపై ఎలాంటి స్పష్టత లేదు. శ్రీకాంత్ అడ్డాల, విజయ్‌కుమార్‌లా తదుపరి చిత్రంపై ఏడాది అవుతున్నా స్పష్టత ఇవ్వని మరో దర్శకుడు 'బొమ్మరిల్లు భాస్కర్'. అందమైన కుటుంబ కథకి ప్రేమ, భావోద్వేగాలు కలగలిపి 'బొమ్మరిల్లు' సినిమాతో సెన్సేషనల్ హిట్ అందుకున్నారు భాస్కర్. ఆ సినిమానే ఆయన ఇంటిపేరుగా మారిందంటే ఆ చిత్రం ఏ రేంజ్‌లో ఆయనకి గుర్తింపు తీసుకొచ్చిందో ప్రత్యేకించిచెప్పక్కర్లేదు. ఆ తర్వాత తెలుగులో 'పరుగు, ఆరెంజ్, ఒంగోలు గిత్త' చిత్రాలు తీశారు. అఖిల్ హీరోగా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' చిత్రాన్ని తెరకెక్కించారు. 2021 అక్టోబర్ 15న విడుదలైన ఈ చిత్రం మంచి హిట్ అందుకుంది. అయితే తన నెక్ట్స్ సినిమాపై భాస్కర్ క్లారిటీ ఇవ్వలేదు. ఇక కెమెరామేన్ నుంచి దర్శకునిగా మారిన సంతోష్ శ్రీనివాస్ కూడా తదుపరి చిత్రం ప్రకటించని దర్శకుల జాబితాలో ఉన్నారు. 'కందిరీగ, రభస, హైపర్, అల్లుడు అదుర్స్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కించిన 'అల్లుడు అదుర్స్' (2021 జనవరి 15న విడుదలైంది) తర్వాత తన నెక్ట్స్ మూవీ ఎవరితో ఉంటుంది? అనే స్పష్టత ఇవ్వలేదాయన. పవన్ కల్యాణ్‌తో ఓ సినిమా చేయనున్నారనే వార్తలు గతంలో వినిపించాయి. సీనియర్లే కాదు.. యువ దర్శకుడు సుజీత్ కూడా మూడేళ్లయినా తన తదుపరి చిత్రం ప్రకటించలేదు. తొలి చిత్రం 'రన్ రాజా రన్' (2014)తో మంచి హిట్ అందుకున్నారు సుజిత్. ఆ సినిమా ఇచ్చిన హిట్‌తో స్టార్ హీరో ప్రభాస్‌ని డైరెక్ట్ చేసే చాన్స్ దక్కించుకున్నారు. ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వం వహించిన 'సాహో' చిత్రం 2019 ఆగస్టు 30న విడుదలైంది. యాక్షన్, టెక్నికల్ పరంగా అత్యున్నత విలువలతో రూపొందిన ఈ చిత్రం ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌పై ఉన్న భారీ అంచనాలను అందుకోలేక పోయింది. 'సాహో' విడుదలై మూడేళ్లు అవుతున్నా తన తర్వాతి సినిమాపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు సుజిత్. అయితే పవన్ కల్యాణ్‌తో ఓ సినిమా చేయనున్నారని, ఇప్పటికే కథ వినిపించారని టాక్. డీవీవీ దానయ్య నిర్మించనున్న ఈ సినిమాకి దర్శకుడు త్రివిక్రమ్ కూడా నిర్మాతగా వ్యవహరించనున్నారట. ఈ చిత్రం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ప్రేమకథతో టాలీవుడ్‌కి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు బుచ్చిబాబు. డైరెక్టర్ సుకుమార్ వద్ద అసిస్టెంట్‌గా చేసిన బుచ్చిబాబు తొలి చిత్రంతోనే సెన్సేషనల్ హిట్ అందుకున్నారు. ఆ చిత్రంతో హీరో హీరోయిన్లుగా పరిచయమైన వైష్ణవ్ తేజ్, కృతీశెట్టి ఫుల్ బిజీ అయిపోయారు. 2021 ఫిబ్రవరి 12న ఈ చిత్రం విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం విడుదలై దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా బుచ్చిబాబు తర్వాతి సినిమాపై స్పష్టత లేదు. అయితే తన తర్వాతి మూవీ ఎన్టీఆర్‌తో ఉంటుందని, ఇందుకోసం కథ కూడా సిద్ధం చేశారని వార్తలు వచ్చాయి.. కానీ, దీనిపై అధికారిక ప్రకటన లేదు. వీరితో పాటు వేణు శ్రీరాం, రాహుల్ సంకృత్యాన్, రాధాకృష్ణ కుమార్, పరశురామ్ వంటి దర్శకుల తర్వాతి మూవీస్‌పైనా క్లారిటీ రావాల్సి ఉంది. వీరిలో వేణు శ్రీరామ్ హీరో రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేయనున్నారని టాక్. నాగచైతన్య హీరోగా పరశురామ్ ఓ మూవీ చేయనున్నారని సమాచారం.

మనాలీలో.. యాక్షన్

'యోధ' కోసం మనాలీ వెళ్లారు హీరోయిన్ రాశీఖన్నా. బాలీవుడ్ యంగ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా సాగర్ అంబ్రే, పుష్కర్ ఓజా ద్వయం తెరకెక్కిస్తున్న సినిమా 'యోధ'. ఈ యాక్షన్ ఫిల్మ్‌లో దిశా పటానీ, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. అయితే కొంత ప్యాచ్‌వర్క్ కోసం మనాలీ వెళ్లింది 'యోధ' చిత్రబృందం. షూట్‌లో పాల్గొంటున్న విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టా ద్వారా తెలిపారు రాశీ ఖన్నా. ఇందులో రాశీ ఖన్నా కొన్ని యాక్షన్ సీన్స్ కూడా చేశారన్నది బాలీవుడ్ సమాచారం. ఈ సినిమాను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రం కాకుండా తమిళంలో కార్తీ 'సర్దార్', తెలుగులో శర్వానంద్‌తో ఓ సినిమా చేస్తున్నారు రాశీ ఖన్నా.



రాశీ ఖన్నా

ఆరంభం



మహేశ్‌బాబు

సెట్స్‌లో మహేశ్‌బాబు యాక్షన్ ఆరంభమైంది. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్. హారికా అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ముందు యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేసినట్లుగా తెలిసింది. నెక్ట్స్ షెడ్యూల్‌లో పూజా హెగ్డే జాయిన్ అవుతారట. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 28న చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక 'అతడు (2005)', 'ఖలేజా' (2010) చిత్రాల తర్వాత మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో దాదాపు పన్నెండేళ్ల తర్వాత రూపొందుతున్న చిత్రం ఇది.

జై దేవ్‌గా సత్యదేవ్

'గాడ్ ఫాదర్' కోసం జై దేవ్ అవతారం ఎత్తారు సత్యదేవ్. చిరంజీవి హీరోగా మోహన్‌రాజా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గాడ్ ఫాదర్'. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో నయనతార, సల్మాన్ ఖాన్, పూరి జగన్నాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో సత్యదేవ్ పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో జై దేవ్ పాత్ర చేశారు సత్యదేవ్. అక్టోబరు 5న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వాకాడ అప్పారావు.



సత్యదేవ్

నెక్ట్స్ లెవల్ సందేశం



నరేష్‌కుమార్ రెడ్డి, ఆదిత్య, గోపి

తాహిర్, పల్లవి జంటగా బత్తిని ఫిల్మ్స్ బ్యానర్‌పై గోపీ దేవెళ్లను దర్శకుడిగా పరిచయం చేస్తూ బి. నరేష్ కుమార్ రెడ్డి నిర్మించిన చిత్రం 'నెక్ట్స్ లెవల్'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన దర్శకుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూశాను.. బాగున్నాయి. ప్రేక్షకులను నిరుత్సాహపరచదు. ఈ సినిమాతో దర్శక–నిర్మాతలతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు కూడా వారి వారి కెరీర్స్‌లో నెక్ట్స్ లెవల్‌కు వెళ్లాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''స్లీపింగ్ టాబ్లెట్స్‌పై ఈ సినిమా కథనం ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంది'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ సినిమాకు సహనిర్మాత: శ్రీనివాస్ వంగపల్లి, సంగీతం: జై.

సాక్షి
బిజినెస్
మంగళవారం
13-9-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	322	60,115
నిఫ్టీ ▲	103	17,936

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	12,238	▲	126
డోజోన్స్	32,389	▲	237
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,473	▲	122
డాక్స్	13,402	▲	314
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,262	▲	26
నికాయ్	28,542	▲	327

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.

ఈసారి 10 శాతం వృద్ధి

ఫార్మా ఎగుమతులపై ఫార్మెక్సిల్ అంచనా



ఫార్మెక్సిల్ డీజీ ఉదయ భాస్కర్, ఐఫెక్స్ 2022 చైర్మన్ సి.సత్యనారాయణ, నోష్ ల్యాబ్స్ డైరెక్టర్ దొడ్డ వీవీఎస్ రెడ్డి (ఎడమ నుండి కుడికి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు సుమారు 10 శాతం వృద్ధి చెంది 27.43 బిలియన్ డాలర్లకు పెరగవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఇవి 24.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత్ నుంచి ఔషధాలు కొనుగోలు చేసే పలు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఇతరత్రా అవసరాలకు నిధులు మళ్లించాల్సి రావడంతో గత ఆర్థిక సంవత్సరంలో కొన్ని మార్కెట్లకు ఎగుమతులు కొంత మేర తగ్గాయని ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఆర్.ఉదయ్ భాస్కర్ ఇక్కడ తెలిపారు.

21 నుంచి నోయిడాలో... ఐఫెక్స్

సెప్టెంబర్ 21–23 మధ్య నోయిడాలో 8వ విడత ఫార్మా, హెల్త్‌కేర్ అంతర్జాతీయ ఎగ్జిబిషన్ ఐఫెక్స్‌ను నిర్వహించనున్నట్లు ఐఫెక్స్ 2022 చైర్మన్, లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,863
బంగారం (99.5 స్వచ్ఛత)	50,659
వెండి (కిలో)	55,937

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-9-2022	
విశాఖ	450–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	66.00
12-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	380–00
వరంగల్	382–00
రిటైల్ ధర	4.40

మూడో రోజూ ముందుకే

- 60 వేల స్థాయిపై సెన్సెక్స్
- 17,900 పాయింట్ల పైకి నిఫ్టీ
- కలిసొచ్చిన క్రూడ్ ధరల పతనం
- సానుకూల అంతర్జాతీయ సంకేతాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడోరోజూ కదంతొక్కింది. బ్యాంకింగ్, ఐటీ, ఇంధన షేర్లలో కొనుగోళ్లతో సోమవారం సెన్సెక్స్ 322 పాయింట్లు పెరిగి మూడు వారాల గరిష్ట స్థాయి 60,115 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103 పాయింట్లు బలపడి 17,900 పైన 17,936 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో అన్ని రంగాల షేర్లకు డిమాండ్ లభించింది. ముఖ్యంగా అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు 1–2% రాణించి సూచీల ర్యాలీకి అండగా నిలిచాయి. నిఫ్టీ ఆర్జించిన మొత్తం లాభాల్లో ఈ షేర్లవే 46 పాయింట్లు కావడం విశేషం. బీఎస్‌ఈ మిడ్ అరశాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఒక శాతం చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,050 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.891 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆసియా, యూరప్ మార్కెట్లు ఒకశాతం లాభపడ్డాయి. క్రూడాయిల్ రికవరీ తర్వాత యూఎస్ ఫ్యూచర్లు లాభాల్లోకి మళ్లాయి. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.79.53 వద్ద ముగిసింది. కాగా గడిచిన 3 రోజుల్లో సెన్సెక్స్ 1,086 పాయింట్లు, నిఫ్టీ 312 పాయింట్లు బలపడ్డాయి.

ట్రేడింగ్ ఆద్యంతం లాభాలే

ఉదయం సెన్సెక్స్ 119 పాయింట్లు బలపడి 59,912 వద్ద, నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 17,890 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే మద్దతివ్వడంతో సూచీలు స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 492 పాయింట్లు బలపడి 60,285 వద్ద, నిఫ్టీ 148 పాయింట్లు దూసుకెళ్లి 17,981 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి.

వృద్ధి బాట




వృద్ధి పథంలో పయనిస్తున్న ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తూ దేశీయ మార్కెట్ లాభాలను గడిస్తోంది. అంతర్జాతీయంగా బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 93 డాలర్లకు దిగి వచ్చింది. గత నెలలో వాహన విక్రయాలు, జీఎస్టీ వసూళ్లు, బ్యాంకుల రుణ వృద్ధి వంటి అంశాలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. ఆహార ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం అంచనాలను మించవచ్చు. స్వల్పకాలానికి సూచీలు ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. నిఫ్టీకి 18,000 స్థాయి వద్ద కీలక నిరోధం ఎదురుకావొచ్చు.

– వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్

మార్కెట్లో మరిన్ని సంగతులు

- శుభలక్ష్మీ పాలియెస్టర్స్‌ను రూ.1,522 కోట్లకు సొంతం చేసుకోవడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఒకశాతం లాభపడి రూ.2,598 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో రెండుశాతం పెరిగి రూ.2612 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఆరంభ లాభాల్ని కోల్పోయి మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ షేరు స్వల్పంగా 0.35% పెరిగి రూ.540 వద్ద ముగిసింది. హౌసింగ్ ప్రాజెక్టులను నిర్మించేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ముంబై, పుణే, బెంగళూరు నగరాల్లో భూములను కొనుగోలు చేస్తామనే ప్రకటనతో ఇంట్రాడేలో ఈ షేరు 2.37 శాతం ర్యాలీ చేసి రూ.550.40 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

ఎకానమీ గణాంకాలు నిరుత్సాహం..



- జూలైలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 2.4 శాతం పురోగతి
- నాలుగు నెలల కనిష్ట స్థాయి
- మూడు నెలల దిగువబాటనుంచి ద్రవ్యోల్బణం యూటర్న్
- ఆగస్టులో 7 శాతంగా నమోదు
- స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ ముగిశాక వెలువడిన లెక్కలు



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ మందగమన ధోరణిని సూచిస్తూ, సోమవారం కీలక గణాంకాలు వెలువడ్డాయి. స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత వెలువడిన అధికారిక గణాంకాల ప్రకారం, జూలైలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) కేవలం 2.4 శాతం పురోగతి (2021 ఇదే నెలతో పోల్చి) సాధించింది. గడచిన నాలుగు నెలల కాలంలో ఇంత తక్కువ స్థాయిలో ఫలితాలు రావడం ఇదే తొలిసారి. ఇక గడచిన మూడు నెలల నుంచి దిగువబాటలో ఉన్న వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం తిరిగి ఎగువబాట పట్టింది. ఆగస్టులో 7 శాతంగా నమోదయ్యింది.

తయారీ, విద్యుత్ అంతంతే..

- గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగం జూలైలో పేలవ పనితీరును ప్రదర్శించింది. ఈ రంగం కేవలం 3.2 శాతం పురోగమించింది.
- విద్యుత్ రంగం ఉత్పత్తి 2.3 శాతం పెరిగింది.
- మైనింగ్ రంగంలో 3.3 శాతం క్షీణించింది.
- వ్యవస్థలో డిమాండ్, భారీ యంత్ర ఉత్పత్తికి సంకేతమయిన క్యాపిటల్ గూడ్స్‌విభాగం తాజా సమీక్షా నెల్లో 5.8 శాతం వృద్ధి సాధించింది.
- ఎయిర్‌కండీషన్లు, వాషింగ్ మెషీన్లు వంటి కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగంలో వృద్ధి కేవలం 2.4 శాతం. గత ఏడాది ఇదే నెల్లో ఈ రేటు 19.4 శాతం.

ఏప్రిల్–జూల్లో 10 శాతం పురోగతి

ఏప్రిల్ నుంచి జూలై వరకూ ఐఐపీ వృద్ధి రేటు 10 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 33.9 శాతం.

8వ నెలా ద్రవ్యోల్బణం తీవ్రం

ఇక ఆర్‌బీఐ పాలసీకి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా ఎనిమిదవ నెల కేంద్రం నిర్దేశాలకు (6 శాతం) మించి ఆగస్టులో 7 శాతంగా నమోదయ్యింది. మూడు నెలలుగా తగ్గుముఖం పట్టిన రిటైల్ ద్రవ్యోల్బణం తిరిగి యూటర్న్ తీసుకోవడం ఆందోళనకర అంశం. జూలైలో ఆహార బాస్కెట్ ధర స్పీడ్ 6.69 శాతం ఉంటే, ఆగస్టులో 7.62 శాతానికి చేరింది. కూరగాయల ధరలు 10 శాతంపైగా పెరిగాయి.



క్లుప్తంగా...

బిస్లరీలో వాటాలపై టాటా గ్రూప్ ఆసక్తి



ముంబై: వ్యాపార దిగ్గజం టాటా గ్రూప్ తాజాగా ప్యాకేజ్డ్ వాటర్ కంపెనీ బిస్లరీ ఇంటర్నేషనల్‌లో వాటాలు దక్కించుకోవడంపై దృష్టి సారించింది. ముందుగా కొంత కొనుగోలు చేసి, క్రమంగా వాటాలు పెంచుకునే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి బిస్లరీ యాజమాన్యానికి టాటా గ్రూప్ సంస్థ టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ (టీసీపీఎల్) ఇప్పటికే ఆఫర్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. డీల్ కుదిరే విషయం ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నాయి. ఈ డీల్ కుదిరితే ప్యాకేజ్డ్ వాటర్ విభాగంలో ఎంట్రీ, మధ్య, ప్రీమియం సెగ్మెంట్లలో టాటా గ్రూప్‌నకు పట్టు లభిస్తుంది.

డీబీ రియల్టీపై అదానీ రియల్టీ కన్ను



ముంబై: అదానీ గ్రూప్‌లో భాగమైన రియల్ ఎస్టేట్ సంస్థ అదానీ రియల్టీ తాజాగా ముంబైకి చెందిన డీబీ రియల్టీని విలీనం చేసుకోవడంపై దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన చర్చలు తుది దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ డీల్ సాకారమైతే అదానీ రియల్టీ .. దొడ్డిదారిన స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యేందుకు మార్గం సుగమమవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

గుజరాత్‌లో వేదాంత సెమీకండక్టర్ ప్లాంటు



న్యూఢిల్లీ: ప్రతిపాదిత సెమీ కండక్టర్ ప్లాంటును గుజరాత్‌లో ఏర్పాటు చేయాలని పారిశ్రామిక దిగ్గజం వేదాంత నిర్ణయించింది. అహ్మదాబాద్‌లో తలపెడుతున్న ఈ ప్రాజెక్టులో డిస్‌ప్లే, సెమీకండక్టర్ ప్లాంట్లను నెలకొల్పనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్‌తో కలిసి 20 బిలియన్ డాలర్ల జాయింట్ వెంచర్‌గా వేదాంత తలపెట్టిన ఈ మెగా ప్రాజెక్టు కోసం తెలంగాణ సహా మహారాష్ట్ర, కర్ణాటక కూడా పోటీపడ్డాయి. కానీ ఇటీవల ముగిసిన తుది చర్చల్లో మహారాష్ట్రను పక్కకు నెట్టి గుజరాత్ ఆ ప్రాజెక్టును దక్కించుకుంది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జామ్-2023 పరీక్ష

దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ఎమ్మెస్సీ, ఇతర డ్యుయల్ డిగ్రీ, పోస్టు బ్యాచిలర్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్)–2023 నోటిఫికేషన్ విడుదలైంది.

- » **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష విధానం:** దీనిలో మొత్తం 7 టెస్ట్ పేపర్లు ఉంటాయి. అవి బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమేటిక్స్, మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. జామ్–2023 ప్రశ్నా పత్రం మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- » **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** హైదరాబాద్, ఖమ్మం, గుంటూరు, కరీంనగర్, వరంగల్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.10.2022
- » **జామ్–2023 పరీక్ష తేది:** 12.02.2023
- » **ఫలితాలు వెల్లడి:** 22.03.2023.
- » **వెబ్‌సైట్:** https://jam.iitg.ac.in

హెచ్‌ఏఎల్, హైదరాబాద్‌లో 82 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్).. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్, టెక్నీషియన్ అప్రెంటిస్, జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 82
- » **ఖాళీల వివరాలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–26, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్–34, జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–22. » **ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్:** విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్.
- » **టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్:** విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్,సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంఎల్‌టీ.
- » **జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్:** విభాగాలు: బీకాం, బీఎస్సీ(నర్సింగ్ /కెమిస్ట్రీ/కంప్యూటర్స్).
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, డిప్లొమా, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 13, 14.09.2022.
- » **వేదిక:** ఆడిటోరియం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రెనింగ్–డెవలప్‌మెంట్ వెనుక, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఏవియోనిక్స్ డివిజన్, హైదరాబాద్, బాలానగర్, హైదరాబాద్.
- » **వెబ్‌సైట్:** mhrdnats.gov.in

బీపీసీఎల్‌లో 102 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

కేరళ రాష్ట్రం కొచ్చిలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), కొచ్చి రిఫైనరీ.. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 102
- » **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటర్ ఇంజనీరింగ్, మెటలర్జీ ఇంజనీరింగ్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో మొదటి శ్రేణిలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 01.09.2022 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. » **స్టైపెండ్:** నెలకు రూ. 25,000 చెల్లిస్తారు. » **శిక్షణ వ్యవధి:**ఏడాది
- » **శిక్షణ స్థానం:** బీపీసీఎల్, కొచ్చి రిఫైనరీ.
- » **ఎంపిక విధానం:** విద్యార్హత డిగ్రీ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **బీపీసీఎల్ పోర్టల్‌లో దరఖాస్తులకు చివరితేది:** 13.09.2022
- » **వెబ్‌సైట్:** www.bharatpetroleum.in

ముంబై పోర్ట్ అథారిటీలో 12 అప్రెంటిస్‌లు

ముంబైలోని ముంబై పోర్ట్ అథారిటీ.. వొకేషనల్ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 12
- » **ఖాళీల వివరాలు:** మెడికో ల్యాబొరేటరీ టెక్నీషియన్–04, ఎక్స్‌రే టెక్నీషియన్–06, ఫార్మాస్యూటికల్ సైన్స్ టెక్నీషియన్–02.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి 10+2, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 14 ఏళ్లు ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ముంబై పోర్ట్ అథారిటీ హాస్పిటల్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 16.09.2022
- » **వెబ్‌సైట్:** www.mumbaiport.gov.in

ఆహార సంస్థలో.. అవకాశాలు అందుకునేలా!

జాబ్స్ గైడ్

» ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో కొలువుల భర్తీకి నోటిఫికేషన్
» పలు విభాగాల్లో 5 వేలకుపైగా నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులు



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఆశిస్తున్న అభ్యర్థులకు.. తీపికబురు! కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ).. భారీ సంఖ్యలో ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో.. అయిదు జోన్ల పరిధిలో మొత్తం 5,043 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. డిప్లొమా, డిగ్రీ అర్హతలతో కొలువు సొంతం చేసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌సీఐ ఉద్యోగ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ టిప్స్...

పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ విద్యార్థుల వరకూ.. తమ అర్హతలకు సరితూగే ప్రభుత్వ కొలువుల కోసం ఎంతో మంది అన్వేషిస్తుంటారు. అందుకోసం ఎస్ఎస్‌సీ, యూపీఎస్సీ, ఆర్ఆర్‌బీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. అలాంటి వారికి మరో చక్కటి అవకాశం.. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) విడుదల చేసిన తాజా జాబ్ నోటిఫికేషన్.

5 జోన్లు, 5,043 పోస్టులు

- ఎఫ్‌సీఐ జాతీయ స్థాయిలో అయిదు జోన్ల పరిధిలో..నాన్–ఎగ్జిక్యూటివ్ హోదాలోని ఎనిమిది కేడర్లలో 5,043 ఉద్యోగాల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ▪ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి సౌత్ జోన్‌లో 898 ఖాళీలు ఉన్నాయి. ▪ ప్రారంభ వేతన శ్రేణి ఆయా పోస్టును అనుసరించి కనిష్టంగా రూ.28,200–79,200; గరిష్టంగా రూ.34,000–1,03,400గా ఉంది.

అర్హతలు

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ, బీకాం, బీఎస్సీ(అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/బయో టెక్నాలజీ/బయో కెమిస్ట్రీ/మైక్రో బయాలజీ/ ఫుడ్ సైన్స్), బీఈ/బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ)/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/బయో టెక్నాలజీ/సివిల్), డిప్లొమా(సివిల్/మెకానికల్) /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ▪ **వయసు:**పోస్టును అనుసరించి 18–28ఏళ్ల మధ్య ఉండాలి.
- అభ్యర్థుల విద్యార్హతలు, వయో పరిమితి విషయంలో ఆగస్టు 1, 2022ను కటాఫ్ తేదీగా పరిగణిస్తారు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

- ఆయా పోస్టులకు రెండు దశల రాత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫేజ్–1, ఫేజ్–2 పేరుతో ఆన్‌లైన్ టెస్టులు నిర్వహిస్తారు. స్టెనో పోస్టులకు స్కిల్/టైపింగ్ టెస్ట్ ఉంటాయి.

ఫేజ్–1 పరీక్ష ఇలా

ఫేజ్–1 పరీక్ష నాలుగు విభాగాల్లో 100 ప్రశ్నలు–100 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–25 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ స్టడీస్ 25 ప్రశ్నలు–25 మార్కులకు ఉంటాయి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో అడుగుతారు. నెగెటివ్ మార్కుల నిబంధన అమల్లో ఉంది.

ఫేజ్–2.. వేర్వేరుగా

- ఫేజ్–1లో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఆయా పోస్టులకు సంబంధించి ఒక్కో ఖాళీకి 15 మంది చొప్పున(1:15 నిష్పత్తి) అభ్యర్థులను ఫేజ్–2 పరీక్షకు ఎంపిక చేస్తారు. ▪ ఫేజ్–2లోనూ ఆయా పోస్టులను అనుసరించి పేపర్–1, పేపర్–2, పేపర్–3లు ఉంటాయి. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్టును బట్టి ఆయా పేపర్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. ▪జూనియర్ ఇంజనీర్ పోస్టులకు పోటీ పడే వారు పేపర్–1, పేపర్–2 పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ▪ స్టెనో గ్రేడ్–2 ఔత్సాహికులకు పేపర్–3ని నిర్వహిస్తారు.
- ఏజీ–3(జనరల్ అభ్యర్థులు) పేపర్–1కు, ఏజీ–3(అకౌంట్స్), ఏజీ–2(టెక్నికల్) అభ్యర్థులు పేపర్–1, పేపర్–2లకు హాజరు కావాలి.
- ఏజీ–3(డిపో) అభ్యర్థులు పేపర్–1 కు హాజరు కావాలి. ▪ ఏజీ–3(హిందీ) అభ్యర్థులు పేపర్–1, పేపర్–2లకు హాజరు కావాలి.

ఫేజ్–2.. పేపర్–1 ఇలా

ఫేజ్–2లో పేపర్–1 పరీక్ష నాలుగు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 25 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు, జనరల్ స్టడీస్ నుంచి 45 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయిస్తారు.

పేపర్–2 సబ్జెక్ట్ సంబంధ ప్రశ్నలు

ఫేజ్–2లోని పేపర్–2ను సబ్జెక్ట్ సంబంధిత పేపర్‌గా పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్ట్‌లో 60 ప్రశ్నలతో 120 మార్కులకు ఈ పేపర్‌ను నిర్వహిస్తారు.

పేపర్–3

ఫేజ్–2 పరీక్షలో.. స్టెనో గ్రేడ్–3 అభ్యర్థులకు మాత్రమే నిర్వహించే పేపర్–3 పరీక్ష నాలుగు విభాగాల్లో 120 మార్కులకు ఉంటుంది. జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ అవేర్‌నెస్(ఎంఎస్ వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్ అండ్ ఇంటర్నెట్ తదితర అంశాలు) విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

ఫేజ్–2లో ప్రతిభ ఆధారంగా

ఫేజ్–2లో నిర్వహించిన రాత పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి.. తుది నియామకాలు ఖరారు చేస్తారు. స్టెనో గ్రేడ్–2 అభ్యర్థులకు తదుపరి దశలో ఇంగ్లిష్ టైపింగ్,షార్ట్ హ్యాండ్‌లో స్కిల్ టెస్ట్ కూడా నిర్వహిస్తారు.

విజయం సాధించాలంటే

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. ప్రతి రోజు ఇంగ్లిష్ దినపత్రికలను చదవడం, వాటిలోని ముఖ్యాంశాల సారాంశాన్ని రాసుకోవడం వంటివి చేయాలి.

రీజనింగ్ ఎబిలిటీ

వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫాన్యూమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్స్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్(వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్–డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కాంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్,శాతాలపై ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా, త్రికోణమితి, అల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. సమకాలీన అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకే విషయంలో చరిత్రలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు–వాటి తీర్మానాలు, అవార్డులు–విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

పేపర్–2 కోసం ప్రత్యేకంగా

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌పై జరిగే పేపర్–2లో రాణించడానికి అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ▪ ఏజీ–3 అకౌంట్స్ పోస్టుల అభ్యర్థులు బుక్ కీపింగ్, బీఆర్ఎస్, జీఎస్టీ, ఆడిటింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- సివిల్ ఇంజనీరింగ్ పోస్టుల అభ్యర్థులు బిల్డింగ్ మెటీరియల్స్, సర్వేయింగ్, సాలిడ్ మెకానిక్స్, ఎస్టిమేటింగ్, కాస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను చదవాలి.
- ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్ అభ్యర్థులు సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి.

ఎఫ్‌సీఐ రిక్రూట్‌మెంట్.. ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్ 5, 2022 ▪ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: జనవరి, 2023లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: ఫేజ్–1:** నెల్లూరు, విజయవాడ, కాకినాడ, కర్నూలు, తిరుపతి, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్; **ఫేజ్–2:** విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, హైదరాబాద్
- వెబ్‌సైట్: www.recruitmentfci.in

క్లుప్తంగా

బీఎస్సీ హార్టీకల్చర్ కోర్సులో ప్రవేశాలకు గడువు పెంపు

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ (ఆనర్స్) హార్టీకల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వర్సిటీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఈఏపీసెట్- 2022లో ర్యాంకు పొందిన బైపీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ, ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా, వ్యవసాయ, ఉద్యాన ఆధారిత పరిశ్రమల కోటా ద్వారా బీఎస్సీ (ఆనర్స్) హార్టీకల్చర్ కోర్సులో ప్రవేశం కల్పిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు ఉద్యాన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

హైకోర్టులో కొణతాల పిటిషన్ విచారణపై సుప్రీంకోర్టు స్టే

- కేంద్రం పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని కొణతాలకు నోటీసు
- విచారణ అక్టోబర్ 14కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం, విభజన హామీలు నెరవేర్చడం త్వరగా చేయాలంటూ మాజీమంత్రి కొణతాల రామకృష్ణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కొణతాల రామకృష్ణ పిటిషన్‌ను హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ రవీంద్రభట్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించిన ఇతర కేసులతో కలిపి ఈ పిటిషన్‌ను కూడా విచారించాలని కేంద్రం తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. అనంతరం హైకోర్టులో కొణతాల పిటిషన్ విచారణపై ధర్మాసనం స్టే విధించింది. కేంద్రం పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని కొణతాలకు నోటీసులు జారీచేసింది. విచారణ అక్టోబరు 14కు వాయిదా వేసింది.

గోదావరి మళ్లీ ఉగ్రరూపం

మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు


పోలవరం స్పిల్‌వే వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

గోదావరి ప్రధాన ప్రాజెక్టుల్లో సోమవారం వరద ప్రవాహం

ప్రాజెక్టు పేరు	గరిష్ట నీటినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
శ్రీరాంసాగర్	90.31	87.01	1,86,215	2,08,078
ఎల్లంపల్లి	20.18	16.31	5,76,170	6,46,254
మేడిగడ్డ	16.17	8.78	10,07,540	10,07,540
పోలవరం	194.6	23 (సుమారు)	7,50,000	7,50,000
ధవళేశ్వరం	2.93	2.93	7,08,251	7,08,251

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. పరీవాహక ప్రాంతం (బేసిన్)లో మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మన రాష్ట్రంలోని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో విస్తృతంగా శనివారం, ఆదివారం వర్షాలు కురువడంతో ప్రధాన పాయతోపాటు ఉపనదులు మంజీర, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, వాగులు, వంకలు ఉప్పొంగుతుండటంతో గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. గోదావరి ప్రధానపాయపై జైక్వాడ్ నుంచి బాబ్లీ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తేయడం, వాటికి మంజీర వరద తోడవుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరిగింది. వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తుండటం.. వాటికి కడెం వాగు, ఇతర వాగుల వరద తోడవుతుండటంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎల్లంపల్లి నుంచి దిగువకు విడుదల చేసిన వరదకు ప్రాణహిత, ఇంద్రావతి జలాలు తోడవుతుండటంతో కాళేశ్వరంలో అంతర్భాగమైన మేడిగడ్డ, దానికి దిగువన తుపాకులగూడెం బ్యారేజీలలోకి వరద ఉధృతి పెరుగుతోంది.

తుపాకులగూడెం, సీతమ్మసాగర్‌లలోకి వచ్చిన వరద వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తుండటంతో భద్రాచలం వద్ద వరద ప్రవాహం గంటగంటకు పెరుగుతోంది. రాత్రి 7 గంటలకు 10.36 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రావడంతో నీటిమట్టం 45.6 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. భద్రాచలం నుంచి పోలవరం వద్దకు వచ్చిన వరదను వచ్చినట్టుగా 48 గేట్ల నుంచి దిగువకు వదిలేస్తున్న అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం సోమవారం 32.1 మీటర్లకు చేరుకుంది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 7,08,251 క్యూసెక్కులు చేరుతోంది. గోదావరి డెల్టాకు 2,600 క్యూసెక్కులను విడుదల చేస్తూ, 175 గేట్లను పూర్తిగా ఎత్తేసి 7,05,651 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. మంగళవారం ఉదయానికి ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి చేరే వరద 10.50 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గోదావరి బేసిన్‌లో మరో రెండురోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో మరో మూడురోజులు గోదావరికి వరద ఉధృతి కొనసాగనుంది.

కృష్ణాలో ఎగువన మళ్లీ పెరుగుతున్న వరద

- పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు.. ఆల్మట్టి నుంచి 1.25 లక్షల క్యూసెక్కులు దిగువకు
- తుంగభద్ర, భీమాల్లో స్థిరంగా కొనసాగుతున్న వరద
- శ్రీశైలం ప్రాజెక్టులోకి 2.95 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 3.58 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- పెన్నాలో స్థిరంగా వరద


శ్రీశైలం 9 గేట్ల ద్వారా నీటి విడుదల

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్: పశ్చిమ కనుమల్లో ఆదివారం విస్తారంగా వర్షాలు కురవడంతో కృష్ణా ప్రధాన పాయలో ఎగువన వరద ప్రవాహం పెరిగింది. కర్ణాటకలోని ఆల్మట్టి నిండుకుండగా మారింది. ఈ ప్రాజెక్టులోకి 1.10 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 1.25 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్‌లోకి చేరిన వరదను చేరినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఉపనది భీమాపై మహారాష్ట్రలో ఉన్న ఉజ్జయిని ప్రాజెక్టు నిండిపోవడంతో ఇక్కడికి చేరుతున్న నీటికంటే అధికంగా దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జూరాల ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరుగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి వరద స్థిరంగా కొనసాగుతోంది. వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. కృష్ణా, తుంగభద్ర జలాలు చేరుతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్ వే 9 గేట్లను 10 అడుగులు ఎత్తి, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయం 14 గేట్లను 10 అడుగులు ఎత్తి, విద్యుదుత్పాదనతో నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతలలోకి వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి 3,65,587 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇందులో కృష్ణా డెల్టాకు 6,657 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన 3,58,930 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. పెన్నాలో ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. అప్పర్ పెన్నార్ నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు 11 ప్రాజెక్టుల గేట్లు ఎత్తేశారు. ఆయకట్టుకు విడుదల చేయగా మిగిలిన 42 వేల క్యూసెక్కుల పెన్నా జలాలను నెల్లూరు బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదిలేస్తున్నారు.

బలహీనపడిన వాయుగుండం

- నేడు, రేపు తేలికపాటి వర్షాలు
- 18న ఉపరితల ఆవర్తనం!



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడి ప్రస్తుతం దక్షిణ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భపై ఉన్న వాయుగుండం సోమవారం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఇది మధ్యప్రదేశ్ మీదుగా వాయవ్య దిశగా కదులుతూ కొద్ది గంటల్లో మరింత బలహీనపడనుందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు అల్పపీడన ప్రాంతం మీదుగా ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి విస్తరించింది. అదే సమయంలో రాష్ట్రంపైకి నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. మంగళవారం తీరం వెంబడి గంటకు 45–55.. గరిష్ఠంగా 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని సూచించింది. మరోవైపు ఈనెల 18న ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. గత 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. చింతూరులో 4 సెంటీమీటర్లు, వీరఘట్టంలో 3.3, జియ్యమ్మవలసలో 3.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



సికింద్రాబాద్‌లో ఘోర అగ్ని ప్రమాదం

కాలినగాయాలు, ఊపిరాడక ఏడుగురు మృత్యువాత

- ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్‌లో చెలరేగిన మంటలు
- పై అంతస్తులోని రూబీ లాడ్జీలోకి వ్యాపించడంతో దుర్ఘటన
- మరో 13 మందికి తీవ్ర గాయాలు.. కొందరి పరిస్థితి విషమం
- మృతులు ఉత్తర భారతదేశానికి చెందిన వారు..

హైదరాబాద్: ఒక షోరూమ్‌లోని ఎలక్ట్రికల్ బైక్‌ల బ్యాటరీలు పేలడంతో, దాని పైనున్న లాడ్జిలోకి దట్టమైన పొగ, మంటలు వ్యాపించి ఏడుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, ఒక మహిళ ఉన్నారు. మరో 13 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘోర దుర్ఘటన సోమవారం రాత్రి సికింద్రాబాద్‌లో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. సెయింట్ మేరీస్ రోడ్డులోని మనోహర్ థియేటర్ ఎదురుగా రంజిత్ సింగ్ బగ్గా అనే వ్యక్తి రూబీ ఎలక్ట్రికల్ స్కూటర్స్ పేరుతో బైక్‌ల షోరూమ్ నిర్వహిస్తున్నారు. ఈ షోరూమ్ సెల్లార్‌లో ఉండగా, నాలుగు పై అంతస్తుల్లో రూబీ డీలక్స్ హోటల్ నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 9.30 గంటలకు సెల్లార్‌లోని షోరూమ్‌లో ఉన్న ఎలక్ట్రికల్ బైక్‌ల బ్యాటరీలు భారీ శబ్దాలతో పేలాయి. దీంతో పై నాలుగు అంతస్తుల్లోని లాడ్జీ గదుల్లోకి దట్టమైన పొగ, మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కొంతమంది హుటాహుటిన హోటల్ గదుల నుంచి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. కొందరు మాత్రం దట్టమైన పొగ కారణంగా బయటకు రాలేక గదుల్లో చిక్కుకుపోయారు.

ఎటు చూసినా పొగే..

వ్యాపారాల నిమిత్తం ఉత్తర భారత దేశం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు 23 మంది హోటల్‌లో ఉన్నట్లు తేలింది. దట్టమైన పొగ వల్ల చాలా మంది పై నుంచి కిందకు దిగేందుకు వీలులేకుండా పోయింది. ఓ మహిళతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు డ్రైనేజీ పైప్‌ల ద్వారా మూడు, నాలుగు అంతస్తుల నుంచి కిందకు దిగారు. వీళ్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అలాగే దీన్ని ఆనుకుని ఉండే యాత్రి ఇన్ హోటల్ మీదుగా మరి కొంత మంది ప్రాణాలతో బయట పడ్డారు. వీరికి సైతం ఊపిరితిత్తుల్లోకి పొగ చేరడంతో గాలి తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. ఫైర్ సిబ్బంది స్కారికల్ వాహనం ద్వారా కొంత మందిని కిటికీల నుంచి బయటకు రప్పించి రక్షించారు. ఒక మహిళతో పాటు మరో ముగ్గురు గదుల్లో అపస్మారక స్థితిలో పడిఉండగా బయటకు తీసి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. కాలిన గాయాలైన వారిని గాంధీ ఆస్పత్రికి, మిగతా వారిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. మార్కెట్ పోలీసులు, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సిబ్బంది, డీఆర్ఎఫ్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో స్థానికులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా, అంతా క్షణాల్లో జరిగిపోయిందని ఈ ప్రమాదం నుంచి బయట పడిన చెన్నైకి చెందిన కేశవులు, ఒడిశాకు చెందిన ఉమేష్ ఆచార్య తెలిపారు. ఇది తమకు మరో జన్మ అని చెప్పారు.

కుప్పంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 200 మంది..

కుప్పం రూరల్(చిత్తూరు): కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం, గుడుపల్లె మండలాలకు చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు 200 మంది సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ సభ్యత్వం పొందిన గుర్తింపు కార్డులు చేతపట్టుకుని ఎమ్మెల్సీ భరత్ కార్యాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరంతా శాంతిపురం మండలం కడపల్లి, కర్లగట్ట, ప్రీతిశ్యామనూరు, మొరసనపల్లి, 7వ మైలు, గుడుపల్లె మండలానికి చెందిన ఆరు పంచాయతీల్లోని టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు. వారికి మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు.


గుర్తింపు కార్డులు చూపుతూ వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

సీఈఓగా రోబో!



సైన్స్ ఫిక్షన్ సినిమాలా అనిపిస్తున్నా మీరు విన్నది నిజమే! చైనాకు చెందిన ఫుజియన్ నెట్ డ్రాగన్ వెబ్‌సాఫ్ట్ అనే ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ కృత్రిమ మేధ (ఏఐ)తో వర్చువల్‌గా పనిచేసే హ్యూమనాయిడ్ రోబో 'మిస్ టాంగ్ యూ'ని తమ రొటేషనల్ సీఈఓగా నియమించింది. ప్రపంచంలో మొట్టమొదటి రోబో సీఈఓగా టాంగ్ యూ చరిత్ర సృష్టించింది. కంపెనీ సంస్థాగత విషయాలతోపాటు సామర్థ్యం పెంపు వ్యవహారాలను సైతం ఈ రోబో చక్కబెట్టనుంది. దాదాపు రూ. 80 వేల కోట్ల విలువ కలిగిన ఈ కంపెనీ కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత టాంగ్ యుపై పెట్టింది యాజమాన్యం. పనుల నాణ్యతను పరిశీలించడం, అమలు వేగాన్ని పెంచడం, రోజువారీ కార్యకలాపాల్లో తీసుకునే నిర్ణయాలు, రిస్క్ మేనేజ్‌మెంట్‌లో టాంగ్ యూ కీలకపాత్ర పోషించనుంది. అలాగే విశ్లేషణ సాధనంగా కూడా పనిచేయనుందని కంపెనీ తెలిపింది. ఉద్యోగుల ప్రతిభను గుర్తించడం, అందరికీ సమన్యాయాన్ని వర్తింపజేయడం వంటి పనులను కూడా చేస్తుందని కంపెనీ చైర్మన్ డాక్టర్ డేజియన్ లియూ తెలిపారు. రాబోయే 30 ఏళ్లలో ఏదో ఓ రోజు బెస్ట్ సీఈవోగా ఓ రోబో టైమ్ మ్యాగజైన్ కవర్‌పేజీపై నిలవడం తథ్యమని అలీబాబా వ్యవస్థాపకుడు, చైర్మన్ అయిన జాక్ మా 2017లో చెప్పారు. ఇప్పుడు ఓ రోబో సీఈఓగా నియామకం అయ్యింది.

కాపాడిన స్మార్ట్‌వాచ్



స్మార్ట్ వాచ్... ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడింది. వాచ్ ప్రాణాలు కాపాడమేంటి? అదెలా సాధ్యమైందని ఆశ్చర్య పోతున్నారా? అదెలా జరిగిందంటే... యూకేకు చెందిన 54 ఏళ్ల డేవిడ్‌కు ఇటీవల పుట్టినరోజు సందర్భంగా అతని భార్య సారా, యాపిల్ స్మార్ట్ వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. అది మణికట్టుకు పెట్టుకోగానే.. పల్స్‌రేట్ 30గా చూపించింది. సాధారణంగా ఆ వయసులో ఉన్న పురుషుల హృదయ స్పందనలు నిమిషానికి 100 చొప్పున ఉండాలి. కానీ డేవిడ్‌కు 30 మాత్రమే నమోదవుతుండటంతో వాచ్ సరిగ్గా పనిచేయట్లేదేమోనని డేవిడ్ అనుకున్నాడు. కానీ అతని భార్య పదేపదే వెంటపడటంతో హాస్పిటల్‌కు వెళ్లాడు. ఎమ్ఆర్ఐ స్కాన్ చేయిస్తే... అతను కార్డియాక్ అరెస్టుతో మృతి చెందే అవకాశం ఉందని డాక్టర్లు హెచ్చరించారు. హార్ట్ బ్లాక్ వల్ల గుండెలోని 'జంక్షన్ బాక్స్' పనిచేయడం ఆగిపోతోందన్నారు. అలా 48 గంటల్లో 138 సార్లు పదేసి సెకన్లపాటు అతని గుండె పనిచేయడం మానేసింది. డేవిడ్ నిద్రిస్తున్న సమయంలో ఇలా జరిగిందట. అంతేకాదు.. అది ఆగిపోయినప్పుడు అతని గుండెలోని మరో భాగం రక్త ప్రవాహాన్ని కిక్ స్టార్ట్ చేసిందన్నమాట. గుండె సంబంధిత జబ్బు లక్షణాలు కనిపించకపోవడం, అతను ఆరోగ్యంగా ఉండటం చూసి డాక్టర్లు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చివరకు సర్జరీతో గుండెలోని బ్లాక్స్‌ను తొలగించారు.

ఆత్మీయ ఆదరణ..

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి ఆత్మీయ ఆదరణ లభిస్తోంది. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అర్హులకు అవి అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.



శ్రీకాకుళం జిల్లా కె.మత్స్యలేశంలో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ధర్మాన

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలకేంద్రంలో దివ్యాంగుడు ఖాదర్ వల్లీ యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి




నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

పుష్కర కాలానికి పూసిన నీలకురింజి



ప్రతి సీజన్‌లో వచ్చే పూలను చూస్తేనే మనసు పులకిస్తుంది. అటువంటిది పుష్కరానికి ఒకసారి మాత్రమే పూసే అరుదైన పుష్పాలను చూసినప్పుడు ప్రత్యేకమైన అనుభూతి కలుగుతుంది. ఇదే పరిస్థితి ఇప్పుడు కర్ణాటక– కేరళ సరిహద్దుల్లో పశ్చిమ కనుమల్లోని అరణ్య లోయలలో కనిపిస్తోంది. అక్కడ 12 ఏళ్లకు ఒకసారి పూసే నీలకురింజి పుష్పాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సోమవారం కర్ణాటకలోని చిక్కమగళూరుకు సమీపంలో విరిసిన నీలకురింజి పుష్పాలు ఇవి.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తగ్గిన ఉత్తీర్ణత శాతం


- గతేడాది 29.54 ఉత్తీర్ణత శాతం
- ఈ ఏడాది 26.17 శాతమే
- క్వాలిఫైడ్ మార్కులూ తగ్గుదల



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2022లో గతంతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం తగ్గింది. అలాగే ఈ ఏడాది పరీక్ష రాసినవారి సంఖ్య కూడా తక్కువ ఉంది. కరోనా సమయంలో కన్నా ఈసారి విద్యార్థుల సంఖ్య మరింత తగ్గిపోవడం గమనార్హం. గత నాలుగేళ్ల గణాంకాలను గమనిస్తే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోంది. జేఈఈ మెయిన్‌లో మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన టాప్ 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారనే విషయం తెలిసిందే. అయితే 2.50 లక్షల మందికి అవకాశమిస్తున్నా అందులో లక్ష పైనే విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేయడం లేదు. అలా దరఖాస్తు చేసిన వారిలోనూ పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య మరింత తగ్గుతోంది. 2019లో 2.50 లక్షల మందికి గాను 1,74,432 మంది మాత్రమే పరీక్ష రాశారు. ఈ ఏడాది 1,55,538 మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

సంవత్సరాల వారీగా హాజరు, ఉత్తీర్ణత, శాతం ఇలా..

2019	1,74,432	38,705	22.18
2020	1,50,838	43,204	28.64
2021	1,41,699	41,862	29.54
2022	1,55,538	40,712	26.17



జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు బాలురు, బాలికల హాజరు, ఉత్తీర్ణత ఇలా..

	బాలురు			బాలికలు		
ఏడాది	హాజరు	ఉత్తీర్ణత	శాతం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2022	1,20,413	34,196	28.39	35,125	6,516	18.55
2021	1,07,174	35,410	33.03	34,525	6,452	18.68
2020	1,15,717	36,497	31.53	35,121	6,707	19.09
2019	1,37,763	33,349	24.20	36,669	5,356	14.60

ర్యాంకుల ఖరారుకు అర్హత మార్కులు తగ్గుదల

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుల ఖరారుకు కనీస అర్హత మార్కులు కూడా గతేడాదికన్నా ఈసారి తక్కువగా ఉన్నాయి. గతేడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కామన్ ర్యాంక్ లిస్టు (సీఆర్ఎల్/జనరల్) కనీస అర్హత మార్కులు 63 కాగా ఇప్పుడు 55 మార్కులకు తగ్గింది. అన్ని కేటగిరీల్లోనూ ఈ తగ్గుదల ఉంది.

కేటగిరీల వారీగా అర్హత మార్కులు..

కేటగిరీ	2021	2022
జనరల్	63	55
ఓబీసీ	56	50
ఈడబ్ల్యూఎస్	56	50
ఎస్సీ	31	28
ఎస్టీ	31	28
దివ్యాంగులు	31	28

సూపర్ న్యూమరరీ సీట్లు ఇస్తున్నా..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో బాలికల ఉత్తీర్ణత శాతం కన్నా బాలుర ఉత్తీర్ణత శాతమే ఎక్కువగా ఉంటోంది. ఐఐటీల్లో బాలికల చేరికలు పెంచడానికి ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా సూపర్ న్యూమరరీ సీట్లను ఏర్పాటు చేస్తోంది. అయినా అడ్వాన్స్‌డ్ బాలికల హాజరు, ఉత్తీర్ణత శాతాలే తక్కువగానే ఉంటున్నాయి. 2019లో పరీక్ష రాసిన 1,74,432 మందిలో బాలురు 1,37,763 మంది కాగా బాలికలు 36,669 మంది మాత్రమే. వారిలో అర్హత శాతాన్ని పరిశీలిస్తే.. బాలురు 24.20 శాతం ఉండగా బాలికలు 14.60 శాతం మాత్రమే అర్హత సాధించారు. ఇక ఈ ఏడాది (2022) బాలురు 1,20,413 మంది పరీక్ష రాయగా వారిలో 34,196 మంది (28.39 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల్లో 35,125 మంది పరీక్ష రాయగా 6,516 (18.55 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 2022 జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆలిండియా టాప్ 10 ర్యాంకులన్నీ బాలురకే దక్కడం గమనార్హం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.